అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
బుధవారం 16-8-2017
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 3 సంచిక : 229 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 32 పేజీలు వెల : 5.00


ఎర్రకోట వద్ద ప్రధాని మోడీ

దివ్య-భవ్య భారత్ వైపు
అడుగులేద్దాం

ఉగ్రవాద, మతతత్వ, కులతత్వరహిత 'నవభారతం' నిర్మిద్దాం

దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు

- నోట్లరద్దు నిర్ణయానికి సమర్థన
- ఉగ్రపోరులో ఇతర దేశాలు కలిసొస్తున్నాయని వెల్లడి
- ఎర్రకోట బురుజు నుంచి నాలుగోసారి ప్రసంగం

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

'టీం ఇండియా' స్ఫూర్తితో 'నూతన భారత' నిర్మాణానికి దేశ ప్రజలు సంకల్పించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. భారతదేశం స్వాతంత్ర్యం పొంది 75 వసంతాలు పూర్తి చేసుకోనున్న 2022 సంవత్సరం వరకు 'దివ్య-భవ్య భారత్' కలల వైపు అడుగులేద్దామని సూచించారు. ఈ నూతన భారతం ఉగ్రవాద, మతతత్వ, కులతత్వ రహితంగానూ... అవినీతి, బంధుప్రీతి నిర్మూలించేలా ఉండాలని అన్నారు. పేదలకు పక్కా ఇండ్లు, రైతుల ఆదాయం రెట్టింపు, మహిళలకు, యువకులకు సరైన అవకాశాలు దక్కే నవభారతాన్ని కాంక్షించారు. ఇక కాశ్మీర్‌లో బుల్లెట్ల ద్వారా కాకుండా ప్రతి కాశ్మీరీని హత్తుకుని పరిష్కారం చూపుతామని చెప్పారు. నోట్లరద్దు వల్ల మూడు లక్షల కోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయని వివరించారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఢిల్లీలోని ఎర్రకోట వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 55 నిమిషాల పాటు సాగిన ఆయన ప్రసంగంలో నోట్లరద్దు, జీఎస్టీ, ఉగ్రవాదం, సమాఖ్య వ్యవస్థ లాంటి పలు అంశాలను ప్రస్తావించారు. అయితే చైనాతో నెలకొన్న ప్రతిష్టంభన, భారత్-పాక్ సరిహద్దు వద్ద కాల్పుల అంశాలను ప్రధాని ప్రస్తావించలేదు. ప్రధానంగా నూతన భారతాన్ని ప్రస్తావిస్తూ.. 'నూతన భారతం సంకల్పంతో దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. సురక్షితమైన, శక్తివంతమైన, సమృద్ధమైన దేశాన్ని నిర్మించాలి. అక్కడ అందరికీ సమాన అవకాశాలు దక్కాలి. ఆధునిక విజ్ఞానం, సాంకేతిక ...9లో

ఈ ఐదు సవాళ్ల సంగతేంటి? 2లో

యువతకు ఉద్యోగ భరోసా



గోల్కొండ కోటలో సీఎం కేసీఆర్

సత్వరమే 84,876 పోస్టుల భర్తీకి చర్యలు

- ఇప్పటి వరకూ చేపట్టిన 27,660 నియామకాలకు ఇవి అదనం
- అభివృద్ధి, సంక్షేమం మా రథానికి రెండు చక్రాలు 9లో
- సమానత్వం, సామాజిక న్యాయం మా ఉదాత్త లక్ష్యాలు : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

"తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే.. ఒక లక్ష మందికి నూతనంగా ఉద్యోగాలు లభిస్తాయని ఉద్యమ సమయంలో భావించాం. ఈ పవిత్ర స్వాతంత్ర్య దినోత్సవ వేళ తెలంగాణ నిరుద్యోగ యువతకు ఒక శుభవార్తను తెలియచేస్తున్నాను"
-సీఎం కేసీఆర్

నిరుద్యోగులకు టీఎస్‌పీఎస్సీ కానుక 9లో

వేదికపై నుంచి దిగిపోండి

ఆర్థికవేత్త జాన్ డ్రేజీ ప్రసంగాన్ని అడ్డుకున్న బీజేపీ నేతలు



రాంచి: ప్రముఖ ఆర్థికవేత్త జాన్ డ్రేజీ ప్రసంగానికి బీజేపీ నేతలు అడ్డు తగిలారు. మాట్లాడడం పూర్తి కాకుండానే వేదిక మీది నుంచి దిగిపోయేలా ఒత్తిడి చేశారు. ఈ ఘటన జార్ఖండ్‌లోని రాంచిలో ఆదివారం చోటు చేసుకున్నది. రాంచిలో ఓ హిందీ దినపత్రిక ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డ్రేజీ హాజర య్యారు. ఈ క్రమంలో సమావేశానుద్దేశించి ఆయన మాట్లాడు తున్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను మహాత్మగాంధీకి ఆపాదిస్తూ ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం తప్పుదారి పట్టిస్తోందని విమర్శించారు. స్వయాన రాష్ట్ర ప్రభుత్వమే కులాల మధ్య వైరాన్ని సృష్టించినప్పుడు మతతత్వం మరింత ప్రమాదకరంగా మారుతుందన్నారు. (క్రిస్టియన్లనే లక్ష్యంగా చేసుకొని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన వివాదాస్పదమైంది. గిరిజనుల మతమార్పిడికి క్రిస్టియన్ మిషనరీలు ప్రయత్నిస్తున్నాయని గాంధీజీ అన్నట్టుగా అడ్వర్‌టైజ్‌మెంట్‌లో పేర్కొన్నది). రాష్ట్రంలో నేరాలు, మత ఘర్షణలు పెరుగుతుండడంపై కూడా డ్రేజీ ఆందోళన వ్యక్తం చేశారు. డ్రేజీ అలా మాట్లాడటాన్ని సహించలేని కేంద్రమంత్రి రాధామోహన్ సింగ్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి రణ్‌దీర్ సింగ్, పట్టణాభివృద్ధి శాఖమంత్రి సీపీ సింఘేర్, మరికొందరు తమ సీట్లల్లో నుంచి లేచి ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రేజీ.. స్టేజీ మీది నుంచి దిగిపో వాలని పట్టుబట్టారు. దీంతో డ్రేజీ తన ప్రసంగాన్ని అర్థాంతరంగా ముగించారు.

రాజ్‌భవన్ ఎదుట సామాజిక కార్యకర్తల ఆందోళన

డ్రేజీ పట్ల మంత్రులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ జార్ఖండ్ రాజ్‌భవన్ ఎదుట సామాజిక కార్యకర్తలు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. డ్రేజీని అవమానించిన వారందరూ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో స్వామి, బలరాం, పిపి వర్మ, కుమార వరుణ్, నదీమ్, తదితరులు పాల్గొన్నారు. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న అసహనానికి ఈ ఘటన నిదర్శనమని కార్యకర్తలు అన్నారు. మతమార్పిడిపై రాష్ట్రప్రభుత్వం వివాదాస్పద ప్రకటన విడుదల ...9లో

సీఎం స్పీచ్‌పై సెన్సార్

త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్‌పై కేంద్రం చర్య

- ఖండించిన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో
- హక్కుల ఉల్లంఘనకు పాల్పడిందంటూ మోడీ సర్కార్‌పై మండిపాటు



న్యూఢిల్లీ: త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ ప్రసంగాన్ని సెన్సార్ చేయడానికి ప్రయత్నించడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాణిక్‌సర్కార్ చేసిన ప్రసంగం ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్‌లో ప్రసారం కాకుండా అడ్డుకున్నారు. రేడియో, దూరదర్శన్ ముఖ్యమంత్రి ప్రసంగాన్ని రికార్డు చేయగా, దానిని యథాతథంగా ప్రసారం చేయలేమని, మార్పులు చేయాలంటూ మాణిక్ సర్కార్‌కు ప్రసార భారతి సమాచారమిచ్చింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ముఖ్యమంత్రి తన రాష్ట్ర ప్రజలకిచ్చే సందేశాన్ని అడ్డుకోవడం హక్కుల ఉల్లంఘనగా పొలిట్‌బ్యూరో తమ ప్రకటనలో పేర్కొన్నది. రేడియో, దూరదర్శన్, ప్రసార భారతికి స్వతంత్రత లేకుండా కేంద్రం అడ్డుకుంటున్నదని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ చర్య ఎమర్జెన్సీ రోజుల్ని గుర్తు చేస్తున్నదని పొలిట్‌బ్యూరో తెలిపింది. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని అడ్డుకున్నవారిపై చర్యలకు పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ప్రసార భారతిని సమాచార, ప్రసార మంత్రిత్వశాఖలో భాగంగా పరిగణించడాన్ని మోడీ ప్రభుత్వం మానుకోవాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.



బ్లూ వేల్ లింకులను తొలగించండి

గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ: విద్యార్థుల పాలిట ప్రాణ సంకటంగా మారిన ఆన్‌లైన్ ఆట బ్లూ వేల్ లింకులను వెంటనే తొలగించాలని ఇంటర్నెట్ దిగ్గజ సంస్థలు గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్, యాహూలను కేంద్రం ఆదేశించింది. బ్లూ వేల్ చాలెంజింగ్ గేమ్ ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న సంగతి తెలిసిందే. యాభై రోజుల బ్లూవేల్ టాస్క్‌లో కొన్ని పనులు అప్పగిస్తారు. ఆ పనులు చేశారా? లేదా? అన్న నిర్ధారణ కోసం ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ఆట ఆడుతూ దేశంలో ముగ్గురు.. అమెరికా, చైనా, తదితర దేశాల్లో 130 మందికి పైగా ఆత్మహత్య ...9లో

బోరుబావిలో పడ్డ చిన్నారి

ఏపీలోని గుంటూరు జిల్లా వినుకొండ మండలంలో ఘటన

- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు
- రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు 7లో


(ఫైల్)

పంద్రాగస్టు వేళ.. మైనరుపై

స్కూల్ నుంచి తిరిగి వెళుతుండగా ఛండీగఢ్‌లో దారుణం

రాయ్‌పూర్ : పాఠశాలలో జెండావందన కార్యక్రమానికి ఎంతో హుషారుగా వెళ్ళిన చిన్నారి... కళ్లు తేలేస్తూ తిరిగి వచ్చింది. స్వాతంత్ర్య దినోత్సవం సాక్షిగా... ఛండీగఢ్‌లో మైనరుపై లైంగికదాడికి పాల్పడ్డాడు ఓ కామాంధుడు. బాధితురాలి నివాసానికి సమీపంలో ఉన్న చిన్నపిల్లల పార్కుకు తీసుకెళ్లి.. అఘాయిత్యానికి పాల్పడ్డాడు.. గవర్నమెంట్ మోడల్ సీనియర్ సెకండరీ స్కూల్ నుంచి జెండావందన కార్యక్రమం ముగించుకుని తిరిగి వస్తున్న తన కుమార్తె లైంగికదాడి జరిగినట్టు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి తిరిగివచ్చిన బాలిక విషయాన్ని తల్లికి చెప్పడంతో... వారు పోలీసులను ఆశ్రయించారు. ఎస్-ఎస్పీ సహా పోలీసు అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి పార్కులో సోదాలు నిర్వహించారు. ఆ పార్కులో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. బాధిత మైనర్‌ను ఆస్పత్రికి తరలించారు.



ప్రిన్సిపాల్‌పై దౌర్జన్యం

ముువ్వన్నెల జెండా రెపరెపలాడుతున్న సమయాన హిందూత్వవాదులు రెచ్చిపోయారు. ముస్లిం ప్రిన్సిపాల్ జెండా ఎగురవేయడాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఆ ప్రిన్సిపాల్ చేయిపట్టుకుని రోడ్డుపైకి లాక్కెళ్తూ దౌర్జన్యం చేశారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామంలో మంగళవారం కలకలం రేపింది.

స్వాతంత్ర్య వేడుకల్లో నుంచి బయటకు లాక్కెళ్లిన వైనం

- ఐలాపూర్ కాలేజీ వద్ద భారత్‌మాతాకీ జై నినాదాలు
- సోషల్ మీడియాలో యువత ఆగ్రహం

నవతెలంగాణ-నందిపేట్

71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఐలాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ మహమ్మద్ యాకునుద్దీన్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ సుదర్శన్, సొసైటీ చైర్మెన్ లక్ష్మీనారాయణ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా కొందరు ఏబీవీపీ, బీజేపీ, భజరంగ్‌దళ్ నాయకులు జెండాను ఆవిష్కరించిన ప్రిన్సిపాల్‌ను అడ్డుకున్నారు. బూట్లు వేసుకుని జెండాను ఆవిష్కరిస్తావా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఒక్కసారిగా వంద మంది యువకులు అక్కడికి చేరుకోవడం గందరగోళ పరిస్థితికి దారితీసింది. అంతటితో ఆగని హిందూత్వవాదులు ప్రిన్సిపాల్ చేయి పట్టుకుని బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. వస్తానని చెప్పున్నప్పటికీ వారు వినకుండా నినాదాలు కొనసాగించారు. కాలేజీ బయటకు తీసుకెళ్లి ప్రిన్సిపాల్ చుట్టుముట్టారు. అక్కడే బైటాయించి 'భారత్ మాతాకీ జై.. భారత్ ...9లో


ప్రిన్సిపాల్‌ను బలవంతంగా బయటకు తీసుకెళ్తున్న హిందుత్వ శక్తులు

జుట్టుపట్టి ఈడ్చి తన్నాడు...

ఫోన్ మాట్లాడుతున్న యువతిపై ఖాకీ కండ కావరం



పాట్నా : రోడ్డుమీద ఫోన్ మాట్లాడుకుంటూ వెళుతున్న యువతిపై ఓ పోలీసు అధికారి వీరంగం ప్రదర్శించాడు. మహిళ అని కూడా చూడకుండా... ఖాకీ కావరం ప్రదర్శించాడు.. జుట్టుపట్టుకుని ఈడ్చి పడేశాడు. ఇదంతా జనం సాక్షిగా జరగడం గమనార్హం. ఆమెను రక్షించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. బీహార్‌లోని నలంద ప్రాంతంలోని జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనలో ఆమె చేసిన నేరమేమిటి? ఒక పోలీసు అధికారి ఆమెపై అంతలా చేయిచేసుకోవడానికి దారితీసిన పరిస్థితి ఏమిటి? వివరాల్లోకి వెళితే.. ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుకుంటూ... జాతీయ రహదారిపై ఆమె ఒంటరిగా వెళుతోంది. ఆమె ఫోన్‌లో తన బాయ్‌ఫ్రెండ్‌తో మాట్లాడుతున్నది. మఫ్టీ దుస్తుల్లో ఉన్న పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ...9లో

జాతీయతను విషతుల్యం చేయడాన్ని ఓడిద్దాం

- మత సంకుచితత్వం, విద్వేషం ప్రమాదకరం : స్వాతంత్ర్య వేడుకల్లో కేరళ సీఎం విజయన్



తిరువనంతపురం : జాతీయతను విషతుల్యం చేయడాన్ని ఓడించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. భిన్నత్వం, లౌకికవాదం, ప్రజాస్వామిక విలువలతో మన దేశ జాతీయత నిర్మితమైనదని ఆయన అన్నారు. జాతీయత అంటే సంకుచితమైన మత జాతీయత, విద్వేషం కాదని ఆయన అన్నారు. అటువంటి జాతీయత దేశానికి ప్రమాదకరమని ఆయన స్పష్టం చేశారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో నిర్వహించిన 71వస్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. జాతీయవాదం అంటే ఇతర మతస్తులు, ఇతర భాషలవారు, ఇతర జాతీయులను ద్వేషించడం కాదని విజయన్ స్పష్టం చేశారు. యూపీలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులు మృతి చెందిన ఘటనను గుర్తు చేస్తూ ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. ఆక్సిజన్ లేక చిన్నారులు మృతి చెందిన సమయంలో స్వాతంత్ర్య వేడుకలను ఎవరైనా సంతోషంగా జరుపుకోగలరా..? అని ఆయన ప్రశ్నించారు. చిన్నారుల మృతి పూడ్చ లేని నష్టమని ఆయన అన్నారు. వారి కుటుంబసభ్యులకు విజయన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కులం,మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా ప్రజలు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని ఆయన గుర్తు చేశారు. జాతీయతలోకి మత సంబంధమైన అంశాలను చొప్పిస్తే పౌరుల మధ్య ఐక్యత ప్రమాదంలో పడుతుందని, దేశ సమగ్రత దెబ్బతింటుందని ఆయన అన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే స్వాతంత్ర్యానికి విలువ లేదు : మాణిక్ సర్కార్



అగర్తల : పేదరికం, అవిద్య, నిరుద్యోగం.. వంటి సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించకుంటే స్వాతంత్ర్య సముపార్జన లక్ష్యాలు విఫలమైనట్టేనని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు పూర్తయినా పేదరికం, నిరక్షరాస్యత, అణిచివేత, సంపద పంపిణీలో అసమానతలు.. వంటి సమస్యలు ఎదుర్కొంటున్నామని, దీంతో యువత తీవ్ర నిస్పృహకు గురవుతున్నారని మాణిక్ సర్కార్ తెలిపారు. ఇక్కడ అస్సాం రైఫిల్స్ గ్రౌండ్‌లోని జరిగిన 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 'దేశంలో 90 శాతం సంపద కేవలం ఒక్క శాతం మంది వద్దే పోగుబడి వుందని, మిగిలిన సంపద కూడా 7 శాతం మంది వద్దే వుంది. ఇలాంటి పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోతే సామాన్యుడికి స్వాతంత్ర్య ఫలం ఎలా సిద్ధిస్తుంది' అని మాణిక్ సర్కార్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలతో రోజులు గడుస్తున్నకొద్దీ దేశంలో ధనిక, పేదల మధ్య అంతరం పెరుగుతోందని విమర్శించారు. నిరుద్యోగ సమస్య కూడా దేశానికి ప్రమాదకరంగా మారిందని అన్నారు. చిన్న రాష్ట్రాలుగా విభజన అనే డిమాండ్లపై కూడా మాణిక్ సర్కార్ ఆందోళన వెలిబుచ్చారు. ప్రత్యేక రాష్ట్రం డిమాండ్‌లతో శాంతికి విఘాతం కలిగించడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వాటిని విఫలం చేయడానికి మనం కృషి చేయాలన్నారు. చిన్న రాష్ట్రాల పట్ల ప్రజలు అనుకూలంగా లేరని అనేక సార్లు నిరూపించబడిందని, అయినా అలాంటి అభివృద్ధి నిరోధక ప్రయత్నాలు జరుగుతున్నాయని సర్కార్ విమర్శించారు.

లౌకికతత్వం కోసం పోరాడుదాం

- బెంగాల్‌లో సీపీఐ(ఎం) కార్యకర్తల ప్రతిన

కోల్‌కతా : దేశంలో లౌకికతత్వాన్ని కాపాడుకునేందుకు, సార్వభౌమత్వ, సామ్యవాద సిద్ధాంతాల కోసం పోరాటం చేస్తామని పశ్చిమ బెంగాల్‌లోని సీపీఐ(ఎం) కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శనలు, సభలు జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతిన బూనడం అక్కడి వామపక్ష కార్యకర్తల సంప్రదాయం. పలు పట్టణాల్లో మానవహారాలు ఏర్పాటు చేశారు. కొల్‌కతాలోని పార్క్ సర్కస్ సర్కిళ్ వద్ద నిర్వహించిన మానవహారంలోనూ, అనంతరం జరిగిన బహిరంగ సభలోనూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల్లో నవీన్ పట్నాయక్‌కు అస్వస్థత

భువనేశ్వర్ : మంగళవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఒడిషా ముఖ్యమంత్రి అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. అయితే ఆయన వెంటనే కోలుకున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ మార్గ్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి తన ప్రసంగం చివరిలో అస్వస్థతకు గురయ్యారు. అయితే తరువాత వేదిక వద్దకు చేరుకుని, వందన స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. తరువాత అయనను ఆసుపత్రికి తరలించారు.

నిబంధనలకు పాతరేసిన మోహన్ భగవత్

- ఎయిడెడ్ స్కూల్‌లో జెండా ఎగురవేసిన వైనం..

తిరువనంతపురం: ప్రభుత్వ ఎయిడెడ్ స్కూళ్లలో రాజకీయ, ఇతర సంఘాల నేతలు జాతీయ జెండా ఎగురవేయరాదని నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయి. కానీ, ఇవేం పట్టనట్టు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ వ్యవహరించి జెండాను ఎగురవేశారు. కలెక్టర్ ఆదేశాలను కూడా ఆయన ఖాతరు చేయకపోవడం గమనార్హం. కేరళలోని పాలక్కడ్ జిల్లా కర్నాకియామ్మాన్ ఎయిడెడ్ పాఠశాలలో భగవత్ మంగళవారం ఉదయం 9 గంటలకు జెండా ఎగురవేసేందుకు షెడ్యూల్ ఖరారైంది. కాగా.. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా కలెకర్ మేరి కుట్టీ సోమవారం స్కూల్ యాజమాన్యానికి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఎయిడెడ్ పాఠశాలలో రాజకీయ, అనుబంధ సంఘాల నేతలు జెండా ఎగురవేయడానికి వీల్లేదని తెలిపారు. స్కూల్‌లో పని చేస్తున్న వారెవరైనా లేదంటే ఎన్నికల ప్రక్రియ ద్వారా గెలుపొందిన ప్రజాప్రతినిధులు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్కూల్ యాజమాన్యం.. భగవత్ దృష్టికి తీసుకొచ్చారు. కానీ, కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని ఆయన షెడ్యూల్ ప్రకారమే జెండా ఎగురవేశారు. పైగా.. జెండా కోడ్ ప్రకారం.. త్రివర్ణ పతాకాన్ని ఎవరైనా, ఎక్కడైనా ఎగురవేయవచ్చని ఆర్ఎస్ఎస్ నేతలు చెబుతుండడం గమనార్హం.

బీహార్‌లో భారీగా వరదలు : 41 మంది మృతి

పాట్నా : కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బీహార్ అతలాకులమవుతున్నది. వరదల కారణంగా ఇప్పటికే 41 మంది మృతి చెందినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అనధికారిక సమాచారం ప్రకారం.. 85 మందికి పైగా చనిపోయినట్టు తెలుస్తున్నది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 65.37 లక్షల మంది నిరాశ్రయులైనట్టు అధికారులు మంగళవారం వెల్లడించారు. వరద ఉధృతికి వేలాది గుడిసెలు నీటిలో కొట్టుకుపోయాయని చెప్పారు. భవనాలు, రోడ్లు, వంతెనలు భారీగా దెబ్బతినడమే కాక, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. కిషన్‌గంజ్, అరారియా, పూర్ణియా, కతిహార్ జిల్లాల్లోనే దాదాపు 30 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. గడిచిన రెండు రోజులో రాష్ట్రంలో 1.82 లక్షల మందిని రెస్క్యూ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. జాతీయ రహదారుల వెంట, స్కూళ్లు, ప్రభుత్వ భవనాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరద ప్రభావిత జిల్లాల్లో పని చేస్తున్న డాక్టర్లు, ఆరోగ్య శాఖ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు రద్దు చేసింది. వర్షాలు ఇప్పటికీ తగ్గుముఖం పట్టనందున లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని రాష్ట్ర విపత్తు నిర్వహణా బృందం హెచ్చరికలు జారీ చేసింది.

మోడీ స్పీచ్ మధ్యలో నల్ల పతంగి

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం




ఢిల్లీ : ఎర్రకోటపై నుంచి ప్రధాని మోడీ తన ప్రసంగంలో..అభివృద్ధి గురించి చెబుతున్నారు. ఇతంలో గాల్లో ఎగురుతున్న తెల్లటి టెంట్‌కు సమీపంలో.. నల్ల పతంగి వచ్చిపడింది. దాన్ని మోడీ చూశారు. మధ్యలో ఆపేస్తే..ఏమవుతుందనుకున్నారో తన స్పీచ్‌ను కొనసాగించారు. అక్కడ ఉన్న అధికార యంత్రాంగమంతా ఉరుకులు పరుగులు దీశారు.కాగా ప్రధాని భద్రత చర్చనీయాంశమైంది. 500 మంది స్పెషల్ కమాండోలు, 9100 మంది ఢిల్లీ పోలీసు బలగాలు మోహరించారు. నేలనుంచి నింగి దాకా సెక్యూరిటీ భారీబందోబస్తు ఏర్పాటు చేశారు.వీవీఐపీలు కూడా హాజరైన వేళ..భద్రత అంశంపై చర్చకు అవకాశమిచ్చింది.

ఈసారికి ఇంతే..

55 నిమిషాలకే ప్రధాని ప్రసంగం పరిమితం

2016...ప్రధాని మోడీ 94 నిమిషాల సేపు ప్రసంగించి.ఎర్రకోట వద్ద ప్రసంగించిన ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న ప్రసంగ రికార్డును బద్దలు కొట్టారు. బాగానే ఉన్నది ఇప్పుడెందుకు కేవలం 55 నిమిషాల్లోనే ప్రసంగాన్ని ముగించారు. నల్ల పతంగి పడిందని స్పీచ్ తగ్గించారా? లేక జనంపై భారాలు వేసి..తాను చెప్పే ప్రసంగం పూర్తయ్యిందా..అనే చర్చకు తెరలేపారు. 1947లో జవహర్ లాల్‌నెహ్రూ 72 నిమిషాలసేపు మాట్లాడారు. అది దేశ ప్రధానుల్లోనే ఎక్కువ సేపు ప్రసంగించినట్టు రికార్డు కెక్కింది. ఆ తర్వాత మోడీ ప్రధాని హెూదాలో..ఎర్రకోటపై నుంచి.. 2014లో 65 నిమిషాలు,2015లో 86 నిమిషాలు,2016లో 94 నిమిషాల సేపు మాట్లాడారు.కానీ ఈ స్వాతంత్ర్య వేడుకలు జరిగిన నాలుగేండ్లలో.. నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని ఎందుకు తగ్గించారని జనం చర్చించుకుంటున్నారు.



ఈ ఐదు సవాళ్ల సంగతేంటి?

నవతెలంగాణ - జనరల్ డెస్క్

ఎర్రకోటపై ప్రధాని నరేంద్రమోడీ మంగళవారం మరోసారి జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశాన్ని మార్చే కల 2022 నాటికి నెరవేరబోతోందని, దేశంలోని 125 కోట్ల మంది కలసి ఈ కలను నెరవేరుస్తారని, నవ భారత నిర్మాణం జరుగుతుందని మోడీ అన్నారు. పేదరికాన్ని, ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని ప్రధాని నినాదం ఇచ్చారు. స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏండ్లు గడిచిపోయినా.. దశాబ్దాల నాటి ప్రాథమిక సవాళ్ళను దేశం ఇంకా ఎదుర్కొంటూనే ఉంది. ఇప్పటికీ ఈ ప్రాథమిక సవాళ్ల విముక్తి కోసం దేశం ఎదురుచూస్తూనే ఉంది... 2022 నాటికి దేశాన్ని మారుస్తానని, నవ భారత్ నిర్మిస్తానంటున్న ప్రధాని ఈ సవాళ్లకు ఎలాంటి పరిష్కారం ఇస్తారో మాత్రం చెప్పడంలేదు.

వరదలు, కరువు, రైతు ఆత్మహత్యలు



దేశం కొత్త భారత్ దిశగా కదులుతుందని పెద్దలు ప్రకటనలు చేస్తున్నప్పటికీ.. భయంగొలిపే నిజం ఏమిటంటే... దేశంలోని చాలా ప్రాంతాలను ప్రతీ ఏడాది వరదలు ముంచెత్తుతున్నాయి. వందలాది మంది చనిపోతూనే ఉన్నారు. లక్షలాది ఎకరాల్లోని పంటసాగు, గృహాలు నీట మునుగుతున్నాయి. ఇప్పటికే గుజరాత్, రాజస్థాన్, బీహార్, అసోం సహా అనేక రాష్ట్రాలను వరదలు ముంచెత్తుతూనే ఉన్నాయి. ఒక్క బీహార్‌లోనే 45 మంది మృతిచెందారు. 65 మిలియన్ల మంది ప్రజలు వరదల తాకిడికి గురయ్యారు. ఈ పరిస్థితి ప్రతి ఏడాదీ.. ప్రతి రాష్ట్రంలో చోటుచేసుకుంటూనే ఉంది. వరద నిరోధక పథకాలు ప్రభావవంతంగా లేవన్నది వాస్తవం. నీటి వనరులను కాపాడుకునే నిర్దిష్ట ప్రణాళికలేవీ మనకు కనిపించవు. ప్రతి ఏడాదీ రైతు పంట పొలాలు వరద నీటిలో కొట్టుకుపోతుంటే... నవ భారత్ నిర్మాణం ఎలా సాధ్యమవుతుంది? అన్న ప్రశ్నకు మోడీ వద్ద సమాధానం ఉండదు. వరదలొక్కటే కాదు.. ప్రకృతి వైపరీత్యాల్లో వందలాది మంది ప్రజలు మృతిచెందుతున్నారు. అందరికీ తెలిసిన మరో వాస్తవం కరువు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో కరువు కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. రైతుల దీనావస్థ కొనసాగుతూనే ఉంది. అనేక రాష్ట్రాల్లో రైతుల ఆత్మహత్యల పరంపర రోజురోజుకూ పెరిగిపోతోందన్నది వాస్తవం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆందోళనకు దిగిన రైతులపై కాల్పులకు తెగబడి ఆరుగురు రైతుల ప్రాణాలను బలిగొన్న ఘటనా వెలుగుచూసింది. మోడీ అనుంగు శిష్యులే రైతు ఆత్మహత్యలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వార్తలూ చూశాం. కుటుంబ సమస్యలు.. ప్రేమ వ్యవహారాలు... నపుంసకత్వం వల్లే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్న వ్యాఖ్యలు చేస్తున్నారు. రుణ మాఫీ అడగడం ఫ్యాషనైపోయిందని... వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. దేశరాజధానిలో తమిళనాడు రైతులు వినూత్న రీతిలో నిరసనలు వ్యక్తం చేస్తే... ప్రధానికి వినిపించవు.. కనిపించవు. రైతు సమస్యలపై మాట్లాడే తీరిక కూడా లేదు మన ప్రధానికి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇవే సమస్యలు చర్చనీయాంశమయ్యాయి. రుణ మాఫీతో పాటు.. రైతు ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకున్న నిర్దిష్టమైన, సమర్థవంతమైన చర్యలేవీ మనకు కనపడవు.

ఆరోగ్య రంగం ప్రాథమిక సవాళ్లు



దేశం స్వాతంత్ర్యం సాధించి 70 ఏండ్లు పూర్తయినా... ఆరోగ్య రంగం వెనకడుగులోనే... ఉందనడానికి ప్రత్యక్ష నిదర్శనం... గోరఖ్‌పూర్ ఘటన. దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వాస్పత్రిలో ప్రాణవాయువు సరఫరా నిలిచిపోయి.. 73 మంది పసికందులు మృత్యువు ఒడిలో శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. గత 40 ఏండ్లలో ఒక్క గోరఖ్‌పూర్ ఆస్పత్రిలోనే 10 వేల మంది చిన్నారులు చనిపోయినట్టు వార్తలొచ్చాయి. మన ఆరోగ్య రంగంలో కనీస ప్రాథమిక సమస్యలను కూడా పరిష్కరించలేదనడానికి ఈ ఘటనలే సాక్ష్యమని విశ్లేషకుల అభిప్రాయం.. పాఠశాలకు వెళుతున్న చిన్నారులకు ప్రభుత్వం పెడుతున్న మధ్యాహ్న భోజనంలో కూడా పోషక ప్రమాణాలు లేవన్నది వాస్తవం. ఆ భోజనం తిని పిల్లలు చనిపోయిన ఘటనలు సైతం వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవడానికి నిర్దిష్టమైన కార్యాచరణ లేనప్పుడు నవ భారత్ ఎలా సాధ్యమవుతుందని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు.

తీవ్రవాదం



తీవ్రవాదం దేశానికొక సవాలుగా నిలిచింది. ప్రత్యేకంగా కాశ్మీర్‌ను నిరంతరం ఈ సమస్య వెన్నాడుతూనే ఉంది. అదీ మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టాక... కాశ్మీర్‌లో ఉగ్రఘటనలు... ప్రతిష్టంభనలూ మరీ ఎక్కువయ్యాయన్నది నివేదికలు చెబుతున్న వాస్తవాలు. ఉగ్రవాద నిర్మూలనకే పెద్ద నోట్ల రద్దును తీసుకొచ్చినట్టు ప్రధాని మోడీ నోట్ల రద్దు సందర్భంగా తొలి ప్రసంగంలో చెప్పారు. ఆ తర్వాతే కాశ్మీర్‌లో మరింత ప్రతిష్టంభన నెలకొన్నది. కాశ్మీర్ స్వయంప్రతిపత్తిని నీరుగార్చే చర్యలను చేపడుతున్న మోడీ.. అక్కడి ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతను అణిచివేసే చర్యలకు పాల్పడుతున్నారన్న విమర్శలూ వస్తున్నాయి. కాశ్మీర్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకునే దిశగా చర్యలు తీసుకోకపోవటాన్ని విపక్షాలు తప్పుపడుతున్నాయి.

అవినీతి



రాజకీయ నేతలందరి నోళ్ళలో ఏండ్లుగా నానుతున్న ప్రధాన అంశం అవినీతి. అవినీతికి సంబంధించి 176 దేశాల జాబితాలో మన దేశం 79వ స్థానాన్ని ఆక్రమించింది. కోర్టుల్లో అవినీతి కేసులు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. సీబీఐ, ఈడీ, విజిలెన్స్ శాఖలు అవినీతి కేసులపై దర్యాప్తు చేస్తూనే ఉన్నాయి. అయినా.. పరిస్థితిలో ఎలాంటి మార్పు మనం చూడలేదు. మన ప్రస్తుత ప్రధాని అధికారంలోకి రాకముందు.. అవినీతిని పెద్ద భూతంలా చూపించారు. మరో ముఖ్యమైన అంశం విదేశాల్లో మూలుగుతున్న కోట్లాది రూపాయలను రప్పిస్తానని వాగ్దానం చేశారు. దేశ ప్రజల అకౌంట్లలో వాటిని జమ చేస్తానని చెప్పారు. ఇప్పుడు వాటి ఊసే లేదు. మరోవైపు... అవినీతి నిర్మూలన చర్యలంటూ... ప్రతిపక్షాలను లొంగదీసుకునే చర్యలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు తీవ్ర విమర్శలకు గురవుతున్నాయి. కర్నాటక.. బీహార్.. తమిళనాడుల్లో ఐటీ, ఈడీ సోదాలు రాజకీయ కక్షతోనే జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. సొంతపార్టీ నేతలపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు మౌన దీక్షలోకి వెళుతున్నారు. అవినీతి నిర్మూలనకు, విదేశాల్లో మూలుగుతున్న నల్లధనం వెనక్కి తెప్పించే... చర్యలు శూన్యం.

సామాజిక సమానత్వం..



ఆధునిక భారతీయ సమాజంలో సామాజిక సమస్యలు మరింత ముందుకు తోసుకొస్తున్నాయి. రాజస్థాన్‌లో ఇటీవల ఒక దళిత మహిళపై మంత్రగత్తె ముద్రవేసి.. చిత్రహింసలు పెట్టి చంపిన ఘటన సమాజ గమన తీరు ఎటువైపున్నదో స్పష్టం చేస్తోంది. 'గోరక్షణ' పేరుతో ముస్లింలు, మైనార్టీలపై హింసాత్మక ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. బాల్య వివాహాలు, అస్పృశ్యత, వివక్ష, మహిళలు, పసికందులపై లైంగికదాడుల కేసులు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. మహిళలపై దాడులు నేటి సమాజానికి సవాలు విసురుతున్నాయి. ప్రతి ఏడాదీ మహిళా సాధికరాత పేరుతో ప్రణాళికలను ప్రభుత్వాలు ప్రకటిస్తూనే ఉన్నాయి. కానీ, దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి మహిళలు సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు.

ఈ ప్రధాన, ప్రాథమిక సవాళ్లను ఎదుర్కొనే, పరిష్కరించే నిర్దిష్టమైన ప్రణాళికలు, వ్యూహాలు లేకుండా... 2022 నాటికి ప్రజల కలలు నెరవేరతాయని చెప్పడం... నమ్మశక్యంగా లేదని పరిశీలకులు పెదవి విరుస్తున్నారు.

మత స్వేచ్ఛ బిల్లు ద్వారా గిరిజనులను చీల్చే యత్నం

పేరుకే మత స్వేచ్ఛ..ఉద్దేశం మత మార్పిడిని అడ్డుకోవడం

- ప్రత్యేక గుర్తింపునిచ్చే 'సర్నాకోడ్' కోరితే..మా మధ్య చిచ్చు పెట్టారు : జార్ఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై ఆదివాసీ సంఘాల మండిపాటు
- తాము హిందువులమెట్లా అవుతామంటున్న సర్నా గిరిజనులు
- ఆ రాష్ట్ర జనాభాలో 27 శాతం వారే

రాంచి : మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడంలో ఆదివాసీల ప్రత్యేక రక్షణ చట్టాలను కూడా బీజేపీ ఖాతరు చేయడంలేదనేందుకు తాజా ఉదాహరణ జార్ఖండ్. ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఇటీవల ఆమోదం పొందిన మత స్వేచ్ఛ బిల్లు-2017 పట్ల ఆ రాష్ట్ర గిరిజన సంఘాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అది పేరుకే మత స్వేచ్ఛ బిల్లు, అందులోని అంశాలన్నీ మత స్వేచ్ఛను అడ్డుకునేవే. మత మార్పిడి నిరోధానికంటూ బిల్లు ఉద్దేశించినప్పటికీ.. అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టడానికి ఓ రోజు ముందు ఆ రాష్ట్ర ప్రభుత్వం పత్రికలకు విడుదల చేసిన ప్రకటన కూడా వివాదాస్పదంగా మారింది. మహాత్మాగాంధీతోపాటు గిరిజన నేతలు బీర్సాముండా, కార్తీక్ ఒరఆన్ పేర్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం అందులో ఉపయోగించుకున్నది. గిరిజనులను మెప్పించేందుకు రఘుబర్‌దాస్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నమది. ఓవైపు వారి హక్కులను కాలరాసే ప్రణాళికలు, మరోవైపు బుజ్జగించే యత్నం. అయితే,బీజేపీ ద్వంద్వ ప్రమాణాల పట్ల ఆ రాష్ట్రంలోని గిరిజన సంఘాలు, ఆ వర్గపు మేధావులు అప్రమత్తంగానే ఉన్నారని వ్యక్తమవుతున్న నిరసనల ద్వారా అర్థమవుతోంది.

జార్ఖండ్ జనాభాలో గిరిజనులు 27 శాతం. వారిలో ఎక్కువ భాగం సర్నా(ప్రకృతిని ఆరాధించడం)ను అనుసరిస్తారు. కొద్దిమంది క్రిష్టియన్ మతాన్ని అనుసరిస్తారు. ఆ రాష్ట్ర మొత్తం జనాభాలో క్రిష్టియన్ మతస్తులు(2011 లెక్కల ప్రకారం) 4.3 శాతం. తాజా బిల్లుకన్నా ముందు చోటా నాగపూర్ టెనెన్సీ యాక్ట్(సీఎన్‌టీ-1908), సంతాల్ పరగణా టెనెన్సీ(ఎస్‌పీటీ-1949) చట్టాలను సవరించేందుకు బీజేపీ ప్రభుత్వం యత్నించింది. గిరిజనుల వ్యవసాయ భూములకు రక్షణ కల్పించే కౌలుదారీ చట్టాలవి. వాటిని సవరించి పారిశ్రామికవేత్తల వ్యవసాయేతర అవసరాల కోసం గిరిజన భూములను సేకరించేందుకు అక్కడి బీజేపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నమది. జేఎంఎం నేత, ఆ రాష్ట్ర మాజీ సీఎం హేమంత్ సొరెన్, జార్ఖండ్ వికాస్ మోర్చా అధ్యక్షుడు,మాజీ సీఎం బాబూలాల్‌మరాండీసహా గిరిజన నేతలంతా ముక్తకంఠంతో దానిని వ్యతిరేకించారు. అంతేకాదు, గిరిజన సంఘాలతో కలిసి క్రిష్టియన్ సంఘాలు కూడా తీవ్రంగా నిరసించాయి. దాంతో, ఆ రాష్ట్రంలోని గిరిజనులు, క్రిష్టియన్ల మధ్య ఐక్యతను దెబ్బతీసే ఉద్దేశంతతోనే తాజా బిల్లును తీసుకొచ్చారని విమర్శలు వస్తున్నాయి.

దీనిపై ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్ టిర్కీ మాట్లాడుతూ.. 'దేశంలోని పారిశ్రామికవేత్తలకు జార్ఖండ్‌లోని భూమిని అందుబాటులోకి తేవాలన్నది దాస్ ప్రణాళిక. ఆ ఉద్దేశంతోనే సీఎన్‌టీ/ఎస్‌పీటీ సవరణ బిల్లు తేగా, ప్రతిపక్షాలు గట్టిగా వ్యతిరేకించాయి. గవర్నర్ కూడా దాన్ని వెనక్కి పంపారు. భూమి బిల్లును వ్యతిరేకించడంలో సర్నా, క్రిష్టియన్ బృందాలు ఐక్యమయ్యాయి. బీజేపీని దృఢంగా అడ్డుకున్నాయి. ఈ అంశంలో చర్చి కీలక పాత్ర వహించింది. దాంతో,మత స్వేచ్ఛ బిల్లును రెండు లక్ష్యాలతో తెచ్చారు. సర్నా, క్రిష్టియన్ బృందాలను చీల్చడం, చర్చికి గుణపాఠం నేర్పడం' అన్నారు. జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ విద్యార్థి సంఘం జేఎంఎంకు అనుబంధంగా ఉండేది.

సర్నా కోడ్ డిమాండ్

సర్నాయిజం అనేది ప్రకృతిని పూజించే మత సంబంధమైన విధానం. వేసవి ప్రారంభానికి ముందు చెట్లపై ఆకులు చిగురించే కాలం(వసంత కాలం)లో ఈ మతస్తులు 'సర్హుల్' అనే పండుగను జరుపుకుంటారు. కరమ్ అనే చెట్టును ఆరాధించే మరో పండుగ కరమ్‌ను వర్షాకాలంలో ఈ మతస్తులు జరుపుకుంటారు. ఈ సంప్రదాయాలను అనుసరించే గిరిజనులు తమ ప్రత్యేకతను నిలబెట్టుకునేలా సర్నా కోడ్ బిల్లు తేవాలని దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. ఆ విధమైన ఏర్పాటు లేకపోవడం వల్లే తమను హిందువులుగా లెక్క వేస్తున్నారంటూ వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై యూపీఏ ప్రభుత్వ హయాంలో సర్నా గిరిజన నేతలతో అప్పటి హోంమంత్రి చిదంబరం పలుమార్లు చర్చలు జరిపారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని కాంగ్రెస్ వారికి హామీ ఇచ్చింది. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా సర్నాకోడ్ డిమాండ్‌ను పరిశీలిస్తామని హామీ ఇచ్చింది. సర్నా సంప్రదాయులకు క్రిష్టియన్ గిరిజనులు కూడా ఈ విషయంలో మద్దతు తెలిపారు. సీఎన్‌టీ/ఎస్‌పీటీ సవరణ చట్టం ద్వారా తమకు దూరమైన సర్నా గిరిజనుల మనసు గెలుచుకోవాలన్న ఉద్దేశంతోనే బీజేపీ తాజా బిల్లుకు శ్రీకారం చుట్టిందని..దాస్ తీసుకున్న ఈనిర్ణయం పట్ల సర్నా గిరిజనుల్లో ఎక్కువ భాగం వ్యతిరేకతతో ఉన్నందున దీర్ఘకాలికంగా ఆ పార్టీకి దీని వల్ల నష్టమేనని టిర్కీ విశ్లేషించారు. బీజేపీ ద్వారా సొంత ప్రయోజనాలు ఆశించిన కొద్దిమంది మాత్రమే సర్నాలు, క్రిష్టియన్ల మధ్య విభేదాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు.


బీజేపీ ప్రభుత్వానికి నిరసనగా సర్నా గిరిజనుల ప్రదర్శన

దీనిపై రాంచీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్,ప్రముఖ ఆంత్రోపాలజిస్ట్ కర్మా ఒరఆన్ మాట్లాడుతూ.. 'ఈ బిల్లు వ్యతిరేక ఫలితాలనిస్తుంది. గిరిజన సమాజంలోని ఐక్యతను విచ్ఛిన్నం చేయడం,సమాజంలో అవాంఛనీయమైన ఉద్రిక్తతలను ప్రేరేపించే దురుద్దేశం స్పష్టమవుతోంది. మేం సర్నా కోడ్ అడిగితే బీజేపీ ప్రభుత్వం మాత్రం రాజకీయ ప్రేరేపితమైన మత స్వేచ్ఛ బిల్లును బహుమతిగా ఇచ్చింది' అన్నారు. భూమి హక్కు చట్టాల సవరణ కోసం ఆ రాష్ట్ర సీఎం చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా సర్నా గిరిజనులు, క్రిష్టియన్ బృందాలను ఐక్యపరచడంలో ఒరఆన్ కీలక పాత్ర పోషించారు.

బిల్లు పట్ల తీవ్ర వ్యతిరేకత

జార్ఖండ్‌లోని ప్రధాన ప్రతిపక్షం జేఎంఎం కూడా తాజా బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీనిపై జేఎంఎం ప్రధాన కార్యదర్శి సుప్రియో భట్టాచార్య స్పందిస్తూ.. 'బీజేపీ నేతల్లో ఎక్కువమంది తమ పిల్లలను కాన్వెంట్ పాఠశాలల్లో చదివిస్తున్నారు. బ్యూరోక్రాట్లు, ఉన్నత విద్యావంతులు తమ పిల్లలను క్రిష్టియన్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఆ పాఠశాలలు విద్యార్థులను మత మార్పిడి చేయిస్తున్నాయా..? మత స్వేచ్ఛ అనేది రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కు. పౌరుల హక్కులను ఈ బిల్లు అడ్డుకుంటుంది' అన్నారు. ఈ బిల్లును తమ పార్టీ నేత హేమంత్ సొరెన్ అసెంబ్లీలో వ్యతిరేకించారని ఆయన చెప్పారు. అయితే, ప్రతిపక్షాల సూచనలను వినే ఓర్పు దాస్‌కు తక్కువని ఆయన అన్నారు.

ప్రభుత్వ ప్రకటనలో ఈ బిల్లు ద్వారా బీర్సాముండా, ఒరఆన్ కలలు నెరవేరుతాయని చెప్పడం గిరిజనులను మోసగించడమే అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. చదువుకునే రోజుల్లో బీర్సాముండా క్రిష్టియన్ మతంలోకి మారారు. ఆ తర్వాత ఆయన తన పూర్వ సంప్రదాయానికి తిరిగి వచ్చారు. అయితే, ఆయన క్రిష్టియన్ మతానికి వ్యతిరేకంగా పోరాడలేదని, 'మన భూమిపై మన పాలన' అన్నది ముండా నినాదమని వారు తెలిపారు. ముండా ఇచ్చిన ఈ పిలుపు ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేసిన జైపాల్‌సింగ్‌కు స్ఫూర్తినిచ్చింది. దాంతోనే గిరిజనులకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్న డిమాండ్‌కు ఆయన బీజం వేశారని చరిత్రకారులు చెబుతున్నారు.

సర్నా మతాన్ని ఒరఆన్ అనుసరించారు. క్రైస్తవులుగా మారిన గిరిజనులకు రిజర్వేషన్లు వర్తించవని ఆయన చెప్పారు. వారంతా ఉన్నత విద్యావంతులని, ప్రభుత్వ ఉద్యోగాలన్నీ వారే కొట్టేస్తారని, తమ సోదర సర్నాలకు మిగిలేది కొంచెమేనని ఆయన అభిప్రాయం. అయితే, ఇప్పటికీ అది వాస్తవం కాదు. ఉన్నత రాజకీయ పదవుల్లో వారికన్నా సర్నా గిరిజనులే అధికమని పరిశీలకులు చెబుతున్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఒరఆన్ ఇందిరాగాంధీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు.

జార్ఖండ్‌లో గతంలో కాంగ్రెస్ అనుసరించిన రాజకీయ ఎత్తుగడలనే ఇప్పుడు బీజేపీ తన అవసరార్థం అనుసరిస్తోందనేందుకు ఇదో ఉదాహరణ. బీర్సాముండా గురించి మాట్లాడే బీజేపీ నేతలు సైతం ఆ చారిత్రక వీరుని రాజకీయ ఆదర్శాలను అందుకోవడంలో ఇప్పటికీ విఫలమవుతూనే ఉన్నారు. విద్యావంతులైన గిరిజనులకు ఈ బిల్లు ద్వారా ఆటంకాలు ఏర్పడ్తాయని, శాస్త్రీయ విధానానికి భిన్నంగా బీజేపీ వెళ్తోందని సీపీఐ(ఎం) గిరిజన నేత ప్రఫుల్ లిండా అన్నారు. జార్ఖండ్‌లోని గిరిజన సమాజాన్ని మరోసారి వెనకబడేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. దీని ద్వారా బీజేపీకి రాజకీయంగా ఎలాంటి లబ్ధీ చేకూరదని, వ్యతిరేక ఫలితమే ఉంటుందని ఆయన చెప్పారు. తమకు ప్రత్యేక గుర్తింపునిచ్చే సర్నా కోడ్‌ను డిమాండ్ చేస్తున్న సర్నాలను బీజేపీ ఈ బిల్లు ద్వారా మోసం చేయాలని చూస్తోందని ఆయన అన్నారు.

(ద వైర్.ఇన్ సౌజన్యంతో)


ఖమ్మంలో మంత్రి తుమ్మల...


సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు...


మెదక్‌లో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి...


జాతీయ జెండా ఎగురవేస్తున్న స్పీకర్ మధుసూదనాచారి

ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా పంద్రాగస్టు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మంత్రులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయాల్లో పతాకావిష్కరణలు జరిగాయి.


సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డి...


జేఎన్‌టీయూహెచ్‌లో...


వరంగల్ అర్బన్‌లో మంత్రి కడియం..


వికారాబాద్‌లో మంత్రి మహేందర్‌రెడ్డి...


ఉన్నతవిద్యామండలిలో చైర్మెన్ పాపిరెడ్డి...


యాదాద్రిలో విప్ గొంగిడి సునిత...


కొత్తగూడెంలో మంత్రి పద్మారావు


రంగారెడ్డిలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ...


నల్లగొండలో నేతి విద్యాసాగర్...


హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో....


టీజేఏసీ ఆఫీసులో కోదండరామ్...


సీపీఐ కార్యాలయంలో...


బీజేపీ కార్యాలయంలో..


ఎంఐఎం ఆధ్వర్యంలో...

తాటాకు చప్పుళ్లకు భయపడం


- సీఎం కేసీఆర్‌కు తమ్మినేని హెచ్చరిక
- జైకేసారంలో తిరందాసు గోపి స్థూపావిష్కరణ



నవతెలంగాణ – యాదాద్రి భువనగిరి ప్రతినిధి

రాష్ట్రంలో నియంతృత్వంగా కొనసాగుతున్న కుటుంబ పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడుతారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారంలో కార్మికోద్యమ నేత అమరజీవి తిరందాసు గోపి, పాలమాకుల అంజయ్య స్మారక స్థూపాలను మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ అవినీతి అక్రమాలను ఎలుగెత్తి బయటపెట్టడంతో పాలకులకు భయం ఆవహించిందన్నారు. సీఎం హోదాలో ఉండి అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన కేసీఆర్ నోటికి ఇష్టం వచ్చిన విధంగా కమ్యూనిస్టుపార్టీలు, నాయకులను దుర్భాషలాడడం తగదన్నారు. నాగరికత మరిచిపోయి మాట్లాడితే అదే స్థాయిలో తమ కార్యకర్తలు బుద్ధిచెప్తారని హెచ్చరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉత్తమ కమ్యూనిస్టుగా తిరందాసు గోపి ఉద్యమాలు నిర్వహించారని కొనియాడారు. చిన్ననాటి నుంచి పార్టీలో అంకితభావంతో పనిచేసి తాను పుట్టి పెరిగిన ప్రాంతంలోనే కాకుండా కార్మికోద్యమంలో జిల్లాస్థాయిలో కీలక బాధ్యతలు నిర్వర్తించాడన్నారు. శత్రువులు, అతివాదుల నుంచి ఆటుపోట్లు వచ్చినా ధైర్యంగా నిలబడ్డ సహస్రశీలి అని కీర్తించారు. ఓట్లు, సీట్లు రాకపోతే కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడ్డాయని భావించడం భ్రమేనన్నారు. సైద్ధాంతిక సిద్ధాంతం కలిగిన కమ్యూనిస్టుపార్టీలు గతించడమంటూ ఉండదన్నారు. అలా భావించిన పాలకులే చరిత్రలో కనుమరుగయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొండమడుగు నర్సింహా, చింతల భూపాల్‌రెడ్డి, మాటూరి బాలరాజు, గోపి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడుద్దాం



హైదరాబాద్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను లెక్క చేయని మహనీయుల బాటలో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరమున్నదని శ్రీచరణ కమ్యూనికేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసగుప్త కోరారు. 71 స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను సంస్థలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సాయిచరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

చర్చల ద్వారానే జల వివాదాలకు పరిష్కారం



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని గవర్నర్ నరసింహన్ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు. రెండు నెలల్లో విభజన సమస్యలకు పూర్తి పరిష్కారం లభిస్తుందన్నారు. స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చిన తేనీటి విందుకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కె చంద్రశేఖరరావు, చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవవర్నర్ ఇద్దరు సీఎంలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 9,10 షెడ్యూల్, విభజన సమస్యలు, జల వివాదాలపై చర్చించినట్టు తెలిసింది. పంతాలు, పట్టింపులకు పోకుండా చర్చల ద్వారా విభజన సమస్యలను పరిష్కరించుకోవాలని గవర్నర్ సూచించారు.

ఆత్మీయ పలకరింపులు

గవర్నర్ ఎట్ హోం విందులో తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఇద్దరు కలిసి వేదిక పైన ఉన్న ప్రముఖులను పలకరించారు. మంత్రి కేటీఆర్, పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకోవడం, చలోక్తులు వేసుకున్నారు. ఎట్ హోం కార్యక్రమం చివరి వరకు ఇద్దరు పక్కపక్కనే కూర్చున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా పవన్ కళ్యాణ్

ఎట్ హోం కార్యక్రమంలో సినీ నటుడు,

ఎట్ హోమ్ కార్యక్రమంలో ఇద్దరు సీఎంలకు గవర్నర్ సూచన

- ప్రత్యేక ఆకర్షణగా పవన్ కళ్యాణ్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రెండు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు వేదిక పైకి రాగానే పవన్ కళ్యాణ్ లేచి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు సుజనా చౌదరి, బండారు దత్తాత్రేయ, ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత జానారెడ్డి, ఏపీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య, క్రీడాకారులు వీవీఎస్ లక్ష్మణ్, పుల్లెల గోపిచంద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈయనే మా ప్రతిపక్ష నేత

ఈయనే పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని సీఎం కేసీఆర్ ఏపీ సీఎం చంద్రబాబుకు పరిచయం చేశారు. నవ్వుతూ చంద్రబాబు ఉత్తమ్‌కుమార్ రెడ్డికి చెయ్యి కలిపారు. దాంతో వేదిక పైన ఉన్న ఇతర మంత్రులంతా నవ్వుకున్నారు.

అంతరాలు తొలగిపోవాలి: కోదండరామ్

హైదరాబాద్: రాష్ట్రం ఏర్పాటైనా అంతరాలు తొలగిపోలేదని టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదం డరామ్ అన్నారు. నాంపల్లిలోని జేఏసీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. నేటి రాజకీయ నాయకులు సొంత లాభమే చూసుకుంటున్నారని విమర్శించారు. రాజకీయం అనేది వ్యాపారానికి పెట్టుబడిగా మారిందని వ్యాఖ్యానించారు.

ఎదుగుతున్న దేశం: కేంద్రమంత్రి సుజనాచౌదరి

ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో మన దేశం ఒక్కటే ఎదుగుతోందని కేంద్రమంత్రి సుజనాచౌదరి తెలిపారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన జాతీయజెండాను ఆవిష్కరించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత పాలకులు గత పాలకుల కంటే దారుణంగా ప్రజలను హింసిస్తున్నారని ఆరోపించారు.

అసెంబ్లీలో ఘనంగా వేడుకలు

అసెంబ్లీ ఆవరణలో శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ అసెంబ్లీ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

దేశానికే ఆదర్శం; మంత్రి నాయిని

మూడేండ్ల పాలనలతోనే దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు.

కొరవడిన సామాజిక న్యాయం; లక్ష్మణ్

రాష్ట్రంలో సామాజిక న్యాయం కొరవడిందని బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ తెలిపారు. బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు పెరగిపోయాయని తెలిపారు. సమావేశంలో కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

సప్తపదుల స్వాతంత్ర్యం



సప్తపదుల రాజకీయ రంగస్థలంలో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కన్నుల పండుగలా జరిగాయి. ఎర్రకోట మీద త్రివర్ణ పతాకాన్ని ప్రధాని ఎగురవేశారు. ఆన్‌లైన్ పత్రికలన్నీ ప్రధాన సమస్యలను పక్కనపెట్టి ప్రధాని ప్రసంగ సమయాన్ని లెక్కలు వేశారు. ఇందుకు భిన్నంగా స్వాతంత్ర్య పోరాటంలో పాలకపార్టీ భాగస్వామ్యం త్యాగాలపై లెక్కలు వేస్తే బాగుండేది. గత ప్రసంగాలతో పోల్చి కితాబులిస్తున్నారు. మోడీ ఎంతసేపు మాట్లాడిండు అని కాదు. ఏం మాట్లాడిండు అనేది ముఖ్యం. స్వాతంత్ర్య పోరాటంలో ఏ మత విశ్వాసాలు కొనసాగించాలో వాటిని గుర్తుచేస్తూ ఉపన్యాసం కొనసాగడం కొసమెరుపు. వినాయక చవితి ఉత్సవాలు బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా ప్రారంభించారని తెలియజేశారు. ఈ మాటకు అర్థం ఏమిటి? మతం మత్తులో ప్రజలను ఉంచటం, విస్తృతంగా వినాయక ఉత్సవాలు జరపాలని కోరుకోవటం కాదా? క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏండ్లు నిండినట్లు తెలిపారు. కానీ విచక్షణా రహితంగా విదేశీ పెట్టుబడులకు వెల్‌కమ్ చెబుతూ ఆర్థిక స్వాతంత్ర్యానికి తిలోదకాలు ఇచ్చారు. వాల్‌మార్ట్ లాంటి సంస్థలకు ఎర్రతివాచీలు పరిచి కొల్లాది చిల్లర దుకాణాల మూతకు తెరలేపారు. ఈ ఘనత కూడా తమదేనని చెబితే ప్రజలకు పాలకుల పారదర్శకత అర్థమయ్యేది.

ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర్యం కాషాయ పాలకుల కబంధ హస్తాల్లో చిక్కింది. మతోన్మాదుల విష కౌగిలి నుండి సప్తపదుల స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలదే.

21వ శతాబ్దంలో పుట్టినవారు మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోబోతున్నట్టు మోడీ వెల్లడించారు. పౌరులను ప్రభువులు ఓటర్లుగానే చూస్తున్నారు. ఉపాధి అవకాశాలను కల్పించడంలో వైఫల్యాన్ని దాచేస్తున్నారు. ప్రతి యేటా చదువులు ముగింపుకొని ఉపాధి అవకాశాల కోసం 2.6 కోట్ల మంది యువకులు ఎదురుచూస్తున్నారు. వారికోసమే మేక్ ఇన్ ఇండియా అన్నారు. తయారీ రంగంలో పెట్టుబడులకు భారత్ అనువైనది.. రండిబాబూ.. రండని.. ప్రధాని దేశ దేశాలు తిరిగారు. ఫలితం శూన్యం. ముఖ్యమైన రంగాల్లో పెట్టుబడులు తగ్గాయి. 2014-15లో ప్రాధాన్యత గల ఆటోమొబైల్ పరిశ్రమ, ఫార్మా, టెలికమ్యూనికేషన్, నిర్మాణ రంగాలలో రూ.53,779 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2015-16లో రూ.32,297 కోట్లకు పడిపోయాయి. స్వదేశంలో స్వంత పరిశ్రమలు ఏర్పాటుకు చెల్లుచీటి ఇచ్చారు. ఉపాధి అవకాశాలు పెంచే ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడిని ఉపసంహరించ నిర్ణయం చేస్తున్నారు. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతున్నది. బతుకుదెరువు కోసం ప్రజలు వలసబాట పడుతున్నారు.

2016-17 ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో ఉపాధి కోసం వలసబాట పట్టినవారి సంఖ్య 14 కోట్లు. జిల్లా నుండి మరో జిల్లాకు వలస పోయినవారు 8 కోట్లు. రాష్ట్రాల సరిహద్దులు దాటిన వారు 6 కోట్లు. మూడేండ్ల పాలనలో 3 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వకపోవటం పాలకుల పనితీరుకు నిదర్శనం. అచ్చేదిన్ ఎక్కడో మోడీ చెప్పాలి.

నోట్ల రద్దు, జీఎస్‌టీకి ప్రజల ఆమోదం ఉన్నదని ఎర్రకోట నుండి ప్రధాని ప్రకటించటం హాస్యాస్పదం. పెద్దనోట్ల రద్దు వలన విదేశాల్లో ఉన్న నల్లధనం బయటకు వస్తుందని, ఉగ్రవాదం తగ్గుతుందని, ప్రజలకు మేలు కలుగుతుందని, త్యాగం చేయాలని మోడీ చెప్పారు. నోట్ల రద్దు నిర్ణయాన్ని రిజర్వు బ్యాంక్‌కు చెప్పలేదు. మంత్రి వర్గానికి తెలపలేదు. రద్దుచేసిన తర్వాత మంత్రిమండలి పెట్టి చెప్పారు. ప్రధాని అప్రజాస్వామికంగా వ్యవహరించారు. జనాలు నానా అవస్థలు పడ్డారు. ఉగ్రవాదం పెరిగింది. ఇప్పుడు ప్రధాని కాశ్మీర్ సమస్య పరిష్కారం తుపాకుల ద్వారా కాదని సెలవిచ్చారు. వామపక్షాలు చెప్పింది అదే కదా! రాజకీయ పరిష్కారం కనుగొనాలనేది పట్టించుకోలేదు. పెద్దనోట్ల రద్దు వలన ఉద్యోగాలు తగ్గిపోయాయి. జీడీపీ పెరుగుతుందనే ఆలోచన తలకిందులయింది. స్కీమ్‌ల మీద స్కీమ్‌లు పెట్టినా నల్లడబ్బు పెట్టెలు బయటకు రాలేదు. పాలకుల నిర్ణయాలకు ప్రజల ఆమోదం ఉందని చెప్పటం ఈ నయా గోబెల్స్ వారసులకే చెల్లుతుంది. జీఎస్టీ వలన ప్రజల మీద పన్నులు పెరిగాయి. రాష్ట్రాల హక్కులు హరించివేయబడ్డాయి. రాష్ట్రాల మీద కేంద్ర పెత్తనం పెరిగింది. రాష్ట్రాలు కేంద్రాన్ని అడుక్కునే పరిస్థితి వచ్చింది. ఇది తిరోగమన చర్య.

మత విద్వేషాలను ప్రోత్సహిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెట్టి పాలకులు పబ్బం గడుపుకుంటున్నారు. ముస్లిం పర్సనల్‌లో వేలుపెట్టి తలాక్‌పై ఎర్రకోట మీద నుంచి మాట్లాడటమంటే ఇది దేనికి సంకేతమో మోడీనే చెప్పాలి. స్వాతంత్ర్యానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రాష్ట్రాల పరిపాలనలో గవర్నర్ల ద్వారా జోక్యం చేసుకోవటం, ప్రజలు పాలకులకు వ్యతిరేక తీర్పు ఇచ్చినా ప్రజా తీర్పులను కాలదన్ని ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్యాన్ని బేఖాతర్ చేస్తున్నారు. పార్లమెంట్‌లో బిల్లుల ఆమోదం కోసం ఆర్థిక బిల్లులు పేరుతో అడ్డదారిలో ఆమోదించుకుంటున్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ఎన్నికలలో పోటీ చేయాలన్న అధిక వ్యయం వెచ్చించలేని పరిస్థితి దాపురించింది. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర్యం కాషాయ పాలకుల కబంధ హస్తాల్లో చిక్కింది. మతోన్మాదుల విష కౌగిలి నుండి సప్తపదుల స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలదే.

కండ్లకు గంతలు కడుతున్న అభివృద్ధి మంత్రజపం!



ఎన్. వేణుగోపాల్

కొంతకాలంగా తెలంగాణలో అభివృద్ధి అనే మాట మారుమోగిపోతున్నది. ప్రభుత్వం తెలంగాణను అభివృద్ధి చేయడానికి అపారమైన కృషి చేస్తున్నట్టు, దాని విమర్శకులూ వ్యతిరేకులూ ఆ అభివృద్ధిని అడ్డుకుంటున్నట్టు, వారందరూ అభివృద్ధి నిరోధకులన్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతున్నది. అభివృద్ధి అనే మాట రాజకీయార్థిక, సామాజిక శాస్త్రాల అవగాహనాచట్రాల పరిధిని దాటి ఫక్తు రాజకీయాల చట్రంలోకి, నిస్సారమైన ఆరోపణల, ప్రత్యారోపణల చట్రంలోకి దిగజారినట్టుంది. ఒక శాస్త్రీయమైన, సాంకేతికమైన భావనను వీధి రాజకీయాల స్థితికి దిగజారిస్తే ఏ పర్యవసానాలు ఉంటాయో స్పష్టంగా కనబడుతున్నాయి.

అభివృద్ధి అంటే ఏమిటి, అభివృద్ధి రూపాలు ఏమిటి, అభివృద్ధి ఫలితాలు ఎలా ఉంటాయి, ఎప్పటికి వస్తాయి, ఎవరికి అందుతాయి, ఆ అభివృద్ధి వల్ల అంతిమంగా రాష్ట్ర ప్రజానీకానికి, రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు ఏ మేలు జరుగుతుంది వంటి శాస్త్రీయంగా, తార్కికంగా, సోపపత్తికంగా జరగవలసిన చర్చ పక్కదారి పట్టి ప్రభుత్వం చేసే పనులన్నీ అభివృద్ధి అని, వాటిని విమర్శించే వారందరూ అభివృద్ధి నిరోధకులని సులభమైన సూత్రీకరణలు చెలరేగుతున్నాయి. ప్రచారసాధనాల మద్దతుతో ఊరేగుతున్నాయి. ఈ పనులన్నీ అవసరమైనవేనా, ఈ పనుల వల్ల దెబ్బతింటున్న, నిర్వాసితులవుతున్న వారి సంగతి ఏమిటి, మరొక మెరుగైన ఆలోచన చేయలేమా, తక్కువ నష్టంతో ఈ పని సాధించలేమా అని రేకెత్తుతున్న ప్రతి ప్రశ్న మీద, సందేహం మీద, ప్రత్యామ్నాయ ఆలోచన మీద అభివృద్ధి నిరోధకులు అనే ముద్ర పడుతున్నది. గొంతు నొక్కడానికి అప్రజాస్వామిక ప్రయత్నాలెన్నో జరుగుతున్నాయి.

న్యాయవ్యవస్థ సమీక్షను తూలనాడడం అంటే ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం చేయడం అవుతుంది. సమానత్వం లేకుండా అభివృద్ధి లేదు అన్న గున్నార్ మిర్డాలే ప్రజాస్వామ్యం లేకుండా అభివృద్ధి లేదు అని కూడ అన్నాడు. సమానత్వం, ప్రజాస్వామ్యం లేని అభివృద్ధి నిజమైన, అర్థవంతమైన అభివృద్ధి కాజాలదు. అది కొందరి బొక్కసాలు నింపడానికి ఎందరినో మాయచేసే ఒక మంత్రంగా మాత్రమే మిగిలిపోతుంది.

కానీ సుదీర్ఘకాలం పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ వంటి ఒక చైతన్యవంతమైన సమాజంలో చర్చ జరగవలసిన పద్ధతి ఇది కాదు. మూడు వందల ఏండ్లకు పైగా అర్థశాస్త్రంలో అభివృద్ధి గురించి జరిగిన చర్చ ఉంది. పాలకవర్గాల, స్వార్థపరశక్తుల అభివృద్ధికి భిన్నంగా ప్రజానుకూల అభివృద్ధికి కొత్త నమూనాతో ప్రయోగాలు చేసిన ఇరవయో శతాబ్ది చరిత్ర ఉంది. వలసపాలనానంతరం ఏ అభివృద్ధి నమూనా ఈ దేశ సమస్యలను పరిష్కరించ గలుగుతుందని దేశవ్యాప్తంగా జరిగిన చర్చ ఉంది. ఆంధ్ర పాలకుల హామీల ఉల్లంఘన, అన్యాయం, వివక్షల కింద తెలంగాణ అభివృద్ధి చెందలేదని తెలంగాణ ఉద్యమం చేసిన చర్చ ఉంది. కనుక అభివృద్ధి చర్చ తెలంగాణకు కొత్తది కాదు. ఆంధ్రపాలకుల అభివృద్ధి పథకాలనూ, అభివృద్ధి నమూనానూ నిరంతరం ప్రశ్నించిన తెలంగాణలో, ఆ ప్రశ్నలలో కొన్నిటిని గతంలో సంధించినవాళ్లే ఇప్పుడు అవే అభివృద్ధి పథకాలనూ, అదే అభివృద్ధి నమూనానూ తలకెత్తుకోవడం గురించి చర్చ జరగవలసి ఉంది. గతంలో తాము వేసిన ప్రశ్నల వంటి ప్రశ్నలనే ఇప్పుడు వేస్తున్నవాళ్లను ఇప్పుడు అధికారంలో ఉన్నవారు అప్పుడు అధికారంలో ఉన్నవారిలాగనే అభివృద్ధి నిరోధకులు అని నిందించడం గురించి చర్చ జరగవలసి ఉంది.

ఇవాళ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుపుతున్న అభివృద్ధి - అభివృద్ధి నిరోధకత్వం చర్చలో అభివృద్ధికి ప్రజల కోణం లేదనే వాదన ఉంది. ప్రజలను మాయ చేయడానికి ప్రజలకు మేలు జరుగుతుందనే ఆశలు, భ్రమలు, ఎండమావులు కల్పిస్తున్నారు గాని ఇది పాత ప్రజావ్యతిరేక అభివృద్ధి నమూనా కొనసాగింపే అనే వాదన ఉంది. అయితే మొత్తం అభివృద్ధి చర్చనంతా ప్రాజెక్టులకు, అదీ నీటి పారుదల ప్రాజెక్టులకు మాత్రమే కుదించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. నీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా కొంత కొత్త ఆయకట్టు ఏర్పడడం, కొందరు రైతుల భూములకు ఇదివరకు లేని నీటి సౌకర్యం ఏర్పడడం, తద్వారా వ్యవసాయ దిగుబడి పెరగడం, అది ఆర్థికాభివృద్ధికి దారితీయడం అనే ఫలితాలు ఉన్నమాట నిజమే.

కాని ప్రాజెక్టు అంటేనే దానికదిగా అభివృద్ధి కాదు. ప్రాజెక్టు అనేది ఒకానొక అభివృద్ధి పథకం మాత్రమే. అభివృద్ధి అంటే ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, దైనందిన జీవిత ప్రమాణాలు అంతకు ముందుకన్న మెరుగు కావడం. ఒక పథకం ఆ పని చేయవచ్చు, చేయకపోవచ్చు. ప్రస్తుత రాజకీయార్థిక వ్యవస్థలో చేయకపోవడానికే ఎక్కువ అవకాశం ఉంది. ఒక పథకం అంటే మొదట ఒక నిర్మాణం. ఆ నిర్మాణం ప్రభుత్వం స్వయంగా చేయదు గనుక, ప్రజాధనాన్ని ఉపయోగించి కాంట్రాక్టర్ల ద్వారా చేయిస్తుంది గనుక పథకంలో మొట్టమొదట లాభపడేది కాంట్రాక్టర్లు. ఎన్నో దశాబ్దాలుగా తప్పుడు లెక్కలకూ, అక్రమాలకూ, మితిమీరిన అంచనాలకూ ఆలవాలమైన నిర్మాణ పనుల్లో రూపాయికి జరగవలసిన పనిని రెండు రూపాయలకో, మూడు రూపాయలకో చేయించడం ప్రభుత్వాలకూ, కాంట్రాక్టర్లకూ అలవాటయింది. ఎట్లాగూ వెచ్చించేది ప్రజాధనమే గనుక రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్నట్టు ప్రజల సొమ్ము కాంట్రాక్టర్ల పాలు కావడం మామూలయింది. ఆ కాంట్రాక్టర్లే రాజకీయ పార్టీలన్నిటికీ పోషకులు. ఆ కాంట్రాక్టు ఇప్పించిన కృతజ్ఞతతో వాళ్లు అధికారపార్టీకి మహారాజ పోషకులుగా కూడ ఉంటారు. ఈ నిర్మాణ పనుల రూపకల్పన చేసిన దగ్గరి నుంచి పూర్తయ్యేదాకా ఉండే ఉద్యోగవర్గానికి వారి వారి వాటాలు ఇస్తారు. అంటే ఒక ప్రాజెక్టు తొలి లబ్ధిదారులు కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, మంత్రులు, శాసనసభ్యులు, నిర్ణయాధికారం ఉన్న ఉద్యోగులు మాత్రమే.

ఇలా ఒక ప్రాజెక్టుకు అంచనావేసే ప్రజాధనంలో సగమో మూడో వంతో ఈ వర్గాలన్నిటికీ కైంకర్యం అయిపోయిన తర్వాత మిగిలినదానితో ఆ ప్రాజెక్టు కడితే గిడితే, అది కూలిపోకుండా, నెర్రెలు వాయకుండా ఉంటే గింటే చివరికి కొన్ని వేల మంది రైతులకు దాని ఫలితాలు అందుతాయి. కాని ఈలోగా ఆ ప్రాజెక్టు ముంపులో గురై నిర్వాసితులయ్యే వేలమంది రైతులు, ముంపు గ్రామాలలో వ్యవసాయాధార వృత్తులలో ఉన్నవారు, ఏ ఆస్తీ లేనందువల్ల ఎటువంటి నష్టపరిహారం కూడ అందనివారు వేలాది మంది పొట్ట చేతపట్టుకుని దిక్కులేని బతుకులు గడపవలసి వస్తుంది. నష్ట పరిహారం అందినవారు కూడ ఆ డబ్బుతో మరెక్కడా భూమి రాక, తెలిసిన వ్యవసాయం చేసే వీలు లేక, తెలియని పనులు చేయలేక, దిక్కులేనివారై పోతారు. ఆయకట్టు గ్రామాలలో కూడ ఇవాళ ఉన్న స్థితిలో ప్రతి గ్రామంలోనూ భూమి లేని జనాభా ముప్పై శాతం పైనే ఉంది గనుక వారికి కూడ ప్రాజెక్టు వల్ల ఒరిగేదేమీ లేదు. మొత్తంగా ఆర్థిక వ్యవస్థ బాగుపడితే అది కిందికి బొట్లు బొట్లుగా జారి అందరికీ అందుతుందని, అందువల్ల పైన ఉన్నవారి బాగు కోసం ప్రయత్నిస్తే చాలు అని నెహ్రూ ప్రవచించిన పంపిణీ సూత్రం ఆరు దశాబ్దాల తర్వాత కూడ నిజం కాలేదని అందరికీ తెలుసు.



గత డెబ్బై ఏండ్లలో దేశవ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టులు వచ్చాయి. అయినా దేశంలో దారిద్ర్యం, నిరుద్యోగం, ఆకలి, నిరక్షరాస్యత, ప్రాథమిక వైద్య ఆరోగ్యసౌకర్యాల లేమి, అసమానత, కుల, మత వివక్ష, అప్రజాస్వామిక పాలన వంటి సమస్యలెన్నో యథాతథంగా ఉన్నాయి, బహుశా పెరిగాయేమో కూడ. ఆంధ్రప్రదేశ్‌లో కూడ అరవై ఏండ్ల పాటు ఎన్నో అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టులు ఇప్పటికన్న ఎక్కువ ఆర్భాటంతోనో, సమానమైన ఆర్భాటంతోనో అమలయ్యాయి. కాని అవేవీ తెలంగాణను అభివృద్ధి చేయలేదనే కారణంతోనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సాగి, గెలిచింది. అంటే అసలు విషయం ప్రాజెక్టులు, అభివృద్ధి మాటలు కాదు. ప్రాజెక్టులే అభివృద్ధి కాదు.

అభివృద్ధి సాధించడానికి అవసరమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ముందస్తు షరతులెన్నో ఉన్నాయి. అవి ఈ పాలకుల కింద, ఈ వ్యవస్థలో సాధ్యమయ్యేవి కాదు. సమానత్వం గురించి మాట్లాడకుండా అభివృద్ధి గురించి మాట్లాడడం అర్థరహితం అని నోబెల్ అర్థ శాస్త్రవేత్త గున్నార్ మిర్డాల్ ఎప్పుడో ఆరు దశాబ్దాల కింద అన్నమాట దేశంలోనూ, గత ఏపీలోనూ అడుగడుగునా రుజువైనట్టే ఇవాళ తెలంగాణలోనూ రుజువవుతున్నది. అందువల్ల అసలు ఈ అభివృద్ధి నమూనానే సమీక్షించవలసి ఉంది, ప్రశ్నించవలసి ఉంది, వ్యవస్థ మార్పు దాకా పోకుండానే ఉన్న వ్యవస్థలోనే ఈ ప్రజా వ్యతిరేక నమూనాకు ప్రత్యామ్నాయాలు, తక్కువ నష్టంతో, తక్కువ నొప్పితో ఏమైనా అవకాశాలు ఉన్నాయా అన్వేషించవలసి ఉంది.

ప్రభుత్వ అభివృద్ధి నమూనాను ప్రశ్నిస్తున్నవాళ్లందరూ ప్రజానుకూల నమూనాను కోరుతున్నవాళ్లేమీ కాకపోవచ్చు. వారిలో కొందరు అదే తానులో ముక్కలు కావచ్చు. కొందరు కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసమే ఆ ప్రశ్నలు వేస్తుండవచ్చు. కాని ప్రశ్నే తప్పు అంటే, ప్రశ్నించే వారందరూ అభివృద్ధి నిరోధకులు అంటే అందుకు మరేవో కారణాలున్నాయని అనుమానించక తప్పదు. తమ ప్రజావ్యతిరేక, పిడికెడు మంది స్వార్థపర శక్తుల ఖజానాలు నింపే అభివృద్ధి నమూనాను నీటి సెంటిమెంటుతో, తెలంగాణ సెంటిమెంటుతో అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని అనుకోవలసి వస్తుంది. అబద్ధాలతో, సెంటిమెంటును రెచ్చగొట్టడంతో, ఎండమావులను చూపి భ్రమలు కల్పించడంతో, ఇతరుల ప్రశ్నలు వినిపించకుండా వందిమాగధ భజనలు సాగించడంతో స్వయంగా ఏలినవారే అటువంటి తప్పుడు పనికి పూనుకుంటున్నప్పుడు ప్రశ్నలు వేయడం అనివార్యం అవుతుంది, విధ్యుక్తధర్మం అవుతుంది, ఆలోచనాపరులందరి కర్తవ్యం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణ బుద్ధిజీవులందరూ చేసిన పని అదే.

అటువంటి అనివార్యమైన ప్రశ్నల సంప్రదాయంలో ఒకటి కోర్టు కేసులు. శాసననిర్మాణ, కార్యనిర్వాహక వ్యవస్థలు చేసే పనుల మీద న్యాయవ్యవస్థ సమీక్ష అవసరం అనేది దేశంలో అమలవుతున్న రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో ఒక మౌలిక సూత్రం. ఆ సమీక్ష ప్రజల తరఫున, ప్రజల కొరకు, ప్రజాస్వామిక పునాదిని పటిష్టం చేయడం కొరకు జరగాలి. న్యాయవ్యవస్థ కూడ అప్పుడప్పుడు తన పనిని విస్మరించి, ప్రజల తరఫున కాకుండా ఏలినవారి అడుగులకు మడుగులు ఒత్తుతున్న ఉదాహరణలున్నాయి. అయినా న్యాయవ్యవస్థ సమీక్షను తూలనాడడం అంటే ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం చేయడం అవుతుంది. సమానత్వం లేకుండా అభివృద్ధి లేదు అన్న గున్నార్ మిర్డాలే ప్రజాస్వామ్యం లేకుండా అభివృద్ధి లేదు అని కూడ అన్నాడు. సమానత్వం, ప్రజాస్వామ్యం లేని అభివృద్ధి నిజమైన, అర్థవంతమైన అభివృద్ధి కాజాలదు. అది కొందరి బొక్కసాలు నింపడానికి ఎందరినో మాయచేసే ఒక మంత్రంగా మాత్రమే మిగిలిపోతుంది.

ఒక మాటను పదే పదే ఉచ్చరిస్తే, ఒక ప్రతీకను ప్రచారం చేస్తే వాటంతటవే భౌతిక పరిస్థితిలో మార్పులు తెస్తాయనే అమాయక ఆదిమ నమ్మకం మీద ఆధారపడి మంత్రాలూ తంత్రాలూ చేతబడులూ పుట్టుకొచ్చి వేల ఏండ్లుగా మన ఆలోచనలను శాసిస్తున్నాయి. ఒక పరిస్థితిని మార్చాలంటే నిజంగా ఆ పరిస్థితికి మూలకారణాలేమిటో తెలుసుకుని వాటిని తొలగించడం కాకుండా, "పరిస్థితి మారింది, పరిస్థితి మారింది" అని ఉచ్చాటన చేస్తే చాలు పరిస్థితి మారిపోతుందని ప్రజలను నమ్మించవచ్చుననే అభిప్రాయం పాలకవర్గాలకు ఏర్పడింది. అలా నమ్మించే విద్యలో ఆరితేరిన పాలకులకు ఇవాళ కొత్తగా దొరికిన మంత్రం అభివృద్ధి. ఆ మంత్రజపం స్థాయి పెంచి యాగం చేస్తూ ఆ ఉచ్చాటనలతోనే కొందరిలోనైనా భ్రమలు కలిపించవచ్చు, కొందరి కండ్లకు గంతలు కట్టవచ్చు. తాము చేస్తున్న యాగాన్ని ప్రశ్నించేవారందరూ అభివృద్ధి నిరోధకులే అని ఆరోపిస్తూ పబ్బం గడుపుకోవచ్చు. నిజమైన అభివృద్ధి సాధించడం కాక అభివృద్ధి పేరిటి పథకాలు రచిస్తూ, వాటిలో ముడుపులు దండుకుంటూ ఉండవచ్చు.

సెల్: 9848577028



చాకేటి రాజు

ఉన్నత విద్య.. అంతా మిథ్య


"మానవులు మర్త్యులై ఉన్నట్టు.. ఆలోచనలు కూడా మర్త్యులై ఉంటాయి. ఒక మొక్కకు నీరు ఎలా అవసరమో, ఒక ఆలోచనకు విజ్ఞాన వృద్ధీ అంతే అవసరం, లేకపోతే అవి వాడిపోతాయి.. చనిపోతాయి" అని అంటారు డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్. మొన్న కాకతీయ, నిన్న ఉస్మానియా, నేడు తెలుగు విశ్వవిద్యాలయం, పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల్లో జరుగుతున్న అవకతవకలకు నిదర్శనం. దేశంలో మొత్తంగా 799 యూనివర్సిటీలు ఉండగా, అందులో 43 సెంట్రల్ యూనివర్సిటీలు, 329 రాష్ట్ర యూనివర్సిటీలు, ప్రయివేట్ రంగంలో 197 వర్సిటీలు, 79 డీండ్ యూనివర్సిటీలు ఉన్నాయి. ప్రయివేట్ వర్సిటీలు అతి త్వరలోనే ప్రభుత్వ వర్సిటీలను అధిగమించే ప్రమాదం కనిపిస్తోంది. ఉన్నత విద్యను ప్రస్తావిస్తే ఇందులో డిగ్రీ స్థాయి మొదలుకొని ఆ పై పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ వరకు ఉన్నా దీన్ని పట్టించుకొనే చిత్తశుద్ధి లేక ప్రభుత్వాలే చేతులెత్తేయటం బాధకరం. ఇకా తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 21 యూనివర్సిటీలు ఉన్నాయి. ప్రభుత్వం ఒకవైపు ఉస్మానియా యూనివర్శిటీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ మరొకవైపు యూనివర్సిటీలలో మెరుగుపరచాల్సిన కనీస మౌలిక సదుపాయాలను పట్టించుకోకపోవటం ఎంతవరకు సమంజసం.

ప్రభుత్వ అజమాయిషీలోని విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేయటమంటే ప్రయివేటీకరణకు మార్గాలను అన్వేషించటమే అని భావించవచ్చు. ఒకవైపు ప్రపంచ స్థాయి వర్సిటీల గురించి మాట్లాడతారు కానీ ఉన్న వాటిలో కల్పించాల్సిన సౌకర్యాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఒకరకంగా ఉన్నత విద్యను నిధుల నెపముతో ప్రయివేటీకరణకే మొగ్గు చూపుతోంది. ఈ ప్రయివేటీకరణ ప్రక్రియను అడ్డుకోవటంలో, దానికి వ్యతిరేకంగా పోరాటం చేయటంలో కమ్యూనిస్టుల కృషి ఎంతైనా ఉందని చెప్పవచ్చు. బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీలా పాలన వ్యవహారంలో తలదూర్చుతూ వాటికున్న స్వయం ప్రతిపత్తిని తిరగరాస్తు, వర్సిటీలను వారి ఇష్టా రాజ్యంగా తయారుచేస్తున్నది. ఉన్నత విద్యలో ప్రయివేట్ రంగానికి రెడ్ కార్పెట్ వేయటం మంచి పరిణామం కాదు. యూజీసీ రెగ్యులేషన్ పేరుతో వర్సిటీలలో అధ్యాపక - విద్యార్థుల నిష్పత్తిని తగ్గిస్తూ దాని ఆధారంగా ఉన్నత విద్యకోసం తపించే విద్యార్థుల సంఖ్యను కూడా తగ్గించటం బాధకరం. కనీస నాణ్యత ప్రమాణాల పేరుతో ఉన్నత విద్యావకాశాలకు గండికొడుతున్నారు. ఇందులో భాగంగా యూజీసీ రూపొందించిన నూతన నియమాల ప్రకారం ఒక యూనివర్సిటీలోని ప్రొఫెసర్ క్రింద ముగ్గురు ఎంఫిల్, ఎనిమిది మంది పీహెచ్‌డీ విద్యార్థులను, అలాగే ఒక అసోసియేట్ ప్రొఫెసర్ క్రింద ఇద్దరు ఎంఫిల్, ఆరుగురు పీహెచ్ డీ విద్యార్థులను, ఇంకా అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రింద ఒక ఎంఫిల్, నలుగురు పీహెచ్.డీ విద్యార్థులను గైడ్ చేసేలా మార్గదర్శకాలను రూపొందించారు. యూనివర్శిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా ప్రస్తుతం ఉన్న అధ్యాపకుల ఆధారంగా విద్యార్థుల సంఖ్యను తగ్గించటం ఎంతమాత్రం న్యాయమో వారికే తెలియాలి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న మొత్తం 17 యూనివర్సిటీలలో ఖాళీల కొరత విద్యార్థులను వెక్కిరిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం కేవలం 11 యూనివర్సిటీలలోనే ఖాళీగా ఉన్న అధ్యాపకుల సంఖ్య 1061. వీటి భర్తీకి కూడా ప్రభుత్వం తర్జనబర్జన చేస్తోంది. ఒకవైపు యూనివర్శిటీలలో కొన్ని ఏండ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు పట్టుబట్టడంతో దిక్కుతోచని పరిస్థితిలో కమిటీల పేరుతో కాలయాపన చేస్తోంది. ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ తిరుపతి రావ్ కమిటీ రిపోర్ట్ ఇచ్చి కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ కుదరదని తేల్చిచెప్పినా మళ్ళీ వాటి విధి-విధానాలపై మరొక కమిటీ వేయటం కాలయాపన కాకుండా మరేమిటీ?

ప్రయివేట్ వర్సిటీలలో వెనుకబడిన, బడుగు, బలహీన వర్గాలవారికి సమానావకాశాలు, రిజర్వేషన్లు కల్పించాలి. దీనిపై ఇంక లోతైన చర్చలు జరగాల్సినంతాలోపే ప్రయివేట్ వర్శిటీలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ప్రస్తుతం యూనివర్సిటీలలో పరిశోధనల దిశగా వెళ్తున్నవారు కేవలం 0.5 శాతమే అంటే నమ్మశక్యం కాదు. పరిశోధనలు మరింత పుంజుకోవాలన్నా, ఉన్నత విద్యా పురోగతి చెందాలన్నా విద్యార్థులకు ఆర్థిక సహాయం, వర్సిటీలకు నిధుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

పీహెచ్ డి. పరిశోధకుడు, జే ఎన్ యూ, న్యూఢిల్లీ. సెల్: 9868328761



డాక్టర్ చుక్కా రామయ్య

చీకటి రాజ్యంలో దీపాలు అవసరం

రామయ్యమాట

భారత 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎప్పటిలాగే అట్టహాసంగా ముగిశాయి. ప్రధాని నరేంద్ర మోడీ ఎర్రకోటపై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నవభారత నిర్మాణమే ధ్యేయంగా సామరస్యతతో ప్రభుత్వం ముందుకెళ్తుందని, విశ్వాసాల పేరుతో హింసకు పాల్పడితే సహించేదిలేదని సందేశమిచ్చారు. బ్రిటిష్ నిరంకుశ ప్రభుత్వ పాలనకు ఎదురొడ్డి నిలిచి పోరాటం చేసిన ఎంతోమంది మహనీయుల ప్రాణత్యాగాల ఫలితమే నేటి మన స్వాతంత్ర్య భారతం. ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆలోచిస్తూ తమ జీవనాన్ని ఆనందమయంగా గడపాలని నాటి త్యాగధనులు భావించారు. ఎలాంటి నిబంధనలు లేని జీవనాన్ని, స్వేచ్ఛను, మూఢవిశ్వాసాల రహిత సమాజాన్ని కాంక్షిస్తూ తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలి దేశభక్తి చాటుకున్నారు. మరి ఆ గొప్ప దేశభక్తుల ఆలోచనలను మనం ఎంతవరకు భవిష్యత్తు తరాలకు తెలియజెప్తున్నాం. వివిధ మతాలు, జాతులు, వర్గాల ప్రజల సమాహారం కల్గిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు ఎంత స్వేచ్ఛగా బతుకుతున్నారు? ఎంత స్వతంత్రంగా తమ భావాలను, అభిప్రాయాలను వ్యక్తీకరించగలుగుతున్నారు? మూఢవిశ్వాసాలను పారద్రోలి సమాజంలో సైంటిఫిక్ టెంపర్‌ను తీసుకొచ్చేందుకు మన ప్రభుత్వాలు ఏ మేరకు కృషిచేస్తున్నాయి? అనేది ఈ సందర్భంగా ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

సమాజంలో మూఢవిశ్వాసాలు రెట్టింపు అవుతున్న ప్రమాదకరమైన పరిస్థితుల్లో మరిన్ని ఉద్యమాలకు పదును పెట్టాల్సిన తరుణంలో శాస్త్ర సాంకేతికరంగానికి ఎనలేని సేవలందించిన పీఎం భార్గవ, యశ్‌పాల్, యు.ఆర్.రావు ఈ ఏడాదిలో మృతిచెందడం దేశానికి తీరని లోటు. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ ముగ్గురు మహనీయులు చేసిన కృషి ఎంతో శ్లాఘనీయం. వారి ఆలోచనల్ని, ఆవిష్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా మరికొందరు వ్యక్తులు ముందుకురావాల్సిన అవసరం ఉంది. ఏది నిజమో, ఏది అబద్ధమో తెల్చుకోలేని స్థితిలో దేశం చీకటిలో మగ్గుతున్నప్పుడు వెలుగునిచ్చే దీపాలు రావాలి. మూఢనమ్మకాలను సమర్థంగా తిప్పికొట్టే గొంతుకలు విన్పించాలి. ఉద్యమాలను అణిచివేసే పాలకుల ధోరణులను తిప్పికొట్టే ధైర్యాన్ని కూడగట్టుకొని ముందుకు సాగి పోరాటం కొనసాగించే నికార్సయిన శాస్త్రవేత్తలు కావాలి. వాస్తవాలను ప్రజలకు వివరించే సైన్యం తయారు కావాలి. 2015లో మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన హేతువాద మేధావి, హంపీ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఎం.ఎం.కుల్బుర్గి హత్య, ఈనాడు గోవధ నిషేధం పేరిట దేశంలో జరుగుతున్న వివిధ రకాలైన దాడులు దేనికి సంకేతం. దేశంలోని ప్రధాని లాంటి మనిషి ఖండిస్తున్నప్పటికీ ఇలాంటి ఘటనలు దేశంలో చోటుచేసుకుంటుండటం ప్రజలకు ఎలాంటి సంకేతాలను పంపుతుంది. అందువల్ల ప్రభుత్వాధినేతలు ఎవరైనా కేవలం ఖండిస్తూ ప్రకటనలు మాత్రమే చేసినదానికన్నా..



అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటే ప్రజలు విశ్వసిస్తారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. అన్నంపెట్టే రైతన్న ఇంట్లోనే ఆకలిచావులు సంభవిస్తున్నాయి. ఆడ పిల్లలకు ఇంట్లోనూ, బయటా రక్షణ కరువవుతోంది. మనుషుల్లో నైతికత కరువవుతోంది. ఇలాంటి ఎన్నో సామాజిక రుగ్మతలను రూపుమాపినప్పుడే స్వాతంత్ర్యం కల నెరవేరుతుంది.

స్వేచ్ఛ అంటే కేవలం విదేశీయుల పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. స్వతంత్ర ఆలోచనల్ని ప్రోత్సహించడం. కానీ ప్రస్తుతం మన దేశంలో ఛాందస భావాలు, ఫండమెంటలిజం మనుషుల్ని కమ్మేస్తోంది. దీనికి తోడు విపరీతంగా సోషల్ మీడియాలో విస్తరిస్తోన్న సందేశాలు ప్రజల్ని తీవ్ర అయోమయంలోకి నెడుతున్నాయి. ఏది నిజమో, ఏది కల్పితమో తెలుసుకోలేని ప్రజలు గందరగోళంలో పడుతూ అనేక అనుమానాలు, అపోహల మధ్య గడుపుతున్నారు. ఇదెంతో ప్రమాదకరమైన పరిస్థితి. బ్రిటిష్ వాళ్ల నుంచి ఏ స్వేచ్ఛ కోసం పోరాటం ఆ త్యాగధనులు పోరాటాలు చేశారో.. వాటికే తిలోదకాలిస్తుండటం సిగ్గుచేటు. ఆ మహనీయుల త్యాగాలకు మనం ఇచ్చే విలువ ఇదేనా? ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఏ పనిచేసినా దాన్ని దేశభక్తితో ముడిపెట్టడం పరిపాటిగా మారింది. ప్రతి అంశాన్ని పవిత్రమైన దేశభక్తి అంశంతో ముడిపెడుతూ అపహాస్యం చేసే ప్రమాదకరమైన పరిస్థితులు దాపురించాయి. మరి ఇలాంటి వాటిపై ప్రభుత్వాలు ఏం చర్యలు తీసుకున్నాయో, ఆ దిశగా ఎంత వరకు అడుగులు వేస్తున్నాయో చెప్పాల్సిన అవసరం ఉంది. 'ఎత్తయిన బిల్డింగ్‌లు కట్టాం, ఫ్లైఓవర్ వంతెనల్ని నిర్మించాం అని చెప్పేదానికన్నా.. పాఠశాలల్లో శాస్త్రీయ దృక్పథాన్ని తీసుకొస్తున్నాం. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొదిస్తున్నాం. యూనివర్సిటీల్లో విద్యార్థుల ఆలోచనల్ని ప్రోత్సహిస్తూ ఏ మేరకు కొత్త పరిశోధనలకు వూతమిస్తున్నాం. దశల వారీగా పేదరికాన్ని రూపుమాపుతున్నాం. ప్రజల భావప్రకటనా స్వేచ్ఛను పరిరక్షిస్తున్నాం. ఆయా కుల, మత, వర్గాల ప్రజల అలవాట్లకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా స్వేచ్ఛగా ఈ దేశంలో బతకనిస్తున్నాం' అని ప్రభుత్వాలు చెప్పగలిగితే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల ఆత్మలు శాంతిస్తాయి.

దేశంలో సైన్స్ రంగంపై జరుగుతున్న దాడిని ఎదుర్కొంటూ.. విస్తరిస్తున్న మూఢవిశ్వాసాల నుంచి ప్రజల్ని చైతన్య పరిచేందుకు కొత్తవారు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. అశాస్త్రీయమైన ప్రచారాలతో ప్రజల్ని భ్రమలకు గురిచేయడం పాలకులకు రివాజుగా మారిపోయింది. దేశవ్యాప్తంగా భవిష్యత్తులో జరిగే వివిధ సదస్సుల్లో శాస్త్రీయమైన ఆలోచనల్ని ఏవిధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి? కొత్తగా ఏంచేయాలనే దానిపై శాస్త్రవేత్తలు, ప్రజాస్వామికవాదులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. అందుకనుగుణంగా ప్రణాళికలు రచించుకోవాలి. పాఠశాలల్లో సైంటిఫిక్ టెంపర్ తీసుకొచ్చేందుకు వీలుగా కమిటీలు రూపొందాలి. ఎన్జీవో సంస్థలు కూడా ఇందుకు ముందుకొచ్చి "మూఢాచారాలను నమ్మొద్దు- సైన్స్‌ను నమ్మండి" అంటూ క్యాంపెయిన్‌లు పెడితే బాగుంటుంది. పత్రికల్లో శాస్త్రీయ ఆలోచనల్ని ప్రోత్సహించే కథనాలు పెద్దఎత్తున రావాల్సిన అవసరం ఉంది.

ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు

మానవి
నవతెలంగాణ
manavi@navatelangana.com
హైదరాబాద్ బుధవారం 16-8-2017

నాలుగు రంగాల్లోనూ రాణించి..



టి.జి.కమలాదేవి

(29డిసెంబర్, 1930 - 16ఆగస్టు, 2012)

అలనాటి సినీ నటి, బహుముఖ ప్రజ్ఞాశాలి టి.జి.కమలాదేవి. దాదాపు 70 చిత్రాలకు పైగా తెలుగు, తమిళ చిత్రాల్లో నటించారు. డబ్బింగ్ ఆర్టిస్టుగా, గాయనిగా, నటిగా, క్రీడాకారిణిగా కమలాదేవి రాణించారు. బిలియర్డ్స్ క్రీడలో రెండు సార్లు జాతీయ చాంపియన్ షిప్ గెలుచుకున్నా మొదటి మహిళగా తన పేరు నమోదు చేసుకున్నారు.

కమలాదేవి చిత్తూరు జిల్లా కార్వేటినగరంలో జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, కష్ణస్వామి నాయుడు. ఆమెకు ఇద్దరు అక్కలు, తమ్ముడు. కమలాదేవి అసలు పేరు గోవిందమ్మ. చిన్నతనంలోనే వారి కుటుంబం పుత్తూరుకు వచ్చింది. ఐదో తరగతి చదువుతున్నప్పుడే తల్లి ప్రోత్సాహంతో ప్రముఖ గాత్ర విద్వాంసులు చెంచురామయ్య వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. దాదాపు వంద కీర్తనలు, శృతులు పాడారు. సంగీతానికి తోడుగా నాటకాల్లో కూడా నటించారు. ఆమె నటించిన ఎన్నో పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ప్రదర్శించిన నాటకాల్లో ఆమె నటించారు. ఆమె వేసిన అలెగ్జాండర్ పాత్ర గొప్ప గుర్తింపు తెచ్చింది.

Women of the day

చెన్నై ఆకాశవాణి కేంద్రంలో సంగీత, పౌరాణిక నాటకాలలో, లైట్ మ్యూజిక్ కచేరిల్లోనూ ప్రతిభ కనబరిచారు. అక్క జయమ్మ భర్త ప్రసిద్ధ నటుడు చిత్తూరు నాగయ్య. ఆయన ప్రోత్సాహంతో సినీ రంగ ప్రవేశం చేశారు. ఆమె నటించిన మొట్ట మొదటి సినిమా 'చూడామణి'. మంచి పేరు, గుర్తింపు తీసుకువచ్చిన సినిమా 'మాయలోకం'. అక్కినేని నాగేశ్వరరావు తొలి యుగళ గీతంలో హీరోయిన్‌గా నటించారు. పాతాళభైరవి, మల్లీశ్వరి (హీరోయిన్ ఇష్టసఖి జలజ) లాంటి హిట్ సినిమాల్లో నటించారు. 'మల్లీశ్వరి' సినిమాలో నటించడంతో పాటు కొన్ని పాటలు పాడారు. ఆ తర్వాత అనేక మంది నటీమణులకు డబ్బింగ్ చెప్పారు.



బాలనాగమ్మ, పాతాళ భైరవి, మల్లీశ్వరి, దక్షయజ్ఞం, ముగ్గురు మరాఠీలు, గుణ సుందరి కథ, కథానాయకుడు, ఇల్లరికం తోడుదొంగలు, పల్లెటూరు, చక్రపాణి, వెలుగు నీడలు, భక్త రాందాసు, బంగారు పంజరం, కంచుకోట, పెత్తందార్లు, అభిమానవతి చిత్రాలు ఆమెకు మంచి పేరు తెచ్చాయి.

1947లో సరదాగా కమలాదేవి బిలియర్డ్స్ నేర్చుకుని ఛాంపియన్‌గా ఎదిగారు. 1994, 1995లలో బెంగళూరులో జరిగిన స్నూకర్ పోటీలలో విజేతగా నిలిచారు. జమ్మూలో జరిగిన జాతీయ ఛాంపియన్ షిప్ పోటీల్లో విజేత అయిన మొదటి భారత మహిళ. దాదాపు 80 సంవత్సరాల వయసులోనూ స్నూకర్ పోటీలలో ఆమె పాల్గొన్నారు.

రంగస్థలం, చిత్రసీమ, ఆకాశవాణి, క్రీడారంగంలోనూ రాణించారు. చెన్నపురి ఆంధ్రమహాసభలో 1950లో సభ్యత్వం పొంది 1956 నుంచి కార్యదర్శిగా, అధ్యక్షురాలిగా వివిధ హెూదాల్లో సేవ చేశారు.

ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఆమెను నాటక కళాపూర్ణ అవార్డుతో సత్కరించింది. కమలదేవి సెన్సార్ బోర్డు చైర్మన్‌గా కూడా సేలందించారు. ❄

పక్క సర్దితే... మనసు సర్దుకుంటుంది

'బెడ్ మీద ఆ పక్కబట్టలేంటి? మడత పెట్టడం తెలియదా? మహారాణిలాగా పడుకుంటే నౌకర్లు వచ్చి తీస్తారా? రేపు పెండ్లయ్యాక కూడా ఇలాగే చేస్తే అత్తగారింట్లో తిట్లు తప్పవు...' నిద్ర లేచిన వెంటనే పక్క బట్టలు తీయకుండా



బాత్‌రూమ్‌లో దూరబడితే వినిపించే మాటలివే. నిజమే చాలా మందికి లేచిన వెంటనే పక్కబట్టలు తీయడం అలవాటు ఉండదు. కానీ ఇది మహా చెడ్డ అలవాటు అంటున్నారు మానసిక పరిశోధకులు. లేచిన వెంటనే పక్కబట్టలు మడతపెట్టి మళ్లీ బెడ్‌ను మునుపటిలా చేసేవాళ్లు... ఆ రోజును విజయవంతంగా గడిపేస్తారని చెబుతున్నారు. మిమ్మల్ని పని చేయించడానికో, అమ్మ వాళ్ల తిట్ల దండకం నుంచి బయట పడేయడానికో చెబుతున్నది కాదు. నూటికి నూరుపాళ్ల నిజం. చిన్నచిన్న అలవాట్లుగానే కనిపించినా అవి మీ వ్యక్తిత్వం మీద, మానసిక స్థితిమీద బాగా ప్రభావం చూపే పనులట. ఎంతగా అంటే రోజువారిగా మనం చేసే చిన్నచిన్న పనుల నుంచి... డబ్బు విషయంలో మీరు వ్యవహరించే తీరువరకు ప్రభావితం చూపుతాయట. రోజు లేవగానే తమ పక్కబట్టలు తామే మడత పెట్టేవాళ్లు.. జీవితంలో సక్సెస్‌ఫుల్‌గా ఉండటమే కాదు... ఎప్పుడూ బడ్జెట్‌ను దాటి వెళ్లరట. క్రమశిక్షణను అలవరిచే ప్రధాన పనుల్లో ఇదొకటి. దీంతోపాటు గిన్నెలు కడగటం, ఫ్లోర్ శుభ్రం చేయడం కూడా మనసు మీద ప్రభావం చూపుతాయట. కాబట్టి ఇంట్లో ఉన్న మగవాళ్ళ కూడా దేని గురించైనా యాంగ్జియస్‌గా ఫీలవుతున్నప్పుడు వెంటనే ఇలాంటి చిన్న చిన్న పనులు చేయించండి. ఈ పనులు సత్వర సంతోషాన్ని ఇస్తాయి. ❄

కేశ సౌందర్యానికి కొబ్బరి నూనె



జుట్టుకు రసాయన నూనెలు వాడటం వల్ల ఎన్నో సమస్యలు వస్తాయి. ముఖ్యంగా పొడవాటి జుట్టు ఉన్నవారికి సాధారణంగా చిక్కు సమస్య వేధిస్తుంటుంది. ఈ సమస్యను అధిగమించాలంటే కొబ్బరి నూనె వాడితే సరిపోతుంది. కావాలంటే చిక్కు పడిన జుట్టు దగ్గర ఒక్క చుక్క కొబ్బరి నూనె వేసి చూడండి. వేసిన వెంటనే జుట్టు పై అది జారి వెంటనే చిక్కు పోయి సరిగ్గా వచ్చేస్తుంది. అలాగే ఒక్క వెంట్రుక కూడా ఊడకుండా చేస్తుంది.

ఆమె చేతిలో రూపుదిద్దుకునే ఏ ఆకృతి అయినా కళాఖండంగా మారాల్సిందే.. అది కాగితం ముక్క కావచ్చు.. కాన్వాస్ కావచ్చు.. అద్భుతమైన చిత్రంగా అలరించాల్సిందే..అమ్మఒడి లోనే బొమ్మలు గీయడం నేర్చుకున్న ఆమె ఈరోజు వేలాది మందికి శిక్షణ ఇస్తున్నారు. కార్టూన్స్, జువెలరీ డిజైన్స్, పెయింటింగ్స్, కార్వింగ్, మైక్రోఆర్ట్ ఇలా అనేక ప్రక్రియల్లో తన కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్నా.. స్థానికంగా మాత్రం సరైన గుర్తింపు దక్కలేదు. ఆమె సువర్ణ భార్గవి.. పేరులోనే వర్ణాలను అద్దుకున్న కళాకారిణి.. ఆమె వర్ణమయ జీవితం గురించి ఆమె మాటల్లోనే ..



సప్తవర్ణాలతో బహు ప్రక్రియలు...



ఖమ్మం జిల్లా పోలంపల్లి మా సొంతూరు. నాన్న కొమరగిరి వెంకట అప్పారావు స్వాతంత్ర్య సమరయోధులు. అమ్మ సుగుణ మహిళా మండలి ఏర్పాటుచేసి మహిళలకు కుట్లు, అల్లికలు, పెయింటింగ్స్ నేర్పించేవారు. . ఊహతెలిసే నాటికే బొమ్మలపై ఇష్టం పెరిగింది. వర్ణమాల నేర్చుకోవడం ఒకవైపు.. సప్తవర్ణాలతో సహవాసం మరోవైపు అన్నట్టుగా ఉండేది. ఆ రోజుల్లో ఎక్కువగా డ్రాయింగ్ పోటీలు ఉండేవి కాదు. ఖమ్మం ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదివాను. పదవతరగతిలో మొదటిసారి డ్రాయింగ్ పోటీల్లో ఫస్ట్ బహుమతి అందుకున్నాను. ఆ తర్వాత అనేక బహుమతు వచ్చాయి. ఫైన్ ఆర్ట్స్‌లో చేరాలని ఉన్నా అందుబాటులో కాలేజీ లేదు. ఇంటర్‌లో సైన్సు గ్రూప్ తీసుకున్నాను. కేవలం బొమ్మలు గీయవచ్చున్న కారణంగానే సైన్సు గ్రూప్ తీసుకున్నాను. అయితే ఖమ్మంలో బైపిసి కోర్సు ఆఫర్ చేసే కాలేజీలు రెండే ఉండేవి. అందులో ఇంగ్లీష్ మీడియంలోనే బైపిసి ఉండేది. బొమ్మలపై ఇష్టంతో ఇంగ్లీష్ మీడియంలో చేరాను. డ్రాయింగ్‌లో గ్రేడ్1,2 పూర్తి చేశాను. ఏపీ ఓపెన్ యూనివర్సిటీలో సైన్స్ గ్రూప్‌లో ఫస్ట్‌బ్యాచ్‌లో బీఎస్సీ, ఎం.ఏ ఇంగ్లీష్ పూర్తి చేశాను. వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా ఆఫర్ వచ్చింది. కెప్టెన్ లక్ష్మి కాంతరావు గారి స్కూల్ అది. అక్కడ ఆరు సంవత్సరాలు టీచర్‌గా పనిచేశాను. వరంగల్ ఆర్ట్ సోసైటీలో సభ్యురాలిగా ఉన్నాను. మూడు సంవత్సరాల పాటు అనేక గ్రూప్ షోలకు జడ్జీగా ఉన్నాను. ఆ సమయంలోనే నేను వేసిన పెయింటింగ్స్‌తో సోలో ఎగ్జిబిషన్ నిర్వహించాం.

ఎన్నో బొమ్మలు కండ్ల ముందు..

స్కూల్‌లో పనిచేస్తున్న సమయంలోనే ఇంట్లో పెండ్లి సంబంధాలు చూశారు. శాలిబండలో హెూమియో డాక్టర్ వాసుదేవరావుతో పెండ్లి నిశ్చయం చేశారు. పెండ్లి అయితే నా ఆర్ట్ డస్ట్‌బీన్‌లో పడేయాల్సిందే అని బాధపడ్డాను. నాన్నతో పోట్లాడాను. ఇంట్లోవాళ్లు, కెప్టెన్ లక్ష్మికాంతరావు దంపతులు నచ్చచెప్పి పెండ్లి చేశారు. మా ఆయనది పెద్ద కుటుంబం. నేనే పెద్ద కోడలిని కావడంతో ఇంటి బాధ్యతలు మీద పడ్డాయి. బాబు పుట్టడంతో ఇక కాగితం ముట్టే సమయమే దొరికేది కాదు. కొన్నిసార్లు ఎంతో బాధగా ఉండేది. నేను వేయాలనుకున్న ఎన్నో బొమ్మలు కండ్ల ముందు కనిపించేవి. నిద్ర ఉండేది కాదు. బాబు పెంపకంతోనే టైం సరిపోయేది.

బీరువా సర్దుతుంటే..

కాగితాలు.. రంగులు పక్కన పడేసి ఇంటిపనులతో రోజూ గడిచిపోయేది. ఒకరోజు బీరువా సర్దుతుంటే మా ఆయన ఫైలు కనిపించింది. అందులో ఆయన సర్టిఫికెట్స్ ఉన్నాయి. ఆయన డ్రాయింగ్‌లో గ్రేడ్1,2 పూర్తిచేశారు. ఎన్నో బొమ్మలు గీసారు. నిజంగా ఆ క్షణం.. నేను కోరిన రంగుల ప్రపంచం నా ముందే ఉంది అనిపించింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆయన కళను వదిలి హెూమియోడాక్టర్‌గా మారారు. మా ఇద్దరికీ ఎంతో ఇష్టమైన చిత్రకళ మా అనుబంధాన్ని మరింత పెంచింది. ఒకవిధంగా చెప్పాలంటే పెండ్లి తర్వాత ప్రేమగా మారింది. ఆయన ప్రోత్సాహంతోనే నేను మళ్లీ బొమ్మలు వేయడం ప్రారంభించాను. పెండ్లికి ముందు వరకట్నం మీద స్టార్ట్ చేసిన పెయింటింగ్‌ను మా బాబుకు ఏడాది నిండిన తర్వాత పూర్తి చేశాను. మా ఆయన కూడా తన వర్క్స్ మళ్లీ స్టార్ట్ చేశారు.

కేంద్రీయ విద్యాలయంలో..

మా బాబును కేంద్రీయ విద్యాలయంలో జాయిన్ చేశాం. నేను అంతకు ముందు డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో డ్రాయింగ్ టీచర్‌గా మా బాబు స్కూల్‌లోనే అవకాశం వచ్చింది. మూడు సంవత్సరాలు పనిచేశాను. పిల్లలకు డ్రాయింగ్, క్లే తో బొమ్మల తయారీ, కార్టూన్స్ వేయడం, పేపర్ క్రాఫ్ట్ ఇలా అనేక అంశాలలో పాఠాలు, టెక్నిన్స్ చెప్పేదాన్ని. అప్పుడే మల్టీమీడియా కోర్సు, బుక్ పబ్లిషింగ్ కోర్సు పూర్తిచేశాను. ఆ తర్వాత వాసవి, నిఫ్ట్, గోల్కొండ సైనిక్ స్కూల్‌లోనూ డ్రాయింగ్ టీచర్‌గా పనిచేశాను.



లండన్ కంపెనీ నుంచి అవార్డు..

ఎక్కడ డ్రాయింగ్ ఏ పోటీలు జరిగినా, కార్టూన్ పోటీలు ఉన్నా పాల్గొనేదాన్ని. అలా ఒకరోజు హిందూ పేపర్‌లో జ్యువెలరీ డిజైన్స్ పోటీలు చూశాను. లండన్ కంపెనీ నిర్వహించిన ఆ పోటీలకు నేను వేసిన జ్యువెలరీ డిజైన్స్ పంపించాను. బెస్ట్ ఆర్టిస్ట్ అవార్డు వచ్చింది. లండన్ రమ్మని ఆహ్వానం వచ్చినా.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెళ్లలేదు. ఆ కంపెనీ వారే పోస్ట్‌లో అవార్డు పంపించారు.

జపాన్ పత్రికలకు కార్టూన్స్...

పెయింటింగ్స్‌తో పాటు కార్టూన్స్ కూడా వేసేదాన్ని. పేపర్‌లో వచ్చిన అన్ని కాంపిటేషన్స్‌కు నా కార్టూన్స్ పంపించేదాన్ని. అలా జపాన్ పత్రికలకు కూడా పంపించారు. అనేక కార్టూన్స్ ప్రచురితమయ్యాయి. బాపూ- ఆర్కే లక్ష్మణ్ అవార్డు, మార్వలేస్ వరల్డ్ రికార్డు కూడా అందుకున్నాను.

పోటీ తత్వం ఉంటేనే...

గెలుపు -ఓటమిలతో ప్రమేయం లేకుండా చిన్నతనం నుంచి అన్ని పోటీలలో పాల్గొన్నడం నాకు ఇష్టం. పోటీతత్వం ఉన్నప్పుడే మనల్ని మనం మెరుగుపరుచుకునే అవకాశం వస్తుంది. అందుకే కాంపిటీషన్స్‌కు సంబంధించి పేపర్‌లో సమచారం ఉంటే చాలు.. వెంటనే నా ఎంట్రీ పంపించేదాన్ని. అలా ఎన్నో .. ఎన్నో పోటీలలో బహుమతులు అందుకున్నాను. దాదాపు అన్ని పత్రికల్లో నా కార్టూన్స్, డ్రాయింగ్స్ వచ్చాయి. మైసూర్ యూనివర్సిటీ నుంచి బీఎఫ్ఎ, ఎంఎఫ్ఎ పూర్తిచేశాను. మా ఆయన కూడా ఎంఎఫ్ఎ పూర్తిచేశారు. ఇద్దరి లోకం రంగుల ప్రపంచమే కావడం నాకు ఎంతో ఉపయోగపడింది.



ప్రతిదాంట్లో ప్రయోగమే..

కష్టమైన పనిని పూర్తి చేసినప్పుడే మనలోని టాలెంట్ ఎంటో తెలుస్తుంది. నేను వేసే ప్రతి పెయింటింగ్‌లో కష్టమైన డిజైన్స్‌ను ఎంచుకుంటాను. స్కిల్ పెంచుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. మా ఇంట్లో చెక్కతో చేసిన టీపాయ్ ఉండేది. దానిపై లేస్ పరిచినట్టుగా పెయింటింగ్‌వేశాను. దారంతో అల్లిన లేస్‌ను పెయింటింగ్‌లో చూపించాలంటే చాలా కష్టమే. చిన్నచిన్న స్ట్రోక్స్‌తో..ఎంతో ఓపికగా వేయాల్సిందే. చాలా టైం తీసుకుంటుంది. అయినా ఎంతో ఇష్టంగా వేశాను. ఇంట్లోవారే కాదు ఎవరు చూసినా దానిపై లేస్ పరిచారు అనుకుంటారు. చేతితో తాకి చూస్తే తప్ప పెయింటింగ్ అని నమ్మరు. కష్టపడితేనే స్కిల్ పెరుగుతుంది. సమయం ఎక్కువ తీసుకున్నా సరే హార్డ్‌వర్క్ ఉండేలా పెయింటింగ్‌ను ఎంచుకుంటాను.

ఎండింగ్.. ఫోల్డింగ్‌తో..

చాలా పెయింటింగ్స్ ప్రయోగాత్మకంగా వేసినవే.. నా పెయింటింగ్స్‌లో ప్రతి లైన్ ఫోల్డింగ్‌తో ఎండ్ అవుతుంది. ఇది ఇప్పటివరకు ఎవరూ చేయని ప్రయోగం. నాకంటూ ఒక ప్రత్యేక లైన్ ఉండాలన్న ఆలోచనతో దీనిని డెవలప్‌చేశాను. ఇప్పుడు ఈ ఫోల్డింగ్ ఆర్ట్‌పై పేటెంట్‌కు అప్లైచేశాను. ప్రత్యేక ఫాంట్‌ను కూడా రూపొందించాను.

వర్ణ ఆర్ట్స్‌తో...

ఫ్రీలాన్స్ ఆర్టిస్టుగా, డ్రాయింగ్ టీచర్‌గా చేస్తూనే ఆర్ట్‌ను అందరికీ చేరువ చేయాలన్న లక్ష్యంతో 'వర్ణఆర్ట్స్ సెంటర్' ను 2002లో ఏర్పాటుచేశాం. ఇద్దరు విద్యార్థులతో ప్రారంభమైన ఈ ఇనిస్టిట్యూట్‌లో ఇప్పటివరకు వేలాది మంది రంగులతో తమ జీవితాలను వర్ణమయం చేసుకున్నారు. ఐదేండ్ల పిల్లల నుంచి రిటైర్డ్ అయిన పెద్దవారి వరకు అన్ని వయసుల వారు డ్రాయింగ్ నేర్చుకుంటున్నారు.

రంగులతో స్నేహం పెరిగేలా..

కళలు మనిషిని ఉత్తేజితం చేస్తాయి. చిత్రకళ వారిలోని సృజనాత్మకతను వెలిక్కి తీయడంతో పాటు ఆనందాన్ని ఇస్తుంది. పట్టుదల, సృజనాత్మకత, సెన్స్‌ఆఫ్ హ్యూమర్ పెరుగుతుంది. చిన్నారులకు ఉపయోగపడేలా.. రంగులతో వారి స్నేహం మరింత పెరిగేలా ఒక మంచి పుస్తకం తీసుకురావాలని ఉంది.

✍ వి. యశోద

అమ్మ కౌగిలింతలో...

సహజంగా ఇంట్లో చిన్న పిల్లలుంటే ..వారు ఎప్పుడూ ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా తిరగాలనే తల్లిదండ్రులు కోరుకుంటారు. అందుకోసం ఎంత కష్టమైనా ఇష్టంగా భరిస్తుంటారు. అనునిత్యం వారిని ప్రేమగా చూసుకోవడం, వారి ఎదుగుదల బాగుండాలని క్రమం తప్పకుండా పోషకాహారం అందివ్వడం వంటివి సహజం. అయితే వీటితో పాటు చిన్నారులను మానసికంగా..శారీరకంగా ఆరోగ్యంగా ఎదిగేలా చేసేదేంటో తెలుసా..? తల్లిదండ్రుల నుండి ఒక చిన్న హగ్ (కౌగిలింత). పిల్లలకు తల్లిదండ్రులు ఆప్యాయంగా ఇచ్చే ఓ కౌగిలింత చిన్నారుల్లో ఒక చక్కటి ధ్రుఢమైన అనుబంధం ఏర్పరచటంతో పాటు, వారిని నిత్యం సంతోషంగా ఉండేలా చేస్తుంది. ఫలితంగా వారు అన్ని రకాలుగా ఆరోగ్యంగా తయారవుతారు. ఈ విషయాన్ని కొన్ని పరిశోధనలు సైతం స్పష్టం చేస్తున్నాయి. అందుకే చిన్నారులను కౌగిలించుకోవడం వల్ల వారిలో కలిగే మార్పుల గురించి ఈ వారం పేరెంటింగ్‌లో తెలుసుకుందాం..

సంతోషం నింపేస్తుంది

తల్లి ప్రేమగా దగ్గరకు తీసుకుంటే చాలు ఆ బిడ్డ సంతోషం మాటల్లో వర్ణించలేనిది. ఇక చిన్న పిల్లల విషయంలో ప్రత్యేకించి చెప్పుకోవాల్సిన అవసరం లేదు. అమ్మ వారిని గుండెలకు హత్తుకుంటే చాలు వారి కండ్లు సంతోషంతో నిండిపోతాయి. దీనికి కారణమేంటో తెలుసా? తల్లి కౌగలింతలో ప్రేమ. ఎక్కువ సమయం వారిని గుండెలకు హత్తుకొన్నప్పుడు వారి శరీరంలో ఆక్సిటోసిన్ విడుదలవుతుంది. దీన్ని 'హ్యాపీ హార్మోన్' అని కూడా పిలుస్తారు. తల్లిదండ్రులు ఎంత బిజీగా ఉన్నా చిన్నారులను కాసేపు హత్తుకోవడం ద్వారా వారిని సంతోషంగా ఉంచేలా చేయవచ్చు. దీనికోసం చిన్నారులను కనీసం 20 సెకన్ల పాటు హగ్ చేసుకోవాల్సి ఉంటుందని నిపుణుల సూచిస్తున్నారు.

మంచి నిద్ర

చిన్నారులకు నిద్ర వచ్చే సమయంలో వారిని గుండెలపై పడుకోబెట్టడం వల్ల వారికి చక్కగా నిద్రపడుతుంది. ఇది కూడా వారికి ఒక రకమైన కౌగిలింతే. అప్పటి వరకూ ఆటలతో అలసిపోయిన చిన్నారుల శరీరానికి ఇది రిలాక్సేషన్ థెరపీలా పనిచేస్తుంది. ఫలితంగా వారు వెంటనే నిద్రపోతారు. ఇక ఎప్పుడైనా మీ



చిన్నారులు నిద్రపోకుండా మారాం చేస్తుంటే ఈ చిట్కాలని పాటించి చూడండి ఫలితం మీకే తెలుస్తుంది.

అభద్రతా భావం దూరమవుతుంది

ప్రస్తుత రోజుల్లో నెలల వయసున్న పిల్లల్ని సైతం ఇంట్లో పెద్దల వద్ద, నర్సరీలు, క్రష్ లలో వదిలి ఉద్యోగాలకు వెళుతున్నారు. ఇలారోజంతా అమ్మానాన్నలకు దూరంగా ఎక్కువ సమయం గడపాల్సి రావడం వారిలో అభద్రతా భావాన్ని పెంచుతుంది. స్కూల్ చదువు వల్ల కూడా పిల్లలపై భారం పడుతుంది. ఇటువంటి సమయంలో వారికి ఒత్తిడి కలగడం సహజం. ఆ ఒత్తిడి తగ్గించి, పిల్లలు సంతోషంగా ఉండాలంటే ఒక చిన్న హగ్ ఇస్తే చాలు వారిలో సంతోషానికి కారణమయ్యే కార్టిసోల్ హార్మోన్ ఒత్తిడిని దూరం చేస్తుంది,

వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది

వివిధ కారణాల వల్ల చిన్నారులు కొన్ని సార్లు అనారోగ్యానికి గురతుంటారు. అలాంటి సందర్భంలో తల్లి కౌగిలే వారికి ధైర్యాన్నిచ్చి త్వరగా కోలుకొనేలా చేస్తుంది. దీనికి కారణం ఆక్సిటోసిన్ విడుదల కావడమే. అందుకే ఇటీవలి కాలంలో నెలలు నిండకుండా పుట్టిన బిడ్డలను తల్లి ఎక్కువ సమయం హత్తుకుని ఉంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ❄

నాలుగు వేల ఎకరాలు వేలం

- రాజధానికి భూమే పెట్టుబడి
- సిద్ధమవుతున్న విధి విధానాలు
- అంతర్జాతీయ కంపెనీలకే అవకాశాలు



అమరావతి : రాజధాని అమరావతిలో నాలుగు వేల ఎకరాల అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమైంది. వేలం పద్ధతిలో అంతర్జాతీయ కంపెనీలకు వీటిని విక్రయించనుంది. విద్యా సంస్థలు, ఆస్పత్రులు ఏర్పాటైన తరువాత భూమి విలువ పెరిగితే, 2019కి ముందే భూములు అమ్మేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా వచ్చే ఆదాయాన్ని రాజధానికి ఖర్చు పెట్టాలని చూస్తోంది. రాజధాని నిర్మాణానికి రూ.30 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. వివిధ సంస్థలకు భూముల అమ్మకాల ద్వారా వచ్చే నిధులు పోను ఈ అంచనాలో ఇంకా రూ.7500 కోట్లు లోటు ఉంటుందని లెక్కతేల్చారు. ఈ లోటు భర్తీకి రాజధాని భూములనే వనరుగా ప్రభుత్వం వినియోగిస్తోంది. ఈ భూమిని దేశవాళీ సంస్థలకు కాకుండా అంతర్జాతీయ సంస్థలకే విక్రయించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ సంస్థల అర్హతలుంటే దేశవాళీ సంస్థలైనా కొనుగోలు చేసుకోవచ్చనేది వేలంలో షరతుగా ఉంటుందంటున్నారు. రాజధాని అమరావతికి ఇంతవరకు ప్రభుత్వం 29 వేల ఎకరాలను సమీకరించింది. మరో 15 వేల ఎకరాలు వివిధ దశల్లో ఉంది. ఇంకా రాజధానికి ఆనుకుని సీఆర్‌డీఏ పరిధిలోని 75 వేల ఎకరాలు తమకు ఇవ్వాలని కేంద్ర అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆ ఫైలును తిరస్కరించింది. అంత భూమిని బదలాయించడం సాధ్యం కాదని తేల్చి చెప్పేసింది. దీంతో 33 వేల ఎకరాలన్నా ఇవ్వాలని కోరుతూ మరో లేఖ రాసింది. కేంద్రం దాన్ని ఇచ్చేందుకు కొంత సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంతో భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలకు వీటిని వినియోగించుకోవాలని సిఆర్‌డిఏకు సూచించింది. రాజధాని నగరంలోకి పెద్ద పెద్ద సంస్థలన్నీ వస్తే భూమి విలువ అనూహ్యంగా పెరుగుతుందని, ఈ నేపథ్యంలో అమ్మకాలు సాగించడం ద్వారా ఆదాయం పెద్ద ఎత్తున సమకూరుతుందని సీఎం ఇటీవల జరిగిన రాజధాని ప్రాధికార అభివృద్ధి సంస్థ సమావేశంలో చర్చించారు. 2019 నాటికి పరిపాలన భవనాలను పూర్తి చేయాలని లక్ష్యంగా చేసుకుని, భూ వేలాన్ని ముందుకు తెచ్చారు. కేంద్రం నిధులిచ్చినా ఇవ్వకపోయినా ఈ నిర్మాణాలకు అడ్డులేకుండా ఆర్థిక వనరులు సమకూర్చుకునే ప్రయత్నంగా పలువురు ఈ వేలాన్ని భావిస్తున్నారు.

త్యాగాల నుంచి స్ఫూర్తి : పవన్ కళ్యాణ్

హైదరాబాద్ : జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు చదివానని, వారు చేసిన త్యాగాల నుంచి స్ఫూర్తి పొందానన్నారు. దేశం ఉండటం ఎంత అవసరమో.. దేశమే లేని ప్రజలను, పాలస్తీనా పౌరుల్ని అడిగితే ఆ బాధేంటో తెలుస్తుందని అన్నారు. 'మన దేశం గొప్పది అని ఎందుకంటున్నానంటే.. పాకిస్థాన్ దేశంలో ఒక హిందూ ప్రధానిని గానీ, రాష్ట్రపతిని గానీ చూడలేం. కానీ ఈ దేశం తాలూకు గొప్పతనం ఏంటంటే.. ఒక ముస్లింని.. అంటే అబ్దుల్ కలాం, జాకీరుస్సేన్ లాంటి వ్యక్తులను రాష్ట్రపతిని చేసింది.' అని అన్నారు. ఏ కులమైనా.. ప్రాంతమైనా.. మతమైనా.. ఒకరికి అన్యాయం జరుగుతున్నప్పుడు వాళ్లకు మద్దతుగా నిలిచి.. వాళ్ల తరపున వినిపించే కొన్ని కోట్ల గొంతుకలు ఈ దేశంలో ఉన్నాయని తెలిపారు.

శుభ్రంగా ఉండరు ..చదువురాదు

దళితులపై మంత్రి ఆదినారాయణ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు



జమ్మలమడుగు : 'దళితులు శుభ్రంగా ఉండరు ... వారికి చదువు కూడా రాదు ... కానీ వారే సూపరింటెండెట్లు అయిపోతారు' అని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కడప జిల్లా జమ్మల మడుగులోని ప్రభుత్వాస్పత్రిని ఆయన సందర్శించారు. సూపరింటెండెంట్ రామేశ్వరుడు అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల నుద్దేశించి ఒక్కసారిగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. దళితులు శుభ్రంగా ఉండరు. వారికి చదువురాదు అంటూ మాట్లాడిన ఆయన అంతటితో ఆగలేదు. రిజర్వేషన్ల అంశాన్ని కూడా ప్రస్తావించారు. 'ఏదోలే వెనుక బడ్డారని అప్పట్లో ఓ పదేండ్లు అంబేద్కర్ వల్ల రిజర్వేషన్లు వచ్చాయి. పదేళ్లు పోయాయి. 70 ఏండ్లు పూర్తయ్యాయి. అయినా ఇంకా రిజర్వేషన్లు కొనసాగు తున్నాయి. ఎన్ని వసతులు కల్పించినా దళితులు మారరు.' అని అన్నారు. దళితులనుద్దేశించి ఇన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తరువాత చివర్లో దళితుల్లో మార్పు రావాలని, వారిలో మార్పు వచ్చేంతవరకు సమాజం అభివృద్ధి చెందదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారిలో ఎస్సీ, ఎస్టీలే అధికంగా ఉన్నారని తెలిపారు.

విలేకరులపైనా చిందులు!

దళితులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆది విలేకరులపైనా తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. అరకొర చదువులు చదువుకుని విలేకరులుగా వస్తారన్నారు. మేము చెప్పేది రాయరని, మిడిమిడి జ్ఞానంతో వార్తలు రాస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి ఒక మూర్ఖుడని, ఆయన చెప్పిన మాటలు వినొద్దని విలేకరులకు సూచించారు. కోతులు చెప్పే మాటలు పాత్రికేయులు రాయ వద్దన్నారు. దళితులు చదువుకోవాలని, మారాలని, అప్పుడే వారు అభివృద్ధి చెందుతారని చివర్లో పేర్కొనడం గమనార్హం.

నోరు అదుపులో పెట్టుకోవాలి : కేవీపీఎస్

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలను కేవీపీఎస్ ఖండించింది. దళితులకు చదువు రాదని, వారికి శుభ్రత తెలియదని, అందుకే వారు వెనుకబడ్డారన్నారని మాట్లాడటం సరికాదని, మంత్రి నోరు అదుపులో పెట్టుకోవాలని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి నోటిని ఫినాయిల్‌తో శుభ్రం చేసుకోవాలన్నారు. జర్నలిస్టుల పట్ల చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఇంత అహంకార మంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టి బొమ్మలను అన్ని జిల్లా పట్టణ, మండల కేంద్రాల్లో దహనం చేయాలని పిలుపునిచ్చారు.

రెండు నెలల్లో నిరుద్యోగ భృతి

71వ స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం చంద్రబాబు


తిరుపతిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

తిరుపతి : రాష్ట్రంలో రెండు నెలల్లో నిరుద్యోగ భృతిని కల్పిం చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా వాయిదా పడుతూ వస్తున్న 'అన్న' క్యాంటీన్లనూ దసరాకల్లా ప్రారంభిస్తామన్నారు. అయితే ఉపాధి వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతిని నిలిపేస్తామని చెప్పారు. 71వ స్వాతంత్ర్య వేడుకలకు తిరుపతి తారకరామ స్టేడియం వేదికయ్యింది. మంగళవారం ఉదయం 9 గంటలకు జెండాను ఆవిష్క రించిన అనంతరం పోలీసు కవాతు, 74 మంది పోలీసులకు, 22 మంది ఉన్నతాధికారులకు మెడల్స్, పురస్కారాలు, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, శకటాల ప్రదర్శన అనంతరం దాదాపు గంటా 20నిమి షాలపాటు చంద్రబాబు మాట్లాడారు.తొలుత 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగస్వాములైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో, ప్రపంచంలో ఉన్న భారతీయులందరికీ ఈ స్వాతంత్ర్య దినోత్సవం స్ఫూర్తి నింపాలన్నారు. స్వేచ్ఛా భారతం కోసం మహాత్మాగాంధీ నాయకత్వంలో బ్రిటీష్ వారిపై రాజీలేని పోరా టం చేశారన్నారు. ఇందులో భాగంగానే భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్ వంటి మహనీయులు వీరోచిత ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. వారి త్యాగస్ఫూర్తితో భారతదేశ పౌరులు మరింత ముందుకెళ్లాలన్నారు.

రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు పేరు తలచుకుంటే ఆవేశంతో పాటు మంచి స్ఫూర్తిని నింపుతుందన్నారు. మువ్వన్నెల జెండాను రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య మన తెలుగువాడేనని చెప్పారు. 'జనగనమణ' గేయాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లిలో ఆలపించారన్నారు. ఏ ప్రపంచంలో లేనటువంటి యువత, విద్యార్థులు భారతదేశంలో ఉన్నారని, ఇది శుభపరిణామమని అన్నారు.

'వంశధార' పనులు అడ్డగింత

- యంత్రాలను వెనక్కి మళ్లించిన అధికారులు


శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో నిర్వాసితులకు అడ్డుకుంటున్న పోలీసులు

శ్రీకాకుళం జిల్లా : వంశధార జలాశయం నిర్మాణంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని తులగాం గ్రామంలో నిర్వాసితుల పంట పొలాల్లో చేపట్టిన మట్టి సేకరణ పనులను నిర్వాసితులు మంగళవారం అడ్డుకున్నారు. యంత్రాలను అడ్డుకొని ఎదురుతిరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు వాటిని వెనక్కి మళ్లించారు.వంశధార జలాశయం గట్టు నిర్మాణానికి తులగాం గ్రామ సమీపంలోని మట్టిని సేకరించేందుకు వరి నాట్లు వేసిన పొలాల్లోకి యంత్రాలను అధికారులు దింపారు. దీంతో గ్రామస్తులంతా తమ పొలాల వద్దకు చేరుకొని వాటిని అడ్డుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పాలకొండ ఆర్‌డీఓ ఆర్.గున్నయ్య అక్కడకు చేరు కున్నారు. ప్రాజెక్టు పనులు సజావుగా జరిగేందుకు సహకరించాలని నిర్వాసితులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. తమ సమస్యల పరిష్కారం తర్వాతే పనులు చేపట్టాలని వారు తేల్చి చెప్పడంతో ఆయన వెనుదిరిగారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ ఈ ఏడాది వేసుకున్న వరి పంట పూర్తయిన తర్వాతే పనులు చేపట్టాలన్నారు. కేవలం తమ గ్రామ పొలాల్లోనే మట్టి సేకరణ పనులు చేపట్టడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అధికారులు మొండిగా వ్యవహరిస్తే, దేనికైనా సిద్ధమేనని హెచ్చరించారు. చివరకు పోలీసులు నిర్వాసితులను శాంతింపజేసి గ్రామానికి తిరిగి పంపించారు.

గర్భిణిపై లైంగిక దాడి యత్నం కేసులో..

డాక్టర్‌ను శిక్షించండి

నెల్లూరు : గర్భిణీపై లైంగిక దాడి యత్నం చేసిన డాక్టర్ ఠాగూర్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి దినారి ప్రభాకర్ మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పొదలకూరు టైలర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఇండ్ల అరుణ కుమారి వైద్య పరీక్షల నిమిత్తం సీహెచ్‌సీ డాక్టర్ ఠాగూర్‌ని సంప్రదించేందుకు శుక్రవారం వెళ్లిందని తెలిపారు. సదరు డాక్టర్ స్కానింగ్ తీయాలని, తలుపువేసి అఘాయిత్యం చేయబోయాడన్నారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా ప్రవర్తించాడని, వైద్య వృత్తికే కళంకం తెచ్చారని మండిపడ్డారు. ఆ ఘటనను హేయమైన చర్యగా గిరిజన సంఘం భావిస్తోందన్నారు. నిర్భయ చట్టం నమోదు చేసి డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒకే కాన్పులో నలుగురు పిల్లలు

తిరువూరు : కృష్ణాజిల్లా తిరువూరులో ఒకే కాన్పులో నలుగురు బిడ్డలకు ఓ తల్లి జన్మనిచ్చింది. ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం గ్రామానికి చెందిన మల్లిబోయిన రామకృష్ణ భార్య భావనికి ఎనిమిదో నెలకే పురిటి నొప్పులు రావడంతో తిరువూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి రెండురోజుల క్రితం తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం ఐదు గంటల సమయంలో ఆపరేషన్ లేకుండానే సాధారణ కాన్పు ద్వారా నలుగురు బిడ్డలకు జన్మనిచ్చింది. పుట్టిన వారిలో ఒక మగ బిడ్డ కాగా, మిగిలిన ముగ్గురు ఆడపిల్లలు. ఎనిమిదో నెలలోనే డెలివరీ కావడంతో మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్ సలహా మేరకు శిశువులను విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ నియంతృత్వ పాలనే

- రెండు కోట్ల ఉద్యోగాల మాటే లేదు : చుక్కరాములు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యులు చుక్క రాములు

నవతెలంగాణ - ఏఎస్‌రావునగర్

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వాలు నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కా రాములు అన్నారు. మంగళవారం ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర-నష్టానికి గురవుతున్నారని చెప్పారు. 2014 ఎన్నికల్లో నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు సంవత్సరంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. రోజురోజుకూ దేశంలో నిరుద్యోగ సమస్య పేరుకుపోతోందన్నారు. గోగుండా దాడులు పెరిగిపోయాయని అన్నారు.

దేశంలో చట్టసభలకు ప్రాధాన్యత లేకుండా ప్రతిపక్షాలకు ప్రజాసంఘాల సలహాలు కూడా తీసుకోకుండా ఏకపక్షంగానే అన్ని నిర్ణయాలు తీసుకుంటూ నియంతృత్వ పాలనను కొనసాగిస్తున్నారని ఇది చాలా ప్రమాదకరమని తెలిపారు. రాష్ట్రంలో కేసిఆర్ పాలన తమ కుటుంబాలకు లాభం చేకూర్చే విధంగా కొనసాగుతోందన్నారు. పోలీసులను తమ స్వార్థం కోసం ఉపయోగిం చుకొని ప్రజా ఉద్యమాలను, సీపీఐ(ఎం) అనుబంధ సంఘాలను అణచడానికి ఉపయోగించుకుంటున్నారని ఆవేదన చెందారు. సంఘాల్లో చీలికలు తెచ్చి, తమ పబ్బం గడుపుకోవడానికి కేసిఆర్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. రైతుల్లో తీవ్ర అసంతృప్తి ఉందని ప్రజా ఉద్యమాలను నిర్వహించేందుకు ఉద్యమ శక్తులన్నీ బలపడి చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరిగే విధంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. టీ-మాస్ ద్వారా సదస్సులు, ఉద్యమాలు నిర్వహిస్తున్నామని , సెప్టెంబర్ 1న జరిగే సామ్రా జ్యవాద వ్యతిరేక విధానంలో ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 15నుంచి 30వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్వహించిందని తెలిపారు. మీడియా పై కూడా దాడులు పెరిగిపోతున్నాయని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మేడ్చల్ కార్యదర్శి కోమటిరవి, కార్యదర్శవర్గ సభ్యులు పి.సత్యం, నాయకులు చంద్రశేఖర్, వెంకట్, అశోక్, వినోద, సృజన, శ్రీనివాస్, యాదిగిరి రావు, నిర్మల, యాదయ్య పాల్గొన్నారు.

బీహార్ డిప్యూటీ సీఎం కాన్వాయ్‌పై రాళ్లదాడి

పాట్నా : బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీ కాన్వాయ్‌పై దాడి జరిగింది. రాష్ట్రంలోని వైశాలి జిల్లా చక్సికాందర్‌లో సుశీల్ కాన్వాయ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. సీఎం వాహనం పాక్షికంగా దెబ్బతిన్నది. అయితే.. ఈ దాడి వెనుక రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) కార్యకర్తల హస్తమున్నదని సుశీల్ ఆరోపించారు.

ఫీజుల కిరికిరి

- సర్కారు నాన్చుడు ధోరణి
- ఫీజుల పథకాన్ని ఎత్తివేస్తున్నారన్న ప్రచారం
- విద్యార్థుల్లో ఆందోళన
- రూ.2500 కోట్లకు పైగా బకాయిలు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఫీజు చెల్లింపులపై విద్యార్థుల్లో అనుమానాలు, ఆందోళన తీవ్రమైంది. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం కింద బకాయిలు చెల్లించకపోవడంతో ఇంతకు ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుందా? లేదా? అన్న ఆందోళనలో విద్యార్థులు ఉన్నారు. సుమారు రూ.4వేల కోట్లకు పైగా ఉన్న పాత బకాయిలు ఉన్నాయి. వాటి చెల్లింపులపై ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంభిస్తున్నది. రెండేండ్లు గడుస్తున్నా ఫీజు చెల్లింపు విషయంలో సర్కారు ఇప్పటికీ ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 2014-15లో 13 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 2015-16లో 14.20 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2016-17 లో 14 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంకా సమాచారం లేదు. ఫీజుల రూపంలో ప్రతి ఏటా ప్రభుత్వం రూ.2570 కోట్లు చెల్లించాల్సి వస్తుంది.

సర్టిఫికెట్ల కోఅతీ నరకయాతన

2017-18 విద్యా సంవత్సరం ఆరంభమై మూడు నెలలు గడుస్తున్నది. వివిధ కళాశాలల్లో ఫైనలియర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇతర కోర్సుల్లో చేరడానికి సిద్ధమవుతున్నారు. కాని ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు టీసీలు, ఇతర ధ్రువపత్రాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు అప్పులు చేసి ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేకనే ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుందన్న నమ్మకంతో వివిధ కోర్సుల్లో చేరామని, ఇప్పటికిప్పుడు పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించడం ఎలా సాధ్యమవుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు చెల్లిస్తున్న ఫీజుల భారాన్ని తగ్గించుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. గత కొద్ది రోజులుగా ఎవరికి.. ఎలా ఫీజు చెల్లించాలన్న అంశంపై సర్కారు సుదీర్ఘంగా చర్చిస్తోంది.

కళాశాలల ముందు చూపు

ఫీజు చెల్లింపు విషయంపై కళాశాలలకు ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లినట్టు తెలుస్తోంది. ఈ ఏడాది కన్వీనర్ కోటాలో చేరే విద్యార్థులు అడ్మిషన్ తీసుకునే సమయానికే విద్యార్థుల నుంచి కొంత ఫీజు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ప్రతి సంవత్సరం సకాలంలో ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దానిని అధిగమించడానికే ముందుగా ఫీజులు వసూలు చేస్తున్నామని కళాశాలల యాజమాన్యాలు అంటున్నాయి.

సీఎం హామీ గాలికేనా..!

విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి ఫీజు బకాయిలను మొత్తం చెల్లిస్తామని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో ప్రకటించారు. సమావేశాలు జరిగి ఆరునెలలవుతున్నా ఇప్పటికీ రూపాయి కూడా విడుదల చేయకపోవడం గమనార్హం.

మొత్తం విడుదల చేసిన ఫీజుల వివరాలు (రూ.కోట్లలో) 2015-16

విద్యార్థుల సామాజిక వర్గం	విద్యార్థుల సంఖ్య	ఆర్‌టీఎఫ్	ఎంటీఎఫ్	మొత్తం
బీసీ	7,79,272	577.60	240.22	817.82
ఈబీసీ	1,00,195	147.92	0	147.92
మైనార్టీ	123690	144.20	29.98	171.48
ఎస్సీ	2,66,517	257.99	97.99	355.98
ఎస్టీ	1,45,761	118.02	640.3	178.45
వికలాంగులు	285	17	4	21
మొత్తం	14,15,720	1245.90	428.65	1674.56
2016-17				
	758144	0	0	0
	93641	0	0	0
	124452	0	0	0
	250412	0	0	0
	141204	0	0	0
	235	0	0	0
మొత్తం	1368071	0	0	0

పేదల దరి చేరని పట్టణ ఆరోగ్య మిషన్

- నిధులున్నా ఖర్చు చేయని ఆరోగ్యశాఖ
- మూడేండ్లలో రూ.439 కోట్లు మంజూరైతే రూ.71 కోట్లు ఖర్చు
- నీరుగారుతున్న ఆరోగ్య సంరక్షణ పథకం
- ఎన్‌యూహెచ్‌ఎం కేంద్రాలపై దృష్టిసారించని సర్కారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అదో గొప్ప పథకం. పేదలు అల్పాదాయ వర్గాల వారికి ఉపయోగంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది. కోట్లాది రూపాయల నిధులు కూడా వెచ్చిస్తున్నది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం కేవలం వేతనాల కోసం తప్ప మరో రూపంలో వాటిని ఖర్చు చేయచకపోవడం విశేషం. జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ (ఎన్‌యూహెచ్‌ఎం) కథ ఇది. గత మూడేండ్లలో కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తే అరకొర మాత్రమే ఖర్చు చేశారు. ఇందులో పేదల ఆరోగ్యం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోగా.. ఖర్చు చేసిన నిధులు వేతనాల కోసమే వెచ్చించడం విశేషం. అధికారుల నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట అనే విమర్శలున్నాయి. రాష్ట్రంలో 179 యూపీహెచ్‌సీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో హైదరాబాద్‌లో 85 ఉండగా, మిగతా జిల్లాల్లో 94 కేంద్రాలు ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మాదిరిగా యూపీహెచ్‌సీల్లోనూ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, అవసరమైన మందులు అందిస్తారు. ప్రతి సేవనూ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. కేవలం అంటువ్యాధుల చికిత్సలపైనే కాకుండా మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మానసిక సమస్యలు తదితర రుగ్మతలను గుర్తించడం, చికిత్సలందించడం వంటివి కేంద్రాల్లో చేస్తారు. వీటన్నింటి కోసం మూడేండ్లలో కేంద్రం రూ.439.60 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు కేవలం రూ.71.85 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఎన్‌యూహెచ్‌ఎం జాయింట్ సెక్రెటరీ రాజేశ్వర్ రావు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో పేర్కొనడం గమనార్హం. పథకం అమలులో ఇతర రాష్ట్రాల కంటే రాష్ట్రం వెనుకబడ్డదని ఆవేదన వ్యక్తం చేశారు. మురికివాడల ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా రూపొందించిన ఎన్‌యూహెచ్‌ఎం నిధులను సరిగ్గా వాడుకోవాలని అధికారులకు చురకలంటించారు. పట్టణ ఆరోగ్యం కోసం రాష్ట్రాలు ఎంత పక్కగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తే నిధులు అంత ఎక్కువగా కేటాయిస్తామని చెప్పారు.

అతీగతీలేదు

పట్టణాల్లోని పేద, వెనుకబడిన వర్గాల ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం 2013లో ఎన్‌యూహెచ్‌ఎంను ప్రారంభించింది. విస్తరిస్తున్న నగరాల్లో కొత్తగా వెలుస్తున్న బస్తీలకు వైద్య సేవలు అందడంలేదు. నిరాశ్రయులు, చెత్త ఏరుకునేవారు, వీధి పిల్లలు, రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వేశ్యలు, తాత్కాలిక వలసదారులు తదితర ప్రజలందరికీ అందుబాటులో మెరుగైన వైద్యసేవలు అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఒక పక్క ఎన్‌యూహెచ్‌ఎం కేంద్రాలను ఆధునీకరించాలని కేంద్రం యోచిస్తుండగా, కార్యక్రమ అమలుపై మాత్రం బాధ్యులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతమున్న ఆరోగ్య కేంద్రాలు అధిక శాతం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. హైదరాబాద్ పరిధిలోని కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున వైద్యులుండగా, జిల్లాల్లో సగానికిపైగా ఖాళీలు ఉన్నాయి. అయితే, ఇటీవలే కొన్ని జిల్లాల్లో ఖాళీలను భర్తీ చేసినప్పటికీ చాలా జిల్లాల్లో సిబ్బంది కొరత వేధిస్తున్నది. దీంతో ఈ కేంద్రాల్లో నిర్ధారణ పరీక్షలు, మందులివ్వడంలాంటివి జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. వీటన్నింటినీ చక్కదిద్దడంలో సంబంధిత ఉన్నతాధికారులు దారుణంగా విఫలమవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీగా 85 కేంద్రాలు ఉండటంతో ప్రత్యేకంగా ఒక పట్టణ ఆరోగ్య సొసైటీని ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఎం గతంలోనే సూచించింది. ఈ సొసైటీకే నేరుగా నిధులను విడుదల చేస్తామని పేర్కొంది. అయినా దానిని పూర్తి చేసిన దాఖలాలు లేవు. వేతనాలు కోసం తప్ప మరో రూపంలో ఈ పథకం కింద నిధులు ఖర్చు చేయడంలేదని ఎన్‌యూహెచ్‌ఎం ఉన్నతాధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సర్కారు చొరవ తీసుకొని మురికివాడల ప్రజల సంరక్షణ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

వేతన ఒప్పంద చేయాలి

- ఎస్‌పీఎం పవర్ టెలికాం కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

నవతెలంగాణ - ఏఎస్‌రావునగర్



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఎస్‌పీఎం పవర్ టెలికాం కంపెనీలో వేతన ఒప్పందం చేయాలని కార్మికులు ఆందోళనకు దిగారు. ఆరు మాసాలుగా వేతన ఒప్పందం చేయ కుండా కాలయాపన చేయ డాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ 14 ఏండ్ల నుంచి 12 గంటలు పనిచేయించుకుంటూ ఈఎస్ఐ, పీఎఫ్ కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని అన్నారు. కార్మికుల శ్రమను యాజమాన్యం దోచుకుంటుందని అన్నారు. కార్మికులు సంఘటితమై యూనియన్ పెట్టుకున్నారని యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని చెప్పారు. వేతన ఒప్పందం గురించి చార్టర్ ఆఫ్ డిమాండ్స్ ఇచ్చి ఆరునెలలు గడుస్తున్నా చలనం లేకుండా మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా జమాన్యం యూనియన్ నాయకులతో చర్చించి సామరస్య వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉత్పత్తి నిలిపేసి, సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఇండస్ట్రియల్ కోశాధికారి ఎంఎస్.రావు, అట్లాస్ కాప్కో ప్రధాన కార్యదర్శి పివి.సత్యనారాయణ, శివప్రా క్రేన్స్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆశీస్ క్రేన్ ప్రధాన కార్యదర్శి రసూల్, బీఈసీ కంపెనీ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, పూజన్ కెమికల్స్ ప్రధాన కార్యదర్శి పోచయ్య, దండూరి శివ, గోదావరి పాలిమర్స్, ఎలిమాస్ ఎన్నార్టిక్ కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

వాణిజ్య యుద్ధానికి తెరలేపిన ట్రంప్

- చైనా వాణిజ్య సంస్థలపై విచారణకు ఆదేశించిన ట్రంప్
- మేథోసంపత్తి చోరీ ఆరోపణలపై కమీషన్ ఏర్పాటు



బీజింగ్ : మనసులో ఏదో పెట్టుకొని చైనాను దెబ్బకొట్టాలన్న కుయుక్తికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరలేపారు. అమెరికా సాంకేతికత, మేథో సంపత్తి చోరీకి చైనా పాల్పడిందనే ఆరోపణలపె ట్రంప్ విచారణకు ఆదేశించారు. దీనిపై నిజానిజాల్ని నిగ్గుతేల్చాలంటూ అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ లైతజర్ నేతృత్వంలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటుచేశారు. దీనికి సంబంధించి కార్యనిర్వాహక ఆదేశాల్ని ట్రంప్ తాజాగా జారీ చేశారు. ఒకవేళ చైనాను దోషిగా తేల్చుతూ కమిషన్ నివేదిక సమర్పిస్తే, అప్పుడు చైనాపై ఏకపక్షంగా ఆంక్షలు విధించే అధికారం ట్రంప్‌నకు ఉంటుంది.

ట్రంప్ ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు ?

అమెరికా-చైనా మధ్య 648 బిలియన్ డాలర్ల (సుమారుగా రూ.41 లక్షలకోట్లు) విలువైన వర్తక, వాణిజ్య సంబంధాలు నెలకొన్నాయి. అమెరికా నుంచి చైనాకు జరుగుతున్న ఎగుమతులకన్నా, చైనా నుంచి అమెరికాకు జరుగుతున్న దిగుమతుల విలువ ఎక్కువ. అంటే ఇరు దేశాల వర్తక,వాణిజ్య సంబంధాల వల్ల చైనా పెద్ద ఎత్తున లాభపడుతున్నదని ట్రంప్ భావిస్తున్నారు. కానీ దీనికంటే ముఖ్యమైన అంశం అమెరికా కార్పొరేట్ లాబీ. చైనాను దెబ్బతీయాలనే దిశగా నిర్ణయం తీసుకోవాలంటూ ఎప్పట్నుంచో ట్రంప్‌పై ఒత్తిడి తీసుకొస్తూ ఉంది.

కారణం...చైనా మార్కెట్, అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం అమెరికా కార్పొరేట్ శక్తులకు లొంగకపోవటమే. చైనాలో ప్రవేశించాలంటే అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం కఠినమైన నిబంధనలు పెడుతున్నది. అందులో చాలా చాలా ముఖ్యమైనది...మేథోపరమైన హక్కులు, సాంకేతికత బదలాయింపు.

ఉదాహరణకు ఒక అమెరికా కార్ల తయారీ కంపెనీ చైనా మార్కెట్లోకి ప్రవేశించాలంటే అక్కడి ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలతో కలిసి పనిచేయాలి. మూడేండ్లపాటు మార్కెట్లో అమెరికా కంపెనీ తన కార్లను అమ్ముకోవచ్చు. ఆ తర్వాత కూడా ఉత్పత్తులు అమ్ముకోవచ్చు..కానీ అమెరికా కార్ల కంపెనీ తన సాంకేతికత, మేథోపరమైన హక్కులు వదులుకోవాల్సిందే.

ఒక్క మాటలో చెప్పాలంటే చైనా మార్కెట్లో అమెరికా కార్పొరేట్ కంపెనీల ఆటలు సాగవు. కార్పొరేట్ లాబీ, ఉ.కొరియా వివాదాన్ని మనసులో పెట్టుకొని చైనాపై అమెరికా కారాలు మిరియాలు నూరుతున్నది. ఉ.కొరియా విషయంలోనూ తాము చెప్పినట్టు చైనా ఆడటం లేదని ట్రంప్ మదనపడి పోతున్నారు. దీంతో చైనాతో వాణిజ్య యుద్ధానికి తెర లేపారు. అయితే ట్రంప్ అత్యంత ప్రమాదకర నిర్ణయం తీసు కున్నారని, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలకు ఇది గొడ్డలి పెట్టుగా మారుతుందని ఆర్థిక విశ్లేషకులు అంచనావేశారు.

చూస్తూ కూర్చోం : చైనా హెచ్చరిక

మేథోపరమైన హక్కుల చోరీపై ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని చైనా తీవ్రంగా తప్పుబట్టింది. తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల్ని దెబ్బతీస్తామని బెదిరిస్తే... బెదిరిపోమని, చూస్తూ ఊరుకోమని చైనా వాణిజ్య శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల్ని, ఇరు దేశాల సంబంధాల్ని గౌరవిం చటంలో వాషింగ్టన్ నాయకత్వం విఫలమైందని, వాణిజ్యంలో చైనా తన చట్టపరమైన హక్కుల్ని కాపాడుకోవటం కోసం తీసుకోవాల్సిన చర్యలన్నీ తీసుకుంటుందని 'జిన్హువా' వార్తా సంస్థ పేర్కొన్నది. దీనివల్ల అమెరికా ప్రయోజనాలు నెరవేరకపోగా, ఇరు దేశాల సంబంధాలు విషపూరితమవుతాయని 'చైనా డెయిలీ' హెచ్చరించింది. ఉ.కొరియా వివాదాన్ని రాజకీయంగా పరిష్కరించుకోలేక, వాణిజ్య సంబంధాలతో ఆర్థికంగా దెబ్బతీయటం ద్వారా చైనాను దారిలోకి తెచ్చుకోవాలని అమెరికా చేసిన ప్రయత్నంగా ఆ పత్రిక విశ్లేషించింది.



వజ్రం కోసం..
ఇంటర్‌పోల్ వేట

- రూ.250 కోట్ల విలువైన వజ్రం చోరీ
- ఒకరిపైమరొకరు కేసులు పెట్టుకున్న వ్యాపారస్తులు

జోహన్నెస్‌బర్గ్: ఒక్క వజ్రం ఆచూకీ ప్రపంచదేశాల పోలీసులకు సవాల్‌గా మారింది. ఫ్రాన్స్, లెబనాన్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, దుబాయ్, రష్యా ఇలా పలు దేశాల పోలీసులు చోరీకి గురైన రూ.250 కోట్ల విలువైన పింక్ వజ్రాన్ని కనిపెట్టేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. నిందితులు పెద్ద స్థాయికి చెందిన వ్యాపారస్తులు కావడం, వారు ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకుంటుండటం కేసు దర్యాప్తును మరింత క్లిష్టతరం చేస్తోంది.

తాజాగా ఈ కేసులో నలుగురు భారతీయ ఆఫ్రికన్లు జునైద్ మోతీ, అబ్బాస్ అబూబకర్ మోతీ, అష్రఫ్ కాకా, సలీం బొబాట్‌లకు ఇంటర్‌పోల్ రెడ్ నోటీసులు జారీ చేసింది(ఇంటర్‌పోల్ రెడ్ నోటీసులు జారీ చేస్తే ఆ వ్యక్తిని ప్రపంచంలో ఎక్కడున్నా అరెస్టు చేసి తరలిస్తారు). దీంతో వారు నోటీసులను నిలిపివేయాలంటూ ప్రిటోరియా హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే వీరు ఫ్రాన్స్, లెబనాన్, జింబాబ్వే, దుబాయ్ కోర్టుల్లో వజ్రానికి సంబంధించి విచారణను ఎదుర్కొంటున్నారు.

ఏం జరిగింది..

కొన్నేళ్ల క్రితం రష్యాకు చెందిన టెలికమ్యూనికేషన్ టైకూన్, వజ్రాల వ్యాపారితో పింక్ డైమండ్‌ను రూ.250 కోట్లకు అమ్మడానికి నలుగురు భారతీయ ఆఫ్రికన్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం ముగిసే సమయంలో ఇరువురూ ఒకరిపై మరొకరు ఆరోపణలకు దిగారు. వజ్రం తమ దగ్గరలేదంటే తన దగ్గరలేదంటూ ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. అది చాలక కోర్టుల్లో ఒకరిపై మరొకరు దొంగతనం కేసులు వేసుకున్నారు.

తమతో పాటు బిజినెస్ నడిపిన మాజీ భాగస్వామి అలిబెక్ ఇస్సేవ్ అనే వ్యక్తిపై నలుగురు భారత ఆఫ్రికన్లు ఆరోపణలు చేశారు. ప్రిటోరియా కోర్టులో ఈ మేరకు వాంగ్మూలం ఇచ్చారు. ఇస్సేవే అసలు దోషి అని, అతనే వజ్రాన్ని అపహరించాడని చెప్పారు. తమపై ఇంటర్‌పోల్ జారీ చేసిన రెడ్ నోటీసుపై స్టే ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు.

ట్రంప్‌నకు తాలిబాన్ బహిరంగ లేఖ



కాబూల్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ముస్లిం తీవ్రవాద సంస్థ తాలిబాన్ బహిరంగ లేఖ రాసింది. అఫ్ఘనిస్తాన్‌లో తిష్టవేసిన అమెరికా బలగాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరింది. గత పదహారేండ్లుగా అమెరికా బలగాలు అఫ్ఘనిస్తాన్‌లో కార్యకలాపాలు నిర్వ హిస్తున్నాయి. ఇంగ్లీషులో 1600 పదాలతో సుదీర్ఘంగా రాసిన ఆ లేఖను మంగళవారం తాలిబాన్ నాయకత్వం పత్రికలకు విడుదల చేసింది. గత అమెరికా అధ్యక్షులు అఫ్ఘనిస్తాన్ విషయంలో చేసిన పొరపాట్లను, తీసు కున్న నిర్ణయాలను పునస్సమీక్షిస్తామనటం ద్వారా తప్పిదాలను అంగీకరించినట్టయిందని తాలిబాన్ అధికార ప్రతినిధి జబీబుల్లా ముజాహిద్ ఆ లేఖలో పేర్కొన్నారు.

అఫ్ఘనిస్తాన్‌లోని బలగాల ఉపసంహరింపు విషయంలో ట్రంప్ ఏకపక్షంగా వ్యవహరించలేనప్పటికీ బలగాల పెంపు నిర్ణయాన్ని వాయిదా వేసుకోవటమో లేక ఉపసంహరించడమో చేయాలని కోరారు. బలగాలను వెనక్కి రప్పించుకోవటం ద్వారా అమెరికా దళాలకు జరిగే హాని నుంచి రక్షించుకోవాలని సూచించారు.

నేపాల్ వరదలు :115కు పెరిగిన మృతుల సంఖ్య

ఖాట్మండూ : నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలకు మరణించిన వారి సంఖ్య 115కు చేరిందని అధికారులు తెలిపారు. ఇప్పటికీ మరొక 40 మంది ఆచూకీ తెలియడం లేదని వారన్నారు. సుమారు ఆరు లక్షలమంది నిరాశ్రయులయ్యారని వారు చెప్పారు. నిరాశ్రయులైన వారి కోసం తాత్కాలిక ఆశ్రయాలు ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టినట్టు వారు తెలిపారు.



వెనక్కి తగ్గం

వచ్చే నెలలో ఐదో విడత స్ఫూర్తి యాత్ర

- అక్టోబర్‌లో భారీ బహిరంగసభ : టీజేఏసీ స్టీరింగ్ కమిటీ నిర్ణయాలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజాసమస్యల పరిష్కారం కోసం తాము చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు కల్పించినా వెనక్కి తగ్గేది లేదని టీజేఏసీ ప్రకటించింది. మంగళవారం నాంపల్లిలోని టీజేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఇటీవల గజ్వేల్, నిజామాబాద్ ప్రాంతాల్లో అమరుల స్ఫూర్తి యాత్ర, ఉద్యమాలపై సర్కారు వ్యవహరిస్తున్న తీరు, నేరెళ్ల ఘటన తదితర అంశాలపై చర్చించింది. నాలుగో విడత స్ఫూర్తియాత్రను నిలిపివేయడానికి సర్కారు చేసిన ప్రయత్నాలపై చర్చించింది. యాత్ర జరగకుండా సర్కారు అడ్డుకున్నా...టీజేఏసీగా మనం చెప్పదలుచుకున్న అంశాలను ప్రజలకు చెప్పగలిగామన్న అభిప్రాయపడ్డారు. యాత్రపై సర్కారు అనుసరించిన వైఖరిని తప్పుపట్టారు. విమర్శలు భరించలేని స్థితిలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారని, ప్రజా ఉద్యమాలపై అణిచివేస్తోందని అయినప్పటికీ వెనక్కితగ్గే ప్రసక్తే లేదని తీర్మానించారు. యాత్రకు సర్కారు అడ్డంకులు సృష్టించినప్పటికి నిర్వహించిన అమరుల స్ఫూర్తియాత్రను ప్రజలు ఆదరించారని భావించారు. ప్రజలిచ్చిన స్ఫూర్తితో వచ్చే నెలలో ఐదో విడత స్ఫూర్తియాత్ర నిర్వహించాలని, ఈ యాత్ర ఆదిలాబాద్ జిల్లాల్లో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. నిరుద్యోగ సమస్యపై అక్టోబర్ నెలలో హైదరాబాద్‌లో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. టీజేఏసీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని, ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోనున్నారు.

ధర్నాచౌక్‌పై ఢిల్లీలో ఆందోళన: కోదండరామ్

ధర్నాచౌక్ పరిరక్షణ కోసం ఈ నెల 21న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్ వెల్లడించారు. స్టీరింగ్ కమిటీ సమావేశం ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యపై మరింత ఒత్తిడి పెంచుతామన్నారు. స్ఫూర్తి యాత్రలో భాగంగా టీజేఏసీ శ్రేణులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం అణిచివేస్తోందన్నారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ పర్యటన సందంర్భంగా విధించిన ఆంక్షలను ఆయన గుర్తుచేశారు. సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి కూడా ఈ సర్కారు అనుమతించడం లేదన్నారు. నిజామాబాద్ జిల్లాలో స్ఫూర్తి యాత్ర అడ్డుకున్నందున అక్కడి టౌన్‌హాలులో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యమాలపై సర్కారు అనుసరిస్తున్న కక్షపూరితమైన వైఖరిని విడనాడాలని కోదండరామ్ పలికారు.

కిలిమంజారో పర్వతారోహణ విద్యార్థికి
టీఎస్‌ఎఫ్ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రపంచంలో ఎత్తైన శిఖరాల్లో ఒకటైన కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించిన గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి నైని మల్లేశ్‌కు ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్(టీఎస్‌ఎఫ్) రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యార్థుల ప్రతిభను మరింతగా ప్రోత్సహించాలంటే రాష్ట్రంలోని గురుకులాలు, పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

కొత్తగూడెంలో
నేడు విజయ్‌కుమార్ అంత్యక్రియలు

- సందర్శించిన పలువురు ప్రముఖులు
- కోలుకుంటున్న డాక్టర్ ఝాన్సీ



నివాళులర్పిస్తున్న సీపీఐఎం నేతలు

నవతెలంగాణ-కొత్తగూడెం

నల్గొండ జిల్లా కట్టంగూర్ మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్ మద్దికాయల విజయ్ కుమార్, ఆయన అత్త దాసరాజు సావిత్రిబాయి మృతదేహాలను మంగళవారం భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని వారి స్వగృహానికి తీసుకొచ్చారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే, ఎంసీపీఐ నేత ఓంకార్ కుమారుడు కావడంతో రాజకీయ నాయకులు, డాక్టర్లు, పట్టణ ప్రముఖులు సోమవారం రాత్రి నుంచే వారి ఇంటివద్దకు చేరుకున్నారు. సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి వారి మృతదేహాలను గూడెం తీసుకొచ్చారు. మాజీమంత్రి వనమా వెంకటేశ్వర రావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కాసాని ఐలయ్య, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్‌జిల్లా నాయకులు ఎడవల్లి కృష్ణ, పట్టణ వైద్యులు, పలు రాజకీయ పార్టీల నాయకులు విజయ్‌కుమార్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ విజయ్‌కుమార్ అకాల మరణం తీరని వేదనను మిగిల్చిందన్నారు. అతని తండ్రి ఓంకార్ కమ్యూనిస్టు పార్టీ నుంచి ఐదు సార్లు శాసనసభ్యులుగా గెలిచి నిజాయితీగా సేవలందిం చారని, ఆయన బాటలోనే ప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో విజయ్‌కుమార్ డాక్టర్ వృత్తిని ఎంచుకున్నారని తెలిపారు. విజయ్ కుమార్ స్థానిక ఏరియా ఆస్పత్రిలో మత్తు డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య, నాయకులు అన్నవరపు సత్యనారాయణ, భూక్యా రమేష్, జునుమాల నగేష్, తాటిపర్తి అనీల్, పద్మ, అంజి, సీపీఐ నుంచి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, పట్టణ కార్యదర్శి వై.శ్రీనివాసరెడ్డి, వంగా వెంకట్, బెజవాడ సత్యనారాయణ, ఉపేందర్, మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు సతీమణి పద్మావతి, నాయకులు శ్రీధర్ తదితరులున్నారు.

కోలుకుంటున్న డాక్టర్ ఝాన్సీ..

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న డాక్టర్ ఝాన్సీ లక్ష్మీ హైదరాబా ద్‌లోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఝాన్సీ, గాయాలపాలైన శోభలు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్టు కుటుంబీకులు చెప్పారు.

నేడు అంత్యక్రియలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్ మద్ది కాయల విజయ్‌కుమార్, దాసరాజు సావిత్రి బాయి అంత్యక్రియలు బుధ వారం కొత్తగూడెంలో నిర్వహిం చనున్నారు. సోమవారం జరిగిన ప్రమాదం అనం తరం వారి మృతదేహాలకు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. విజయ్ కుమార్ బంధువులు ఇతర దేశాల నుంచి రావాల్సి ఉండడంతో వారి అంత్యక్రియలు బుధవారం నిర్వహించేందు కు ఏర్పాట్లు చేసినట్టు కుటుంబీకులు తెలిపారు.

బోరుబావిలో పడ్డ చిన్నారి

ఏపీలోని వినుకొండ మండలంలో ఘటన

- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు
- రంగంలోకి దిగిన ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు



వినుకొండ: ఇటీవల తెలంగాణ బోరుబావిలో ఓ చిన్నారి ఘటన మరువక ముందే..తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో ఓ బాలుడు బోరుబావిలో పడిన ఘటన కలకలం రేపింది. తల్లితోకలిసి ఈసాయంత్రం పశువుల కొట్టాం వద్దకు వెళ్లిన బాలుడు చంద్రశేఖర్ (2) అక్కడే ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిపోయాడు. నీరు పడకపోవడంతో ఎలాంటి రక్షణ చర్యలు పాటించకుండా ఆ బోరును అలాగే ఉంచేయడంతో ఈ ఘోరం చోటుచేసుకున్నది. బాలుడ్ని సురక్షితంగా బయటకు తీసేందుకు కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో అధికారులు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. బోరుబావికి సమాంతరంగా పొక్లెయిన్‌తో సమాంతరంగా గొయ్యి తవ్వుతున్నారు. బాలుడు 15అడుగుల లోతులో ఉన్నట్టు స్థానికులు అంచనా వేస్తున్నారు. ఘటనా స్థలంలో అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. బావిలో చిక్కుకుపోయిన చిన్నారికి పైపు ద్వారా ఆక్సిజన్‌ను అందిస్తున్నారు. గుంటూరు రూరల్ ఎస్పీ అప్పల నాయుడు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పరిసర గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకొని సహాయక చర్యల్లో భాగస్వాములవుతున్నారు. రాత్రి కావస్తుండటంతో సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ చిన్నారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. చిన్నారిని సురక్షితంగా తీసుకొస్తామని ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు చెబుతున్నారు.

రంగంలోకి దిగిన ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు..

ఈ ఘటనపై సమాచారం అందుకున్న కలెక్టర్ కోన శశిధర్ అన్ని శాఖల్ని అప్రమత్తం చేశారు. ఆయన కూడా ఘటనాస్థలికి చేరుకున్నారు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించి సహాయక చర్యలు చేపట్టారు. చిన్నారి పడిన ఘటనపై ఏపీ హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆరా తీశారు. బాలుడిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘనంగా టీజీజీడీఏ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్ ఘనంగా జరిపింది. కోఠిలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిశంకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రావడానికి కారకులైన మహనీయుల త్యాగాలను మరువద్దని, వారి ఆశయ సాధనకు ప్రతిఒక్కరు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ వీరేషం, అధ్యక్షులు డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డాక్టర్లు లింగంగౌడ్, యకేందర్‌రెడ్డి, శ్రీధర్, శ్రీధర్‌రావు, మైపాల్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో తెలంగాణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏ ఆశయం కోసం మహనుభావులు స్వాతంత్ర్యం కోసం పోరాడారో ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా రాష్ట్రం పురోగమిస్తున్నదని ఆర్‌డబ్ల్యూఎం అండ్‌ఎస్ ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్, పంచాయతీరాజ్ కార్యాలయంలో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సత్యనారాయణరెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ ప్రాజెక్టు డైరెక్టర్ రాములునాయక్, మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్లు జగన్మోహన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ ప్రకాశ్, కన్సల్టెంట్లు నర్సింగరావు, రిటైర్డ్ ఈఎన్‌సీ కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

- సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోని క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉండబోతుందని సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎల్‌బీ స్టేడియంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వం, సాట్స్ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కూడా హర్యానా, కేరళ, పంజాబ్ రాష్ట్రాలతో పోటీపడి విజయాలు సాధించే ప్రతిభ, నైపుణ్య క్రీడాకారులకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సాట్స్ ఎండీ దినకర్‌బాబు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో న్యాయవాదుల కీలకపాత్ర

నవతెలంగాణ-హైదరాబాద్

దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో న్యాయవాదుల పాత్ర కూడా కీలకమని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్ కొనియాడారు. ఎంతోమంది న్యాయవాదులు కూడా ప్రాణాలను సైతం పణంగా పెట్టి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, అలాంటి మహనీయుల వల్లే మనమంతా స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామని ఆయన 71వ స్వాతంత్ర్య వేడుకల్లో చెప్పారు. మంగళవారం హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన ప్రసంగించారు. భారతదేశం లౌకికత్వానికి పెద్దపీట వేయడంలో ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ కీర్తి ఎన్నటికీ మరవలేమన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక 552 సంస్థానాల విలీనంలో పటేల్ పోషించిన పాత్ర దేశం ఎన్నటికీ మరిచిపోదన్నారు. తెర వెనుక రాష్ట్రాల మంత్రిత్వశాఖ కార్యదర్శి వీపీ మీనన్ కృషి ఉందని రమేష్ రంగనాథన్ అన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు, హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, ఏజీలు పాల్గొన్నారు.

నవచిత్రం



చెప్పిన టైమ్‌కే వస్తాం..



ఎన్టీఆర్ హీరోగా బాబీ దర్శకత్వంలో నటిస్తున్న 'జై లవకుశ' చిత్రం వాయిదా పడిందని వచ్చిన వార్తలను చిత్ర బృందం ఖండించింది. ఈ సెప్టెంబర్ 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు చిత్ర బృందం సినిమా ప్రారంభంలోనే ప్రకటించింది. కొన్ని కారణాల వల్ల సినిమా తేదీ వాయిదా పడిందని ఇటీవల వార్తలొచ్చాయి. దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ స్పందించి సినిమా వాయిదాపై వచ్చిన వార్తలన్నీ కేవలం పుకార్లే అని పేర్కొంది. అనుకున్న తేదీ సెప్టెంబర్ 21నే సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని చెప్పారు. ఇప్పటికే 'జై' పాత్ర 'లవ' పాత్రలకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, టీజర్లు అందరినీ అలరిస్తున్నాయి. ఇందులో జై, లవ, కుశ అనే మూడు పాత్రల్లో ఎన్టీఆర్ కనిపించనున్నారు. ఎన్టీఆర్ సరసన రాశీఖన్నా, నివేదా థామస్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్ రామ్ నిర్మిస్తున్న విషయం విదితమే. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు.

అప్పుడు ఛాలెంజ్ ఇప్పుడు లండన్‌బాబులు



తమ్మారెడ్డి భరద్వాజ, చిన్నికృష్ణ, హరీష్‌శంకర్, మారుతి, స్వాతి, రక్షిత్, ఏవీఎస్ ప్రకాష్

రక్షిత్, స్వాతి జంటగా చిన్నికృష్ణ దర్శకత్వంలో ఏవీఎస్ స్టూడియో సమర్పణలో మారుతి టాకీస్ పతాకంపై మారుతి నిర్మిస్తున్న చిత్రం 'లండన్‌బాబులు'. కె సంగీతం అందించిన ఈ చిత్రంలోని మొదటి పాటను స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విడుదల చేశారు. అతిథిగా విచ్చేసిన దర్శకుడు హరీష్ శంకర్ తొలిపాటను రిలీజ్ చేశారు. తమ్మారెడ్డి భరద్వాజ స్పెషల్ టీజర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ, 'జీవితాన్ని సినిమా పెద్దగా చూపిస్తే, టీవీ చిన్నగా చూపిస్తుంది. కానీ జీవితాన్ని జీవితంగా చూపించేది మాత్రం నాటకమే. నేను నాటకాల్లో పనిచేసిన రోజులను గుర్తు చేసిన దర్శకుడు చిన్నికృష్ణకు ధన్యవాదాలు. సినిమా కథ బాగుంటేనే స్వాతి నటించేందుకు ఒప్పుకుంటుంది. ఆమె అంగీకరించిన ఈ చిత్రం కచ్చితంగా బాగున్నట్టే లెక్క. నిర్మాతగా మారుతి నాకు స్ఫూర్తి. హీరో రక్షిత్ కొత్తవాడైనా అనుభవం ఉన్న నటుడిలా నటించాడు. ఇందులో ఆయన పేరు గాంధీ. గాంధీ పేరు చెబితే నాకు చిరంజీవి నటించిన 'ఛాలెంజ్' సినిమా గుర్తుకొస్తుంది. ముమ్ముందు గాంధీ పేరు చెబితే 'లండన్‌బాబులు' సినిమా గుర్తుకు రావాలి' అని అన్నారు. 'తెలుగు పరిశ్రమలోకి కొత్త నటీనటులు రావాల్సిన అవసరం ఉంది. అలాగే ఇలాంటి సినిమాలు ఆడితే ముమ్ముందు కొత్త తరహా చిత్రాలు రావడానికి మంచి స్కోప్ ఉంటుంది. ఈ చిత్ర పాటలు, టీజర్ కొత్తగా ఆకట్టుకునేలా ఉంది' అని తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. నిర్మాత మారుతి చెబుతూ, 'చిన్నికృష్ణ అండ్ టీమ్ జెన్యూన్‌గా ఈ చిత్రానికి పని చేస్తే, ఈ సినిమా అంతే జెన్యూన్‌గా ఫీలై ఈ చిత్రానికి నిర్మాతగా మారాను. చిన్నికృష్ణ, శ్యామ్‌కె నాయుడు సినిమా కోసం చాలా కష్టపడ్డారు. కె ఇచ్చిన మ్యూజిక్ సూపర్‌గా ఉంది. వచ్చే నెల ఫస్ట్ వీక్‌లో సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు. 'నాకు ముందు వినాయకుడిలా వి.వి.వినాయక్, వెనకాల ఆంజనేయుడిలా మారుతి ఉన్నారు. మారుతి నాకు కావాల్సినవన్నీ సమకూర్చారు. మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందించాం. మంచి వినోదాత్మక చిత్రమిది. లండన్ వెళ్ళాలనుకున్న కుర్రాడి కథ ఎలాంటి మలుపులు తిరిగిందనేది సినిమా. ఆదరించాలని కోరుకుంటున్నా' అని దర్శకుడు చిన్నికృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వాతి, ఏవీఎస్ ప్రకాష్, కార్టూనిస్టు మాలిక్ పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

సాఫ్ట్‌గా ఉన్నా భయపెట్టే షాలిని..



'షాలిని' చిత్ర ఆడియో ప్లాటినమ్ డిస్క్ వేడుక దృశ్యం

ఆమోగ్ దేశపతి, అర్చన, శ్రేయావ్యాస్ హీరో,హీరోయిన్లుగా షెరాజ్ దర్శకత్వంలో సాయివెంకట్ సమర్పణలో పి.వి.సత్యనారాయణ నిర్మించిన చిత్రం 'షాలిని'. ఇటీవల విడుదలైన పాటలకు శ్రోతల నుంచి మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో ప్లాటినమ్ డిస్క్ వేడుక నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన ప్రతాని రామకృష్ణగౌడ్, నటి కవిత చిత్ర యూనిట్‌కు షీల్డ్స్ అందించారు.

ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ, 'సినిమా మేకింగ్ చాలా బాగుంది. చిన్న సినిమా అయినా పెద్ద చిత్రంలా కనిపిస్తుంది. సినిమా విజయం సాధించి సాయివెంకట్‌కి, నిర్మాత సత్యనారాయణకు మంచి లాభాలు తీసుకురావాలి. నా తరపున మెయిన్ సెంటర్లలో థియేటర్లు ఇప్పిస్తాను' అని అన్నారు. 'షెరాజ్‌ను అభినందిస్తున్నాను. మంచి కథతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. న్యూ జనరేషన్‌కి మా సపోర్ట్ ఉంటుంది. పాటలు విన్నా. చాలా బాగున్నాయి. సంగీత దర్శకుడు నవనీత్‌కు మంచి భవిష్యత్ ఉంది' అని నటి కవిత తెలిపారు. సాయి వెంకట్ మాట్లాడుతూ, 'సినిమా టైటిల్ ఆకట్టుకునేలా ఉంది. సినిమాలో హర్రర్ ఎక్కువగా ఉండటంతో సెన్సార్ సభ్యులు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చారు. రీజినల్‌కు వెళితే అక్కడ జీవిత రాజశేఖర్‌గారు సహకారం అందించారు. శివరంజని మ్యూజిక్ ద్వారా విడుదలైన పాటలకు లక్షల వ్యూస్ వచ్చాయి. టైటిల్ సాఫ్ట్‌గా ఉన్నా సినిమా మాత్రం భయపెడుతుంది' అని చెప్పారు. 'హర్రర్ థ్రిల్లర్, లవ్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రమిది. హర్రర్ ఇష్టపడే వారికి కచ్చితంగా నచ్చే చిత్రమవుతుంది. డిఫరెంట్ మూవీ ప్రతి క్షణం ఉత్కంఠ కలిగిస్తుంది' అని దర్శకుడు షెరాజ్ తెలిపారు. 'సెప్టెంబర్ 1న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని నిర్మాత సత్యనారాయణ చెప్పారు.

తలాక్ నేపథ్యంలో హలాల్

ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన త్రిపుల్ తలాక్ అంశం నేపథ్యంలో 'హలాల్' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. హిందీలో రూపొందుతున్న ఈ చిత్రానికి శివాజీ లోతన్ పాటిల్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్ విడుదలైంది. దంపతుల మధ్య గొడవ చోటు చేసుకోవడంతో భర్త త్రిపుల్ తలాక్ ఇవ్వడం, ఆ తర్వాత భార్య న్యాయం కోసం స్థానిక పంచాయితీ అధికారులను కలవడం.. 'ప్రభుత్వం మారుతుంది కానీ ఇస్లామ్‌లో ఎలాంటి మార్పు రాదు' అంటూ త్రిపుల్ తలాక్ విధానాన్ని అంతమొందించాలంటూ రాసున్న ప్లకార్డులు ప్రధానంగా ఈ టీజర్ సాగుతుంది. చిన్మయి దీపక్, ప్రియదర్శన్ జాదవ్, ప్రీతమ్ కగ్నే ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 29న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే గతేడాది పుణె అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్, ఔరంగాబాద్ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ చిత్రం ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలతోపాటు ఆరు అవార్డులను దక్కించుకోవడం విశేషం.



ఆ హీరోలందరికీ సెల్యూట్..

దేశవ్యాప్తంగా 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఇలా ప్రతి ఒక్కరూ సామాన్య ప్రజానీకంతో మమేకమై స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని దేశభక్తి చాటారు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా సినీ లోకం ట్విట్టర్ ద్వారా స్పందించి యువతకు సందేశంతోపాటు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేయటం విశేషం.

అమితాబ్ బచ్చన్: జైహింద్! స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

నాగార్జున: నా స్నేహితులందరికీ ఇండిపెండెన్స్ డే శుభాకాంక్షలు.

పవన్ కళ్యాణ్: సాంఘిక అసమానతలు సమసిపోయి. పేదరికం పేదగా మిగిలినప్పుడు మాత్రమే స్వాతంత్ర్యానికి అర్థం. పరమార్థం. అటువంటి రోజు కోసం భారత జాతి అంత కలిసికట్టుగా కృషి చేయాలని కోరుకుంటూ 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వేచ్ఛా భారతికి నీరాజనాలు.

మహేష్‌బాబు: స్వేచ్ఛ వెలకట్టలేనిది. దాన్ని గౌరవిద్దాం. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

ఎన్టీఆర్: హ్యాపీ ఇండిపెండెన్స్ డే.

రామ్‌చరణ్: మన జాతీయ జెండా మరింత పైకి ఎగరాలి.

రామ్: తిప్పరా మీసం.. భారతదేశం.. గర్వించాల్సిన క్షణం.

తమన్నా: ఈ రోజు స్వాతంత్ర్య దినోత్సవం. ఈ సందర్భంగా మన దేశానికి సెల్యూట్ చేద్దాం.

కళ్యాణ్‌రామ్: స్వేచ్ఛ మన హక్కు. ఈ హక్కుని మనకు కల్పించిన స్వాతంత్ర్య సమరయోధులకు సెల్యూట్ చేద్దాం.

అక్షయ్ కుమార్: మనం ఈ రోజు సంతోషంగా ఉండటం కోసం మన సైనికులు వారి రేపటి జీవితాన్ని త్యాగం చేశారు. ఇప్పటి వరకు చాలా చేశాం. ఇంకా చాలా చేయాల్సి ఉంది.

సుమంత్: మనకు 70ఏండ్ల స్వేచ్ఛ కల్పించిన హీరోలందరికీ సెల్యూట్.

మంచులక్ష్మి: మనకి రోజూ స్వాతంత్ర్య దినోత్సవమే. మీలో ఉన్న దేశభక్తిని ఎప్పటికీ తొలగిపోనివ్వకండి.

సస్పెన్స్‌కు తెరపడింది..





'సాహో' చిత్రంలో ప్రభాస్ సరసన నటించే కథానాయిక ఎవరన్న సస్పెన్స్‌కు తెరపడింది. ఇప్పటి వరకు చాలా మంది బాలీవుడ్, టాలీవుడ్ కథానాయికల పేర్లు వినిపించినప్పటికీ తాజాగా బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్‌ను ఫైనల్ చేసినట్టు చిత్ర బృందం వెల్లడించింది. 'బాహుబలి2' తర్వాత సుజిత్ దర్శకత్వంలో 'సాహో' చిత్రంలో ప్రభాస్ నటిస్తున్నారు. యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్ సరసన శ్రద్ధా కపూర్‌ను ఎంపిక చేసిన సందర్భంగా చిత్రబృందం చెబుతూ, 'ప్రభాస్ హీరోగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్‌ను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. 'ఆషిఖీ 2' చిత్రంతో అందరి మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకుని, పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన శ్రద్ధాను ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నాం. హై టెక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రూపొందించబోతున్నాం. అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో మైమరపించే యాక్షన్ సన్నివేశాలను విదేశాల్లో చిత్రీకరిస్తున్నాం. బాలీవుడ్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్స్ త్రయం శంకర్, ఎహసాన్, లాయ్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. హిందీ లిరిక్స్‌ను అమితాబ్ భట్టాచార్య అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మధి, ఆర్ట్ డైరెక్టర్ సాబుసిరిల్ లాంటి టాప్ టెక్నీషియన్స్ ఈ చిత్రానికి వర్క్ చేస్తుండటం విశేషం. ప్రేక్షకుల, అభిమానుల అంచనాలను అందుకునేలా ఈ చిత్రం ఉంటుంది. ప్రభాస్ స్టయిలీష్‌గా, ఓ కొత్త ఎనర్జీతో ఈచిత్రంలో కనిపించబోతున్నారు' అని తెలిపింది.

భయపడలేదు..



'అజిత్‌తో నటించాలన్న కోరిక చాలా రోజులుగా ఉంది. త్వరలో ఆ ఛాన్స్ వస్తుందని ఆశిస్తున్నా' అని అంటోంది హీరోయిన్ అమలా పాల్. 'నాయక్', 'ఇద్దరమ్మాయిలతో', 'బెజవాడ', 'జెండాపై కపిరాజు' వంటి తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన అమలా ఆ తర్వాత ఎక్కువగా తమిళ, మలయాళ చిత్రాలపైనే దృష్టిపెట్టింది. ధనుష్‌తో కలిసి ఆమె నటించిన 'విఐపి 2' ఇటీవల తమిళనాట విడుదలై పాజిటివ్ టాక్ తెచ్చుకుంటోంది. ఈ సందర్భంగా అమలా పాల్ చెబుతూ, 'ఇందులో చాలా కష్టపడి నటించాను. హీరో ధనుష్ నాకు మంచి స్నేహితుడు. ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నా. చిన్నప్పుడే కాజోల్ నటన చూసి ఆమెను ఆదర్శంగా తీసుకున్నా. ఈ చిత్రంలో ఆమెతో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం కోసం దర్శకురాలు సౌందర్య తీవ్రంగా శ్రమించారు. ప్రతి చిన్న విషయంపైనా ఆమె చాలా శ్రద్ధ పెట్టారు. విజయ్, విక్రమ్ వంటి అగ్ర హీరోలతో నటించాను. అజిత్‌తో నటించే అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయాను. ఆయనతో నటించే అవకాశం మరోసారి వస్తుందని ఆశిస్తున్నా. జీవితంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నా, అయితే ఎప్పుడూ సమస్యలకు బెదిరిపోలేదు' అని తెలిపింది. అమలా ప్రస్తుతం 'థిరుట్టు పాయలె 2', 'భాస్కర్ ఓరు రాస్కల్', మలయాళ 'క్వీన్' రీమేక్‌లోనూ అలాగే మరో రెండు ఇతర భాషా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

భారతీయ సినిమాల్లోనే ప్రథమం



'ఆనందో బ్రహ్మ' ప్రీ రిలీజ్ వేడుక దృశ్యం

తాప్సీ, వెన్నెలకిషోర్, శ్రీనివాస్‌రెడ్డి, తాగుబోతు రమేష్, షకలక శంకర్ ప్రధాన పాత్రధారులుగా మహి వి.రాఘవ్ దర్శకత్వంలో 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఆనందో బ్రహ్మ'. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఫంక్షన్ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన హీరో ప్రభాస్ పాటల బిగ్ సీడీని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ, 'ఫస్ట్‌టైమ్ ఇండియన్ సినిమాలో ఓ దెయ్యం మనుషులకు బయపడటం అనే కాన్సెప్ట్‌తో సినిమా రావడం చాలా కొత్తగా ఉంది. దర్శకుడు మహి కాన్సెప్ట్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. తాప్సీ మోస్ట్ బ్యూటిఫుల్ దెయ్యంగా కనిపిస్తుంది. నిర్మాత విజయ్ ఎప్పుడు కలిసినా సినిమా గురించే మాట్లాడుతాడు. విజయ్, శశిలకు అభినందనలు. బెస్ట్ యాక్టర్స్ అందరూ ఇందులో నటించారు. ఈ సినిమా గురించి బయట మంచి టాక్ వింటున్నా. ఈ నెల 18న విడుదల కానున్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'నిర్మాత విజయ్‌కి నేను బాబాయ్‌ని అవుతాను. అతనికి సినిమా అంటే ప్యాషన్. ఓ రోజు ఫోన్ చేసి బ్యానర్ పెట్టాలనుకుంటున్నా, మిమ్మల్ని కలవాలి అన్నారు. ప్రొడక్షన్ గురించి చెప్పాడు. ఫిల్మ్ మేకింగ్ అనేది లెక్కలతో కాకుండా హృదయంతో చేయాల్సిన పని. అందరు చేయలేరు. నిర్మాణం డిఫరెంట్ లైన్ అని చెప్పా. నీకు వద్దు అని కూడా చెప్పా. కానీ పట్టుదలతో 'భలేమంచి రోజు' చిత్రాన్ని నిర్మించి నిర్మాతగా నిరూపించుకున్నాడు. ఈ సినిమా నిర్మించేటప్పుడు కూడా ఈ కథ చెప్పాడు. టీజర్ చూసి హ్యాపీగా ఫీలయ్యా. ట్రైలర్, ఇందులోని అన్ని క్యారెక్టర్స్‌ను చూశా.. కచ్చితంగా సినిమా సక్సెస్ కొడుతుందనిపించింది. విజయ్, శశి ఇలాంటి సక్సెస్‌లు వరుసగా సాధించి ప్రభాస్ వీరిని పిలిచి డేట్స్ ఇచ్చి సినిమా చేసే స్థాయికి ఎదగాలి' అని శ్యామ్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సుధీర్‌బాబు చెబుతూ, 'నేను, విజయ్ కాలేజ్ ఫ్రెండ్స్. విజయ్, శశి హర్రర్ కామెడీ చేస్తున్నారనగానే కొంచెం భయమేసింది. వారికి ఎలాంటి కథలను సెలక్ట్ చేసుకోవాలో బాగా తెలుసు. సినిమా అంతా పూర్తయిన తర్వాత విజయ్ నన్ను సినిమా చూడమని చెప్పారు. చూసిన తర్వాత 'ప్రేమ కథా చిత్రమ్' కంటే బావుందనిపించింది. ఈ సినిమా కథ ముందుగానే చెప్పి ఉంటే 'ప్రేమ కథా చిత్రమ్ 2'గా చేసేవాడిని' అని చెప్పారు. 'ఈ సినిమాలో నలుగురు హీరోలతో కలిసి చేశాను. సినిమా చాలా బాగా వచ్చింది. ఆదరించాలి' అని తాప్సీ చెప్పింది.

దర్శకుడు మహి చెబుతూ, 'మనిషి అనేవాడు శరీరం, ఆత్మ కలయిక. ఘోస్ట్ అనేది శరీరం లేని ఆత్మ. అందువల్ల ఘోస్ట్ ఎలా ఉంటుందో నాకే కాదు ఎవరికీ తెలియదని అనుకుంటాను. నాకు దెయ్యాలంటే నమ్మకం లేదు. తాప్సీ లేకుండా ఈ సినిమా కుదిరేది కాదు. విజయ్, శశిలకు థ్యాంక్స్' అని అన్నారు.

ముక్కోణ ప్రేమకథ..



అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'తారామణి'. ఇటీవల తమిళనాట విడుదలైన ఈ చిత్రం భారీ విజయాన్ని సాధించింది. తాజాగా అదే పేరుతో డి.వి.సినీ క్రియేషన్స్ పతాకంపై డి.వెంకటేష్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఆ విశేషాలను నిర్మాత వెంకటేష్ తెలియజేస్తూ, 'ముక్కోణపు ప్రేమ కథా చిత్రమిది. ఈ నెల 11న తమిళనాట విడుదలై బ్లాక్‌బస్టర్ టాక్ సొంతం చేసుకుని బాక్సాఫీసు వద్ద కలెక్షన్లు దుమ్ము రేపుతుంది. కాంటెంపరరీ పాయింట్‌తో దర్శకుడు రామ్ ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తెరకెక్కించాడు. ప్రారంభం నుంచి సినిమాపై భారీ అంచనాలున్నాయి. దీంతోపాటు ఈ చిత్ర ట్రైలర్‌ను కమల్ హాసన్, పాటలను రజనీకాంత్ విడుదల చేయడంతో ఆ అంచనాలు మరింతగా పెరిగాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా అందరి అంచనాలను మించి ట్రెమండస్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు తెలుగులో ఈచిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. వాటిని త్వరలోనే పూర్తి చేసి ఈ నెలాఖరున లేక సెప్టెంబర్ మొదటి వారంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాం. కొత్త తరహా చిత్రాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులను మెప్పించేలా ఈచిత్రం ఉంటుంది' అని అన్నారు.



వివేకం పాటలొచ్చాయ్

అజిత్ హీరోగా, కాజల్, అక్షర హాసన్ హీరోయిన్లుగా శివ దర్శకత్వంలో తమిళంలో రూపొందుతున్న చిత్రం 'వివేగం'. వివేక్ ఒబేరాయ్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంఠినేని 'వివేకం' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు శివ మాట్లాడుతూ, 'అజిత్‌తో నేను చేసిన హ్యాట్రిక్ చిత్రమిది. జేమ్స్‌బాండ్ సినిమాల్లా ఇది కూడా చాలా స్టయిలీష్‌గా ఉంటుంది. అలాగే అభిమానులు అజిత్‌ను ఎలా చూడాలనుకుంటున్నారో అలాంటి చిత్రమిది. అనిరుధ్ అద్భుతమైన మ్యూజిక్ అందించారు. సినిమాకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పెద్ద అసెట్ అవుతుంది' అని అన్నారు. 'భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని 'వివేకం' పేరుతో తెలుగులో విడుదల చేయడం ఆనందంగా ఉంది. మార్కెట్‌లోకి విడుదలైన పాటలకు మంచి స్పందన వస్తోంది. ఇటీవల రిలీజైన తెలుగు టీజర్‌కు సైతం ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. సినిమాను ఈ నెల 24న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం. స్టయిలీష్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కచ్చితంగా అందరిని అలరిస్తుంది' అని నిర్మాత నవీన్ తెలిపారు.

ఆద్యంతం ఉత్కంఠభరితం



లావణ్య త్రిపాఠి, సందీప్‌కిషన్

సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి జంటగా జాకీ ష్రాఫ్ ప్రధాన పాత్రధారిగా సి.వి.కుమార్ దర్శకత్వంలో తమిళంలో తెరకెక్కిన 'మాయవన్' చిత్రాన్ని 'ప్రాజెక్ట్ జెడ్'గా ఎస్.బి.కె.ఫిల్మ్స్ కార్పొరేషన్ పతాకంపై నిర్మాత ఎస్.కె.కరీమున్నీసా తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి సమర్పకుడు ఎస్.కె.బషీద్ మాట్లాడుతూ, 'ఆద్యంతం ఆసక్తి కలిగించే ఉత్కంఠతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి, జాకీ ష్రాఫ్‌ల నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సందీప్ కిషన్ నటన మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఇప్పటి వరకు కనిపించని విధంగా ఓ కొత్త తరహా పాత్రలో లావణ్య త్రిపాఠి నటించి మెప్పించింది. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెన్సార్ సభ్యుల పాజిటివ్ టాక్‌తోపాటు 'యు/ఎ' సర్టిఫికెట్ పొందింది. సెప్టెంబర్ ప్రథమార్థంలో సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, కెమెరా: గోపీ అమర్నాథ్, ఎడిటర్: లియో జాన్ పాల్.

యువతకు ఉద్యోగ భరోసా



గోల్కొండ కోటలో గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇప్పటి వరకు చేపట్టిన 27,660 నియామకాలతోపాటు, మరో 84,876 ఉద్యోగాల నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టబోతున్నామని సంతోషంగా ప్రకటిస్తున్నాను. దీంతో తెలంగాణలో ఆశించిన దానికంటే మిన్నగా 1,12,536 ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేస్తున్నది...' అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం గోల్కొండ కోటలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. వచ్చే ఏడాది ఏర్పడే ఖాళీలను భర్తీ చేయడానికి కూడా ఈ సంవత్సరమే నియామక ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. కొన్ని ప్రతీప శక్తులు తమ ప్రయత్నాలకు విఘాతం కలిగించేందుకు కుట్రలు పన్నుతున్నాయని చెప్పారు. ఆయా శక్తులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల ఆశీర్వాదంతో వాటన్నింటినీ ఛేదిస్తూ ముందడుగేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివద్ధి కోసం నిరంతరం పాటుపడే తమ ఏకాగ్రతను ఇలాంటి క్షుద్ర ప్రయత్నాలతో మరల్చలేరని అన్నారు.

2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వద్ధిరేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని సీఎం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న పారదర్శక విధానాల వల్ల, పటిష్టమైన ఆర్థిక క్రమశిక్షణ వల్లనే ఈ ఫలితం వచ్చిందని చెప్పారు. అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో తమ ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అభివద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాల మీద పరిపాలన సాగుతున్నదని చెప్పారు. సమానత్వం, సామాజిక న్యాయం అనే ఉదాత్త లక్ష్యాలను సాధించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. తెలంగాణలో 90 శాతం మంది ప్రజలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉన్నారు.. వారి సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని సీఎం చెప్పారు.

మిషన్ భగీరథలో భాగంగా వచ్చే డిసెంబర్ నాటికే అన్ని గ్రామాలకు శుద్ధి చేసిన నదీ జలాలు అందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన కేజీ టూ పీజీ ఉచిత విద్యా విధానంలో భాగంగా పెద్ద ఎత్తున గురుకుల పాఠశాలలను నెలకొల్పుతున్నామని వివరించారు. 58 ఏండ్ల చరిత్రలో గత ప్రభుత్వాలు అరకొర వసతులతో 259 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తే, కేవలం మూడేండ్ల వ్యవధిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం కార్పొరేట్ విద్యాసంస్థలకన్నా మెరుగైన వసతులతో కూడిన 522 గురుకుల పాఠశాలలను ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిందని చెప్పారు. తక్కువ వేతనాలతో, అర్థాకలితో అలమటిస్తున్న చిన్న తరగతి ఉద్యోగుల వేతనాలను ప్రభుత్వం సముచితంగా పెంచిందని గుర్తుచేశారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు శ్రమదోపిడీకి గురి కావద్దని ప్రభుత్వం భావిస్తుంటే.. కొన్ని ప్రతీప శక్తులు సంకుచితత్వంతో అడ్డుతగులుతున్నాయని విమర్శించారు. అయినా వెనుకడుగు వేయకుండా, పట్టుదలతో వ్యవహరించి వారి జీతభత్యాలను పెంచామని చెప్పారు. నదీ జలాల్లో మన రాష్ట్రవాటాను పూర్తిగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున ప్రాజెక్టులు నిర్మిస్తున్నదని చెప్పారు. తెలంగాణలో కోటికిపైగా ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా సంవత్సరానికి రూ.25 వేల కోట్ల నిధులు కేటాయిస్తూ నీటిపారుదల రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ఎత్తిపోతల పథకాల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నదని చెప్పారు.

ప్రభుత్వం ఇటీవలనే శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకానికి శ్రీకారం చుట్టిందని సీఎం ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఒత్తిడి వల్ల గోదావరి మీద నిర్మించిన ఏకైక ప్రాజెక్టు శ్రీరాంసాగర్ ప్రాజెక్టని తెలిపారు. దశాబ్దాలపాటు కొనసాగిన తీవ్ర నిర్లక్ష్యం, వివక్ష ఫలితంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలు శిథిలమయ్యాయని వివరించారు. చివరికి ఆ ప్రాజెక్టు ఉండీలేనట్టుగా తయారైందని అన్నారు.

రైతులు అనుభవిస్తున్న ఇతర కష్టాలను దూరం చేసేందుకు ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ సంస్కరణలను అమలు చేస్తున్నదని చెప్పారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతాంగానికి రూ.17 వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలను మాఫీ చేసిందన్నారు. గతంలో విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించకపోవడం వల్ల రైతాంగం ఎన్నో బాధలు పడ్డారు.. అయితే మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కొరత లేకుండా సకాలంలో ఎరువులు, విత్తనాలు అందిస్తున్నదని తెలిపారు. కల్తీ విత్తనాలతో రైతాంగం నష్టపోకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నదని చెప్పారు. కల్తీలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు చట్టాలలో మార్పులు తెచ్చామన్నారు. రైతులను సంఘటిత పరచి వారి ప్రయోజనాలను వారే రక్షించుకునే విధంగా రైతుసంఘాలను, సమాఖ్యలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు.

భూ సర్వేతో కొత్త చరిత్ర...

సమగ్ర భూ సర్వేతో తెలంగాణ రాష్ట్రం కొత్త చరిత్రను సష్టించబోతున్నదని సీఎం తెలిపారు. నిజాం రాజుల అనంతరం దాదాపు 81 ఏండ్ల తర్వాత తెలంగాణ ప్రభుత్వం భూ సర్వేను నిర్వహిస్తున్నదని చెప్పారు. రాబోయే కొద్ది నెలల సమయంలోనే జరిగే ఈ భూ సర్వేను జయప్రదం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఎక్కడి రైతులు అక్కడే వారి వారి గ్రామాలకు కథానాయకులు కావాలని సూచించారు. సర్వే పూర్తయిన తర్వాత భూ రికార్డులన్నింటినీ సరి చేస్తామని చెప్పారు. రైతులకు కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. దీనివల్ల భూ సమస్యల పరిష్కారం కోసం రైతాంగం నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దూరమవుతుందని చెప్పారు. రైతు పండించిన పంటకు డిమాండ్ రావడం కోసం ప్రభుత్వం రాష్ట్రాన్ని పంటల కాలనీలుగా విభజిస్తుంది, దీని వల్ల రైతులంతా ఒకే పంట వేసి నష్టపోయే పరిస్థితి ఉత్పన్నం కాదు, పండిన పంటకు మార్కెటింగ్ సమస్య తలెత్తదని వివరించారు.

వస్త్రాలన్నీ చేనేత నుంచే...

చేనేత, పవర్ లూమ్ కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం సమగ్ర చేనేత విధానాన్ని రూపొందించి అమలుచేస్తున్నదని సీఎం తెలిపారు. చేనేత కార్మికులకు అవసరమైన నూలుతోపాటు అద్దకానికి అవసరమైన రసాయనాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నదని చెప్పారు. పవర్‌లూమ్‌లను ఆధునీకరించి ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. యాజమాన్యాలకు విద్యుత్ చార్జీల్లో రాయితీలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్మికులకు ప్రతీనెల రూ.15 వేలకు తగ్గకుండా వేతనం ఇచ్చేవిధంగా యాజమాన్యాలను ఒప్పించామని వివరించారు. ప్రభుత్వం తరపున జరిపే అన్ని శాఖల వస్త్రాల కొనుగోలు ఆర్డర్లను చేనేత, మరమగ్గాల సొసైటీలకే ఇచ్చేందుకు నిర్ణయించామని తెలిపారు. వచ్చే బతుకమ్మ పండుగ నుండి రాష్ట్రవ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన 93 లక్షల మంది మహిళలకు చీరలను పండుగ కానుకగా అందించే పథకం ప్రవేశ పెడుతున్నదని వివరించారు. ప్రతీ సంవత్సరం పండుగ సందర్భంగా కుల, మతాలకతీతంగా పేదలందరికీ పండుగ బట్టలు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెప్పారు.

ప్రపంచం దష్టిని ఆకట్టుకున్న తెలంగాణ.. ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సుకు వేదిక కావడం మనందరికీ గర్వకారణమని కేసీఆర్ తెలిపారు. నవంబర్ 28 నుంచి 30వ వరకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో జరిగే ప్రతిష్ఠాత్మక ప్రపంచ పారిశ్రామిక వేత్తల సదస్సుకు ప్రధాని నరేంద్రమోడీతోపాటు, అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె, అక్కడి ప్రభుత్వ సలహాదారు ఇవాంకా ట్రంప్ హాజరవుతున్నారని చెప్పారు.

సినిమాలో ఛాన్స్ ఇప్పిస్తామంటూ.. ఏపీలో లైంగికదాడి యత్నం



విజయవాడ: సినిమాలో హీరోయిన్‌గా అవకాశం ఇస్తామని చెప్పి ఏపీలోని విజయవాడ నుంచి భీమవరానికి కారులో తీసుకెళ్తూ తనపై లైంగికదాడి యత్నానికి పాల్పడ్డారని ఓ వర్ధమాన నటి పటమట పోలీసులను ఆశ్రయించింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం ఒకటి రెండు సినిమాల్లో నటించిన ఆ యువతిని భీమవరం వద్ద తీసే సినిమాలో హీరోయిన్‌గా తీసుకుంటామని చెప్పి సినీ దర్శకుడు చలపతి, హీరో సృజన్ కారులో తీసుకెళ్లారు. భీమవరం వెళుతుండగా కారులోనే ఆమెపై లైంగికదాడియత్నం జరగగా.. ఆమె వారిని ప్రతిఘటించింది. ఈ సమయంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురైంది. వెంటనే ఆమె వారి బారి నుండి తప్పించుకోగలిగింది. ఈ సంఘటన జరిగి రెండు రోజులైంది. తాను సురక్షితంగా బయటపడిన తరువాత పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆ యువతి తెలిపింది. పటమట పోలీస్ స్టేషన్ బయట ఆమె మీడియాతో మాట్లాడుతూ తనలాగా ఎవరూ అన్యాయానికి గురికాకూడనే పోలీసులను ఆశ్రయించినట్టు తెలిపింది. తనకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేసింది. ఇలాంటి మృగాళ్లను కఠినంగా శిక్షంచాలని కోరింది. తనపై దారుణంగా దాడి చేశారని పేర్కొంది. ఈ సంఘటనకు సంబంధించి డైరెక్టర్, కారు డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

దివ్య-భవ్య భారత్ వైపు అడుగులేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

రంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలపాలి' అని అన్నారు. దేశ ప్రజలు 'నడుస్తుంది..లే' అన్న ఉదాసీన వైఖరి వీడి 'మార్చగలం' అనే ఆలోచన అలవరుచుకోవాలన్నారు. దేశ అంతర్గత భద్రత తమకు ప్రాథమిక అంశమని పేర్కొన్న ప్రధాని... ఉగ్రవాదులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. భద్రత బలగాల సహకారంతో వామపక్ష తీవ్రవాద ప్రాంతాల్లో యువకులు పెద్దఎత్తున జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని చెప్పారు. సర్జికల్ దాడుల తరువాత ప్రపంచం భారత్ సత్తా తెలుసుకుందని చెప్పారు. పాకిస్తాన్ పేరును ప్రస్తావించకుండా... ఉగ్రవాద పోరులో భారతదేశం ఒంటరి కాదని, చాలా దేశాలు భుజం-భుజం కలిపి తమతో నడుస్తున్నాయని వివరించారు. నల్లధనంపై యుద్ధం కొనసాగిస్తున్నామన్న ప్రధానమంత్రి.. రూ.800 కోట్ల బినామీ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసిందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ఆధార్‌ను అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. వ్యవస్థలో పారదర్శకత తీసుకొచ్చేందుకు అన్ని చర్యలూ చేపడుతున్నట్టు వివరించారు.

దేశాభివృద్ధిలో రాష్ట్రాలు కీలక భూమిక పోషిస్తాయని ప్రధాని వివరించారు. ఈ విషయాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్రాలు నేడు ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని, కలిసికట్టుగా పని చేస్తున్నామని చెప్పారు. జీఎస్టీ, స్మార్ట్‌సిటీ, స్వచ్ఛ అభియాన్, వ్యాపారం సులభతరం ఇలా అన్ని విషయాల్లో రాష్ట్రాలతో భుజం-భుజం కలిపి నడవడంలో కేంద్రం సఫలీకృతమవుతోందని చెప్పారు. జీఎస్టీ ద్వారా సమాఖ్య వ్యవస్థకు, పోటీతత్వ సమాఖ్య వ్యవస్థకు నూతన బలాన్ని అందించామని తెలిపారు. ఇక అతి తక్కువ సమయంలో జీఎస్టీని అమలు చేసిన తీరు చూసి ప్రపంచం నివ్వరపోయిందని వివరించారు.

ప్రధానమంత్రి పంట బీమా యోజన రైతులకు సురక్షమైన కవచంలా మారిందని ప్రధాని చెప్పారు. ప్రధానమంత్రి సింఛాయి యోజన ద్వారా 99 ప్రాజెక్టులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులు వృథా కాకుండా ఫుడ్ ప్రాసెసింగ్‌లో ప్రపంచం దేశానికి తోడుగా నిలవాలని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెద్దఎత్తున స్వాగతించినట్టు తెలిపారు. త్రిపుల్ తలాఖ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహిళలకు మోడీ అభినందనలు తెలిపారు. ఈ పోరాటంలో బాధిత మహిళలకు అండగా ఉంటామని చెప్పారు. ఇందులో విజయం సాధిస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. నోట్లరద్దు నిర్ణయాన్ని సమర్థించుకున్న ప్రధానమంత్రి... దీనివల్ల మూడు లక్షల కోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చి చేరాయని తెలిపారు. ఇందులో రూ.1.75 లక్షల కోట్లు అనుమానిత డిపాజిట్లు కాగా.. రెండు లక్షల కోట్ల నల్లధనం ఉందని తెలిపారు. పైగా నోట్లరద్దు నిర్ణయం తరువాత బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయని తెలిపారు. పైగా ఈ సమయంలో సేకరించిన సమాచారం ఆధారంగా సుమారు 1.75 లక్షల నకిలీ కంపెనీల రిజిస్ట్రేషన్లను రద్దు చేసినట్టు తెలిపారు. 18 లక్షల మంది ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. ఇందులో 4.5 లక్షల మంది తమ తప్పును అంగీకరించారని వివరించరు. ఆసక్తికరంగా లక్ష మందికి ఆదాయపు పన్ను గురించి వినలేదని చెప్పారని విస్మయం వ్యక్తం చేశారు. గతేడాదితో పోల్చితే 34 లక్షల మందిని పన్ను పరి ధిలోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ యేడాది మోడీ ప్రసంగంలో కృష్ణుడిని, రాముడిని ఉటంకించారు. యూపీలోని గోరఖ్‌పూర్‌లో చిన్నారు ల మృతి చెందిన ఘటనతో పాటు అకాల వర్షాలు, వరదలను ప్రస్తావించారు.

వైద్య విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-ముధోల్

మత్తు ఇంజక్షన్ తీసుకుని వైద్య విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా ముధోల్‌లో మంగళవారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం... ముధోల్‌లోని మహాలక్ష్మీగల్లీకి చెందిన దప్కల్ సవిత(26) హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో పీజీ (అనస్తీషియా మొదటి సంవత్సరం) చదవుతున్నది. వరుస సెలవులు రావడంతో మూడ్రోజుల కింద ఇంటికి వచ్చింది. ఎప్పటిలాగే మంగళవారం ఇంట్లో గదిలో విశ్రాంతి తీసుకునేందుకు వెళ్లింది. కుటుంబ సభ్యులు పలకరించడానికి గదిలోకి వెళ్లగా అప్పటికే అపస్మారస్థితిలో కనిపించింది. హుటాహుటిన ప్రయివేటు వాహనంలో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఇదిలాఉండగా సవితకు ఇటీవలనే వివాహం నిశ్చయమైంది. ఆమె మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతిరాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రిన్సిపాల్‌పై దౌర్జన్యం

(మొదటిపేజీ తరువాయి)

మాతాకీ జై.. ప్రిన్సిపాల్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. అందరూ గుమిగూడటంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంతలోనే సర్పంచ్, సొసైటీ ఛైర్మెన్ కల్పించుకుని యువకులను సముదాయించారు. దీంతో పరిస్థితి అదుపులోకొచ్చింది. మహమ్మద్ యాకునుద్దీన్ ఆలిండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు కావడం గమనార్హం. అయితే స్థానిక నాయకులే ఉద్దేశపూర్వకంగా యువకులను రెచ్చగొట్టినట్టు, ఓ ముస్లిం వ్యక్తి జెండా ఎగురవేయడం జీర్ణించుకోలేకనే ఘటనకు పురమాయించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనపై ఎలాంటి కేసూ నమోదు కాలేదు.

సోషల్ మీడియాలో యువత ఆగ్రహం


ప్రిన్సిపాల్‌కు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ ముస్లిం యువకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం బయటకు పొక్కింది. దీంతో పలు కామెంట్లతో యువకులు ఖండించారు. పలువురు ముఖ్య నేతలు కూడా చెప్పులు ధరించి జెండా ఎగురవేసే ఫొటోలను పోస్ట్ చేశారు. ఢిల్లీలో యోగా చేస్తున్న సందర్భంగా జాతీయజెండాతో చెమటను తుడుచుకున్న ప్రధాని ఫొటోను షేర్ చేశారు. అల్లర్లు సృష్టించేందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో వారు డిమాండ్ చేశారు.

జుట్టుపట్టి ఈడ్చి తన్నాడు...

(మొదటిపేజీ తరువాయి)

ధనున్‌జయ్ కుమార్ ఆమెను చూశాడు. అతనిలో కోపం కట్టలు తెంచుకుంది. అంతే.. నడిరోడ్డుపై ఆమెను పట్టుకొని తీవ్రంగా కొట్టాడు. ఫోను లాక్కుని రోడ్డు మీదికి విసిరిపారేశాడు. నీ క్యారక్టర్ మంచిది కాదంటూ బిగ్గరగా అరిచాడు. రోడ్డు మీదున్న ప్రజలు షో చూస్తున్నట్టు చూస్తూ నిలబడిపోయారు. నలంద జిల్లా పర్వాల్పూర్ పోలీస్ స్టేషన్ సమీపంలోని 110వ జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ఊహించని పరిణామంతో దిగ్భ్రాంతికి గురై ఆమె విలపించింది. తనను విడిచిపెట్టాల్సిందిగా ఆ పోలీసు అధికారిని వేడుకున్నది. అయినా.. ధనుంజయ్ కోపం చల్లారలేదు. ఆమె చాలాసేపు అతడిని బతిమిలాడిన అనంతరం విడిచిపెట్టాడు. ఈ ఘటన అంతా సీసీ టీవీ ఫుటేజ్‌లో రికార్డు కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ధనంజయ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ఉన్నతాధికారులు ప్రకటించారు.

బ్లూ వేల్ లింకులను తొలగించండి



(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారు. (కేరళకు చెందిన మనోజ్(14) బ్లూవేల్ ఆటలో పాల్గొని గతనెల 26న ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకొచ్చింది). బ్లూవేల్ ఆటకు పిల్లలు బానిసలై ప్రాణాలు తీసుకుంటున్నారని, దీనికి సంబంధించి వెబ్‌సైట్లలో ఉన్న లింకులన్నింటినీ వెంటనే తొలగించాలని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

వేదికపై నుంచి దిగిపోండి

(మొదటిపేజీ తరువాయి)

చేసినందుకు ప్రజలకు సీఎం రఘుబీర్ దాస్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా పేరున్న వ్యక్తిని బీజేపీ నేతలు హేళన చేయడం సరికాదని గిరిజనుల హక్కుల నేత దయామణి బర్లా తెలిపారు. ఇది ప్రజాస్వామ్యాన్ని హరించడమేనని ఆయన చెప్పారు.

ఉద్యమ సమయంలో వెన్నంటి నడిచారు

- వారికి సేవలందించడం నా బాధ్యత:

హాజీల యాత్రలో ముఖ్యమంత్రి కేసీఆర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఉద్యమ సమయంలో ముస్లిం సోదరులు తన వెన్నంటి నడిచారు, మద్దతుగా నిలిచిన వారికి సేవ చేయడం నా బాధ్యత అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణ ప్రజల చీఫ్ సర్వెంట్‌ను కాబట్టి వారికి సేవలందిస్తున్నానని సీఎం చెప్పారు. నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో మంగళవారం హాజీల యాత్ర సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హజ్ యాత్రికుల బస్సును పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి అంటే ముఖ్య సేవకుడు అని అన్నారు. మైనారిటీ విద్యార్థులకు కార్పోరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై లక్షన్నర రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. ముస్లింల కోసం బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించామన్నారు. నిజాంరాజు అప్పట్లోనే అత్యంత ధనికుడని గుర్తు చేశారు. మక్కాలో నిజాం రాజు అప్పట్లోనే వసతి ఏర్పాటు చేశారన్నారు. నిజాం నిర్మించిన భవనానికి ఉమ్మడి రాష్ట్రంలో రంగులు కూడా వేయలేదన్నారు. దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 2014 నాటికి తెలంగాణ బడ్జెట్ రూ.5లక్షల కోట్లకు చేరుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచానికే ఆదర్శం కావాలని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్తశుద్ధితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకన్నామని, అదే విధంగా బంగారు తెలంగాణకు కృషి చేస్తున్నామని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మహమూద్ అలీ, మైనారిటీ విభాగం ముఖ్య సలహాదారు ఏకే.ఖాన్, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ మహ్మద్ సలీం, హైదరాబాద్ సిటీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్, మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మెన్ అక్బర్ హుస్సేన్, తెలంగాణ హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ఎస్ఏ.షుకూర్, సెంట్రల్ హజ్ కమిటీ సభ్యులు సయ్యద్ అశ్రఫ్, తయ్యబా అఫందీ, కస్టమ్స్ పీఆర్ఓ సాజిద్ ఘౌరీ తదితరులు పాల్గొన్నారు.

బస్‌బాడీ యూనిట్‌ను పునరుద్ధరిస్తున్నాం

- నెలకు 50 బస్సులు తయారు చేస్తాం:

టీఎస్ఆర్టీసీ ఛైర్మెన్ ఎస్ సత్యనారాయణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మియాపూర్‌లోని బస్‌బాడీ యూనిట్‌ను మూసివేయట్లేదని, దాన్ని పునరుద్ధరిస్తున్నామని టీఎస్ఆర్టీసీ ఛైర్మెన్ సోమారపు సత్యనారాయణ స్పష్టం చేశారు. ప్రస్తుతం సగటున నెలకు 23 బస్‌బాడీలను తయారు చేస్తున్నామని, దీన్ని 50 బస్సులు తయారు చేసేలా సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. బాడీ బిల్డింగ్ యూనిట్, టైర్ రీ ట్రేడింగ్ యూనిట్స్‌లో పనితీరు మెరుగుపరుచుకోవడానికి శిక్షణా కేంద్రాలు ఉండటం ఆర్టీసీకి అదనపు బలాన్ని ఇస్తుందని చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకొని మంగళవారంనాడిక్కడి బస్‌భవన్‌లో ఆయన సంస్థ ఎమ్‌డీ జివి రమణారావుతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో సిటీ బస్సుల వల్ల ఏటా రూ.400 కోట్ల నష్టం వస్తున్నదని తెలిపారు. ఆర్టీసీ ప్రగతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని వెల్లడించారు. అనంతరం వివిధ కార్మిక సంఘాల నేతలు ఛైర్మెన్, ఎమ్‌డీలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీఎస్ఎస్పీడీసీఎల్‌లో...

మింట్‌కాంపౌండ్‌లోని టీఎస్ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ సీఎమ్‌డీ జి రఘుమారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.

విద్యుత్‌సౌధలో...

సోమాజిగూడలోని విద్యుత్‌సౌధలో టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యుత్ కోతలులేని తెలంగాణ కోసం సంస్థ, ప్రభుత్వం చేపడుతున్న ప్రణాళికల్ని వివరించారు. కార్మికులు, ఉద్యోగుల ఉమ్మడి కృషితోనే నిరంతర వెలుగులు సాధ్యమౌతున్నాయని చెప్పారు.

ఈయూ కార్యాలయంలో...

టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలు, యాజమాన్య నిర్ణయాలను ఆయన ప్రస్తావించారు.

'కోదండరామ్‌ను అడ్డుకోవడం దారుణం'

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అమరుల స్ఫూర్తి యాత్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) సభ్యులపై పోలీసులు నిర్బంధం, దమనకాండ కొనసాగించటాన్ని మానవ హక్కుల వేదిక తీవ్రంగా ఖండించింది. టీజేఏసీ ఛైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రభుత్వ సలహా మేరకు పోలీసులు వారిని చట్ట వ్యతిరేకంగా అడ్డుకుని దౌర్జన్యపూరితంగా అరెసులు చేయడం దారుణమని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జీవన్‌కుమార్, విఎస్.కృష్ణ తెలిపారు.. టీజేఏసీ గత కొంత కాలంగా నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలపై పోలీసులు ఎక్కడపడితే అక్కడ అడ్డుకుని వారిపై విరుచుకుపడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో తమ మనో భావాలు ప్రకటించడం, సమావేశాలు నిర్వహించటం పౌరుల ప్రాథమిక హక్కని, అలాంటిది రాష్ట్ర ప్రభుత్వం పౌర, ప్రజాస్వామిక హక్కులపై దాడి చేసే వైనాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పౌరుల ప్రాథమిక హక్కులను గౌరవించి ప్రొఫెసర్ కోదండరామ్ పై, ఆయన నాయకత్వం వహిస్తున్న టీజేఏసీపై నిర్బంధాన్ని, పోలీసు చర్యలను ఆపేయాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేస్తోందన్నారు.

'నిరాశలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు'

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రసంగం సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్టు ఉద్యోగులను నిరాశపరిచింది. జీతాల పెంపుపై ప్రకటన చేస్తారని వారంతా భావించారు. కానీ సీఎం ప్రసంగంలో ఆ ప్రస్తావన రాలేదు. రాష్ట్రంలో 14వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. రెండు నెలల క్రితం తెలంగాణ ఎస్ఎస్ఏ పాలకమండలి (ఈసీ) సమావేశం జరిగింది. ఉద్యోగుల వేతనాల పెంపునకు సంబంధించి ప్రతిపాదనలను అప్పుడే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. ఈ ప్రతిపాదనలు కేసీఆర్ ఆమోదం ఎప్పుడు పొందుతాయా..? అని ఉద్యోగులంతా ఎదురుచూశారు. ఈ క్రమంలోనే ఉద్యోగుల వేతనాల పెంపు ఫైల్‌పై ముఖ్యమంత్రి సంతకం చేశారనీ, ఆగస్టు 15న ప్రకటిస్తారని సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. దీంతో సీఎం ప్రసంగం కోసం అందరూ ఎదురుచూశారు. కానీ వేతనాలపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులంతా తీవ్ర నిరాశకు గురయ్యారు.

12,005 పోస్టులు కాదు.. 8,792 పోస్టులే!

- టీచర్‌పోస్టులపై ప్రభుత్వ ప్రకటన అయోమయం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాలల్లో టీచర్ పోస్టుల భర్తీపై ప్రభుత్వం విడుదల చేసిన వివరాలు ఉపాధ్యాయ అభ్యర్థులను కొంత గందరగోళానికి గురిచేసింది. టీచర్ పోస్టుల పేరుతో 12,005 ఖాళీగా ఉన్నట్టు సర్కారు తన నివేదికలో పేర్కొన్నది. దీంతో ప్రభుత్వం గతంలో ప్రకటించిన 8,792 టీచర్ పోస్టులకు, మరిన్ని పోస్టులు జత కలిసాయని ఉపాధ్యాయ అభ్యర్థులు భావించారు. కానీ వాస్తవంగా సర్కారు బదుల్లో గతంలో ప్రకటించినట్టుగానే 8,792 పోస్టులే ఆ నివేదికలో ఉన్నాయి. మిగిలినవి మోడల్ స్కూల్స్‌లో ప్రిన్సిపల్ పోస్టులు 88, పీజీటీ 477, టీజీటీ 365, డైట్ లెక్చరర్స్ 68, సీఈటీ, ఐఏసీఈ లెక్చరర్ పోస్టులు 18, ఇతర సిబ్బంది పోస్టులు 2,197గా లెక్కలు చూపించారు. 12,005 టీచర్ పోస్టులు అనే ప్రకటన ప్రకారం మీడియాలో వైరల్ కావడంతో ఉపాధ్యాయ అభ్యర్థులు సంతోషపడ్డారు. కానీ అది కొద్దిసేపు కూడా నిలువలేదు. వాస్తవంగా అదంతా తప్పు అని తేలడంతో నిరాశకు గురయ్యారు.

నిరుద్యోగులకు టీఎస్‌పీఎస్సీ కానుక

- 2,345 పోస్టులకు తొమ్మిది నోటిఫికేషన్లు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిరుద్యోగులకు కానుక ప్రకటించింది. ఉద్యోగ నియామక ప్రకటనలు జారీ చేసింది. వైద్యవిధాన పరిషత్, వైద్య విద్య, బీమా వైద్య సేవలు, అటవీ శాఖలో కలిపి 2,345 పోస్టుల భర్తీకి తొమ్మిది నోటిఫికేషన్లు మంగళవారం టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. వైద్య విధాన పరిషత్‌లో 205 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 10 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చింది. వైద్య విద్య సంచాలకుడి పరిధిలో 65 ట్యూటర్లు, ఆరు రేడియోలాజికల్ ఫిజిక్స్ అధ్యాపకులు, ఫిజీషియన్ పోస్టుల భర్తీకి ప్రకటనలను జారీ చేసింది. బీమా వైద్య సేవల విభాగంలో 43 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, రెండు అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ప్రకటించింది. అటవీ శాఖలో 67 ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు, 90 ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, 1,867 ఫారెస్టు బీట్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను జారీ చేసింది. నోటిఫికేషన్ల పూర్తి వివరాల కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను టీఎస్‌పీఎస్సీ ఛైర్మెన్ ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్; వైద్య విద్య, బీమా వైద్య సేవలు, అటవీ శాఖలో 2,345 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. త్వరలో మరికొన్ని పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని అన్నారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీకి ఈనెలాఖరులో నోటిఫికేషన్ ఇస్తామన్నారు. కోర్టు కేసుల వల్ల గురుకులాల్లో నియామక ప్రక్రియ కొంత ఆలస్యమైందని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ సభ్యులు, సిబ్బంది మధ్య విభేదాల్లేవని అన్నారు. సమన్వయంతో పనిచేయడం వల్లే అనేక విజయాలు సాధిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంచి సహకారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ సభ్యులు టి వివేక్, డి కృష్ణారెడ్డి, కె రామ్మోహన్‌రెడ్డి, మంగరి రాజేందర్, సిహెచ్ విద్యాసాగర్ రావు, చింత సాయిలు, బి మన్మథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▲ 103
28,864

నిఫ్టీ ▲ 19
8,926

డాలరుకు రూపాయి విలువ
66.92



బంగారం(10.గ్రా)
రూ. 30,203



వెండి (కేజీ)
రూ. 43,285



కోడిగుడ్లు

హైదరాబాద్	348	విజయవాడ	355
ఒక్కగుడ్డుకు	4.10	చెన్నై	387
వరంగల్	350	ముంబయి	388



జియో ఫోన్‌తో ఆదాయం పడిపోతుంది



న్యూఢిల్లీ: రిలయన్స్ జియోతో తమ వ్యాపారాల ఉనికికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందంటూ తొలి టెలికాం సంస్థలు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నాయి. జియో అపరిమిత కాలింగ్‌తో పాటు డేటా సౌలభ్యంతో మార్కెట్లోకి కొత్తగా విడుదల చేయనున్న ఫీచర్ ఫోన్‌తో తమ ఆదాయాలు మరింతగా తరిగిపోయే అవకాశం ఉన్నట్టు వొడాఫోన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి విన్నవించుకుంది. దేశంలో రెండో అతిపెద్ద టెలికాం సంస్థ అయిన వొడాఫోన్ ఇందుకు సంబంధించి తన అభ్యంతరాలను వెల్లడిస్తూ టెలికాం కమిషన్ (ఆర్థిక వ్యవహారాల) సభ్యులు అనురాధా మిత్రాకు ఒక లేఖ రాసింది. జియో సంస్థ మార్కెట్లో చాలా దూకుడుగా వ్యవహరిస్తోందని ఆ లేఖలో పేర్కొంది. ఇప్పటికే మార్కెట్లో పోటీ పెరిగిపోవడానికి తోడు పలు రకాల పన్నుల మోత కారణంగా టెలికాం రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్టుగా వొడాఫోన్ తెలిపింది.

బీమా వ్యాపారంలో 47 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది జులై మాసంలో జీవిత బీమా నూతన ప్రీమియం వ్యాపారం రూ.20,427.68 కోట్లకు చేరింది. గతేడాది ఇదే మాసంలో రూ.13,854.44 కోట్లుగా నమోదయ్యింది. దీంతో పోల్చితే క్రితం మాసం వ్యాపారంలో 47 శాతం వృద్ధి చోటు చేసుకుందని బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏ వెల్లడించింది. ఈ రంగంలో దాదాపుగా 24 కంపెనీలు వ్యాపారాలు చేస్తున్నాయి. దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఏకంగా 51.4 శాతం వృద్ధితో రూ.16,254.91 కోట్ల నూతన ప్రీమియం వసూళ్లు చేసింది. 2016 ఇదే జులైలో ఎల్ఐసీ రూ.10,737.92 కోట్ల వ్యాపారం చేసింది.క్రితం మాసంలో ఎల్ఐసీ మినహా మిగితా 23 ప్రయివేటు కంపెనీలు తమ వ్యాపారంలో 34 శాతం పెరుగుదలతో రూ.4,172.76 కోట్ల వసూళ్లు చేశాయని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏ) వెల్లడించింది. 2016 ఇదే నెలలో ప్రయివేటు కంపెనీలు రూ.3,116.52 కోట్ల వ్యాపారం నమోదు చేసుకున్నాయి. గత మాసంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఆదాయం 25.3 శాతం పెరిగి రూ.847.91 కోట్లకు చేరింది.

200లకు పైగా ఎల్ఎల్‌పీలపై వేటు!

న్యూఢిల్లీ: దీర్ఘకాలికంగా నిర్వహణలో లేని 'లిమిటెడ్ లయబిలిటీ పార్టనర్‌షిప్' (ఎల్ఎల్‌పీ) కంపెనీల గుర్తింపు రద్దు చేసే పనిని ప్రభుత్వం ప్రారంభించింది. అక్రమ నిధుల ప్రవాహంపై అడ్డుకట్ట వేసే చర్యల్లో భాగంగా ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లిమిటెడ్ లయబిలిటీ పార్టనర్‌షిప్ 2008 యాక్ట్ ప్రకారం ఎల్ఎల్‌పీల రిజిస్ట్రేషన్‌ల నమోదు జరుగుతుంది. ఈ యాక్ట్ 2009 అమలోకి వచ్చింది. దీనిని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ తీసుకొచ్చింది. దీర్ఘకాలికంగా వ్యాపార కార్యకాలాపాలు నిర్వహించని కంపెనీలపై ప్రభుత్వం ఉచ్చు బిగిస్తోంది. దేశవ్యాప్తంగా నిర్వహణలో లేని ఇలాంటి ఎల్ఎల్‌పీలపై సంబంధిత మంత్రిత్వ శాఖ చర్యలకు సిద్ధం అయ్యింది. ఈ నేపథ్యంలో వరుసగా రెండు ఆర్థిక పర్యాయాలు ఇన్‌యాక్టివ్‌లో ఉన్న దాదాపు 200 ఎల్ఎల్‌పీలపై వేటు పడే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది.

ఉద్యోగ సృష్టి దిశగా సంస్కరణలు సాగాలి



న్యూఢిల్లీ: దేశంలో కొలువుల సృష్టితో పాటు కొత్త పారిశ్రామిక విధానం, వ్యవస్థాపకత, పని ప్రదేశాల్లో మహిళలకు సాధికారికత లభించేలా సర్కారు విధానపరమైన సంస్కరణలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) అభిప్రాయపడింది. అవినీతి, నల్లధనం నియంత్రణకు గాను ప్రభుత్వ చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసిస్తూనే విధానపరమైన సంస్కరణల దిశగా కూడా సర్కారు దృష్టి సారించాలని సీఐఐ సూచించింది. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై సీఐఐ స్పందించింది. 2022 నాటికి సురక్షితమైన, సుసంపన్నమైన, సామర్థ్యత కలిగిన జాతిని రూపొందించాలంటూ ప్రధాని చేసిన దిశానిర్దేశాన్ని సీఐఐ స్వాగతించింది. ప్రస్తుతం దేశంలో నెలకొన్న కనిష్ట ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు తగ్గుతున్న పరిస్థితులను సీఐఐ స్వాగతించింది. 2022 నాటికి సమర్థ అభివృద్ధి సాధించాలంటూ ప్రధాని సూచించిన లక్ష్యం సవాలుతో కూడుకున్నదని దీనిని సాధించేందుకు బహుళ ఆర్థిక, సాంఘీక రంగాల్లో ధ్రుఢమైన విధానపరమైన చర్యలు అవసరమని సీఐఐ అధ్యక్షురాలు శోభనా కామినేని అన్నారు. ప్రధాని సూచించిన లక్ష్యాన్ని అందుకొవడం దేశంలో 125 కోట్ల మంది ప్రజల సామూహిక శక్తితోనే సాధ్యపడుతుందని ఆమె అన్నారు. జీఎస్టీ, దేశంలో వ్యాపారాన్ని సులభతరత వంటి సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను అధికారికీకరణతో పాటు పన్ను పరిధిని విస్తరించేందుకు దోహదం చేయగలదని సీఐఐ విశ్వసిస్తోందని అన్నారు. 2022 నాటికి మరింత పారదర్శకత, సమర్థవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలని తాము ఆశిస్తున్నట్లుగా శోభనా కామినేని తెలిపారు.

ఉద్దేశపూర్వక ఎగవేతలు @ రూ.92,000 కోట్లు

- ఎగవేతదారుల సంఖ్యలో దాదాపు 10 శాతం మేర వృద్ధి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి రుణాలను స్వీకరించి ఉద్దేశపూర్వకంగా ఎగవేస్తున్న వారి సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. మార్చి ముగింపు నాటికి వీటికి ఇలాంటి రుణాల ఎగవేత మొత్తంలో 20 శాతం వృద్ధి నమోదైంది. గణాంకాల ప్రకారం దాదాపు 9000 మంది ఎగవేతదారులు ఉద్దేశపూర్వకంగా రూ.92,376 కోట్ల సొమ్మును ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణాలుగా తీసుకొని తిరిగి చెల్లించడం లేదు. అంతకు ముందు ఏడాది (2015-16) ఇలా ఎగవేసిన రుణాల మొత్తం రూ.76,685 కోట్లుగా నమోదు అయింది. ఇదే కాలంలో ఉద్దేశపూర్వక ఎగవేతదారుల సంఖ్యలో కూడా 10 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. అంతకు క్రితం ఆర్థిక సంవత్సరం మార్చి చివరి నాటికి ఉద్దేశపూర్వక రుణ ఏగవేతదారుల సంఖ్య 8,167 ఉండగా 2017 మార్చి చివరికి ఆ సంఖ్య 8,915కు పెరిగిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాలలో వెల్లడైంది. మొత్తం 8,915 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల్లో 1,914 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని.. వీరు తీసుకున్న రుణాల విలువ రూ.32,484 కోట్లుగా నమోదయ్యాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 27 ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ఎస్‌బీఐ దాని అనుబంధ బ్యాంకులు కలిసి దాదాపు రూ.81,683 కోట్ల రుణాలను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇది గత అయిదేండ్ల కాలంలో గరిష్టం కావడం విశేషం. ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల విలువ మార్చి త్రైమాసికం నాటికి రూ.5.02 లక్షల కోట్ల నుంచి రూ.6.41 కోట్లకు చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరిస్థిని నియంత్రణలోకి తెచ్చేందుకు గాను ఆర్‌బీఐ పలు నిబంధనలను కఠినతరం చేసిన సంగతి విదితమే.

రిలయన్స్‌కు భారీ షాక్!

- మరో రూ.1,700 కోట్ల జరిమాన
- కేజీ-డీ6లో ఉత్పత్తి లక్ష్యాన్ని చేరని రిలయన్స్, బీపీ
- రూ.20వేల కోట్లకు చేరిన మొత్తం పెనాల్టీ : తాజాగా చమురు మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ : ఉత్పత్తి లక్ష్యాన్ని చేరని రిలయన్స్ ఇండస్ట్రీస్ దాని భాగస్వామి బ్రిటిష్ పెట్రోలియం (బీపీ) కంపెనీలు మరోమారు భారీ జరిమానకు గురి అయ్యాయి. ఈశాన్యంలోని కేజీ-డీ6 క్షేత్రంలో ఆ కంపెనీలు ప్రభుత్వానికి హామీ ఇచ్చిన సహజ వాయువు ఉత్పత్తి లక్ష్యాన్ని నెరవేర్చకపోవడంతో కేంద్రం ఈ చర్యకు దిగింది. 2015-16కు గాను 264 మిలియన్ డాలర్లు (రూ.1,700 కోట్లు పైగా) జరిమాన విధించినట్లు చమురు మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. గత ఆరు సంవత్సరాల నుంచి ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఈ క్షేత్రంలో ఉత్పత్తి లక్ష్యాన్ని చేరలేకపోతోంది. 2010 ఏప్రిల్ ఒక్కటో తేది నుంచి ఇదే పరిస్థితి. దీంతో ఆ కంపెనీపై ఇప్పటి వరకు పడిన మొత్తం జరిమాన 3.2 బిలియన్ డాలర్లు (రూ.20వేల కోట్లకు పైగా) చేరుకుందని మంత్రిత్వ శాఖ సదరు అధికారి వెల్లడించారు. గ్యాస్ అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం నుంచి నిర్వహణ, పెట్టుబడి వ్యయాలన్నింటీని రిలయన్స్ దాని భాగస్వామ్య సంస్థలైన బ్రిటిష్ పెట్రోలియం, కెనడాకు చెందిన నికో రిసోర్సెస్‌లు వెనక్కి తీసుకునెందుకు ఉత్పత్తి పంపకం కాంట్రాక్టు అనుమతిస్తోంది. ఆ తర్వాతే ప్రభుత్వంతో లాభాలను పంచుకోవాలని నిర్దేశిస్తుంది. తాజా జరిమానాలతో ప్రభుత్వానికి 175 మిలియన్ డాలర్ల మేర అధిక ఆదాయం లభించనుందని అంచనా.



కేజీ-డీ6 ే బ్లాక్‌లోని ధీరుబాయి-1, ధీరుబాయి-3 గ్యాస్ క్షేత్రాల్లో ప్రతీ రోజు 80 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లు (ఎంఎస్ఎస్‌సిఎండి) గ్యాస్ ఉత్పత్తి చేపడుతామని రిలయన్స్ ఇండస్ట్రీస్ తొలుత ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. కాగా 2011-12లో ఇది కేవలం 35.33 ఎంఎంఎస్‌సిఎండి ఉత్పత్తిని మాత్రమే సాధించింది. 2012-13లో 20.88 ఎంఎంఎస్‌సిఎండి, 2013-14లో 9.77 ఎంఎంఎస్‌సిఎండిగా నమోదయ్యింది. ఇక్కడ ప్రతీ ఏడాది ఉత్పత్తి వరుసగా పడిపోతూ వస్తోంది. గ్యాస్ ధర పెంపున కోసం రిలయన్స్ ఉత్పత్తిని తక్కువ చేసి చూపిస్తోందన్న ప్రధాన ఆరోపణలు ఉన్నాయి.

ఉత్పత్తి లక్ష్యాన్ని నెరవేర్చని రిల్, దాని భాగస్వామ్య కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం వరుసగా 2010-11లో 457 మిలియన్ డాలర్లు, 2011-12లో 548 మిలియన్ డాలర్లు, 2012-13లో 792 మిలియన్ డాలర్లు, 2013-14లో 579 మిలియన్ డాలర్లు, 2014-15లో 380 మిలియన్ డాలర్లు, 2015-16లో 264 మిలియన్ డాలర్ల చొప్పున జరిమాన విధించింది. 2016-17కు గాను ఉత్పత్తి లక్ష్యం ఖరీదును వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం లెక్కించనుందని సదరు అధికారి తెలిపారు.

బంగాళాఖాతంలోని ఈ క్షేత్రంలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 60 శాతం వాటా ఉంది. దాని భాగస్వామ్య కంపెనీలు బ్రిటిష్ పెట్రోలియంకు 30 శాతం, నిక్కోకి 10 శాతం చొప్పున వాటాలున్నాయి. గత కొన్నేళ్లుగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ గ్యాస్ ధరలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ధర 4 డాలర్లకు పైగా ఉంది. కెజి బేసిన్‌లో ఓఎన్‌జిసి గ్యాస్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ అక్రమంగా తోడుకున్న మొత్తాన్ని తిరిగి ఇచ్చేయాల్సి ఉన్న విషయం తెలిసిందే.

ఓఎన్‌జిసికి చెందిన బ్లాక్‌ల నుంచి రిలయన్స్ ఏడేళ్లుగా గ్యాస్‌ను తోడేసుకున్నట్లు జస్టిస్ ఏపీ షా కమిటీ తేల్చిచెప్పింది. ఇందుకుగాను ఓఎన్‌జిసికి నష్టపరిహారాన్ని చెల్లించాల్సి ఉంది. కేజీ-డీ6లో ఓఎన్‌జీసీ ఉన్న గోదావరి-పిఎంఎల్, కెజి-డిడబ్ల్యూఎన్-98/2 బ్లాక్‌లు ఆర్ఐఎల్‌కు ఉన్న కేజీ-డీ6 ప్రధాన క్షేత్రం పక్కనే ఉన్నాయి. వీటి నుంచి 2009 ఏప్రిల్ 1 నుంచి 2015, మార్చి 31 మధ్య కాలంలో ఆర్ఐఎల్ కేజీ-డీ6కు 11.122 బిలియన్ ఘనపు మీటర్ల మేర గ్యాస్ తరలిపోయినట్లు స్వతంత్ర అధ్యయన సంస్థ డిఅండ్ఎం గతేడాది నవంబర్‌లో ఇచ్చిన నివేదికలో పేర్కొంది. అప్పటి సహజ వాయువు ధరలు (యూనిట్‌కు 4.2 డాలర్లు) ప్రకారం దీని విలువ 1.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.11,055 కోట్లు)గా లెక్కగట్టింది. ఓఎన్‌జీసీ కి రావాల్సిన ఈ మొత్తం చెల్లింపులపై ప్రభుత్వ చొరవ కొరవడిందనే విమర్శలు ఉన్నాయి.

బెదిరింపులతో భూసేకరణ చేయలేరు

- వేములఘాట్ నిర్వాసితులకు అండగా ఉంటాం
- పరిహారంలో ద్వంద్వ వైఖరి సిగ్గుచేటు
- నవతెలంగాణపై, కమ్యూనిస్టులపై సీఎం అక్కసు అప్రజాస్వామికం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- చివరికి ప్రజలే గెలుస్తారు: నిర్వాసితుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.వెంకట్
- మద్యం తాగించి సంతకాలు చేయిస్తారా?: వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-తొగుట/గజ్వేల్/మర్కుక్

ప్రజలను బెదిరింపులకు గురిచేసి భూసేకరణ చేయలేరని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రాజెక్టు ముంపు బాధితులను బెదిరించేందుకే కోర్టులో డబ్బులు డిపాజిట్ చేసి ప్రాజెక్టులు నిర్మిస్తామని ప్రభుత్వం చెబుతుంది తప్ప, ఎక్కడా ఒక ఎకరానికి కోర్టులో పరిహారం డిపాజిట్ చేసిన దాఖలాలు లేవని చెప్పారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో కొమురవెళ్లి మల్లన్నసాగర్ ప్రాజెక్టు ముంపు గ్రామమైన వేములఘాట్‌లో నిర్వాసితుల 437వ రోజు రిలే నిరాహార దీక్షలకు మంగళవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ...రైతులు సంతకాలు పెట్టకపోతే భూమి ఎక్కడికీ పోదని, వారు ఒప్పుకోకుండా ఒక్క ఎకరాన్ని కూడా సర్కారు తీసుకోలేదని చెప్పారు. వేములఘాట్ పోరాటం న్యాయమైందని, దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. నిర్వాసితులు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారని, భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు, గ్రామానికి గ్రామం ఇవ్వాలని అడుగుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సవరించిన 2016 జీవోలోనూ ఈ అంశాలు ఉన్నాయని గుర్తుచేశారు. ముఖ్య మంత్రితో వేములఘాట్ ప్రజలు ధైర్యంగా మాట్లాడి, కలిసికట్టు తమ నిర్ణయాన్ని ముక్కుసూటిగా చెప్పటం అభినందనీయమన్నారు. మల్లన్న సాగర్ రైతులకు ఎకరానికి రూ.6 లక్షలు, కొండపోచమ్మ నిర్వాసితులకు రూ.12 లక్షలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. పరిహారం ఇవ్వడంలో ద్వంద్వ వైఖరి సిగ్గుచేటన్నారు. దళితులకు భూములు, డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వకపోగా, పైగా వారి భూములనే సర్కారు లాక్కుంటున్నదని వాపోయారు. పోడు భూములను లాక్కోవడం బాధాకరమన్నారు. తమ పార్టీ ప్రాజెక్టులకు, పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, బాధితులకు న్యాయంగా పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలనే తమ పోరాటమని మరోమారు చెప్పారు. చేతకాని ముఖ్యమంత్రి అసహనానికి గురై ఆవేదనతో కమ్యూనిస్టులపై అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. నిర్వాసిత రైతులకు కమ్యూనిస్టు భూతం పట్టిందని కేసీఆర్ మాట్లాడటం సీఎం పదవికే సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికే దొరల భూతం పట్టిందని, దాన్ని వదిలిచేందుకే ప్రజలకు చైతన్యం కలిగిస్తున్నామని చెప్పారు. నిజాలు రాసిన నవతెలంగాణ పత్రికపై అక్కసు వెళ్లగక్కడం దారుణమన్నారు. భూసేకరణలో సర్కారు తప్పు చేసింది గనుక శిక్ష అనుభవించక తప్పదన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న లొసుగులను ఢిల్లీకెళ్లి బయటపెడుతామని చెప్పారు. నిర్వాసితుల రాష్ట్ర కన్వీనర్ బి.వెంకట్ మాట్లాడుతూ సీఎంకు, నిర్వాసితులకు మధ్య జరుగుతున్న పోరాటంలో వేములఘాట్ ప్రజలే గెలుస్తారన్నారు. భూసేకరణ పూర్తికాకుండానే మల్లన్నసాగర్‌కు టెండర్లు పిలవడమేంటని ప్రశ్నించారు. సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఇసుక మాఫియాకు వత్తాసు పలుకుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరిగాదన్నారు. తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ...భూసేకరణ ఆర్డీఓ కార్యాలయంలో జరగాలి తప్ప, బీరు, బిర్యానీ సెంటర్లలో కాదన్నారు. భూములు తీసుకోవడం కోసం రైతులకు మద్యం తాగిస్తూ, వారి భార్యలకు తెలియకుండా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సంతకాలు చేయించు కుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి, రైతు సంఘం కార్యదర్శి నక్కల యాదవరెడ్డి, టీడీపీ నాయకులు రఘుపతిరెడ్డి, హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

కోదండరామ్ టెర్రరిస్టా..?
- రాంకీ ఇండస్ట్రీస్ భూ దోషి సంగతేంటి? : తమ్మినేని

'మూడు దౌర్జన్యాలు - ఆరు నిర్భంధాలు' అన్న రీతిలో టీఆర్ఎస్ పాలన సాగుతుందన్నారు. ప్రాజెక్టుల పేరిట ఇప్పటికే ఐదు లక్షల ఎకరాలను సర్కారు దోచుకుందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ అతిథి గృహంలో మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. సమస్యలపై గళమెత్తుతున్న వారిపై సర్కారు పోలీసులను ప్రయోగిస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపిన టీజేఏసీ చైర్మెన్, ప్రొఫెసర్ కోదండరామ్‌ను టెర్రరిస్టు తీరులో అరెస్టులు చేయడం ఏంటన్నారు. ఆయన ఏమన్నా నయీం ముఠా సభ్యుడా, డ్రగ్స్ మాఫియానా, హైదరాబాద్‌లో భూములు కాజేసాడా, ఇసుక మాఫియానా? అని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాలో రైతులకు తెలియకుండానే రైతుల భూములను కొనుగోలు చేసినట్లు నకిలీ రిజిస్ట్రేషన్లను రాంకీ ఇండస్ట్రీస్ సృష్టించినట్టు తేలినా సర్కారు ఎందుకు స్పందించట్లేదని నిలదీశారు. రాంకీ సంస్థపై కేసులు నమోదు చేసి, నిజనిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం నియోజక వర్గంలోనే రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు.

మంచు దుప్పట్లో మహోపద్రవం

అంటార్కిటికా అంతరాగంలో అగ్ని పర్వతాలు

- ఏ ఒక్కటి బద్దలైనా మరింత వేగంగా మంచు కరిగే ప్రమాదం
- భూకంపాలకు నిలయంగా మారిన హిమగిరులు
- 13 ఏండ్ల క్రితం సునామీకి కూడా కారణం అవే! : ఎడిన్‌బరో, ఒరెగాన్, లాసెన్నె యూనివర్సిటీ పరిశోధనల్లో వెల్లడైనపలు వాస్తవాలు

పైకి ప్రశాంతంగా కనిపించే సముద్రం.. తన గర్భంలో నిప్పులు విరజిమ్మే అగ్ని పర్వతాలను, ఒక్క పెట్టున భూభాగాన్ని కదిలించగల భూకంప కేంద్రాలను పెక్కు సంఖ్యలో దాచుకొని ఉంటాయన్న విషయం తెలిసిందే! కానీ, తెల్లటి మంచు దుప్పట్లను పులుముకున్న అంటార్కిటికా, హిమాలయాలు సైతం ఇట్టి ఉత్పాతాలకు ప్రాధాన వేదికలుగా నిలుస్తున్నట్టు గత మూడు నెలల వ్యవధిలో జరిగిన వివిధ పరిశోధనల్లో బయటపడటం చర్చనీయాంశమవుతోంది. ఆ నేపథ్యంపై 'నవ తెలంగాణ' ప్రత్యేక కథనం..


జై



అంటార్కిటికా ఖండంలోని చల్లని మంచు పొరలు అగ్నికీలల సెగల వెచ్చదనాన్ని ఆపాదించుకున్నాయి. ఎత్తైన హిమగిరులు భూకంపాలు, సునామీల వంటి భయంకర విపత్తులకు కారణభూతంగా నిలిచాయి. అవును, ఇది నిజం! బ్రిటన్‌కు చెందిన ఎడిన్‌బరో వర్సిటీ, అమెరికాలోని ఒరెగాన్ స్టేట్ విశ్వవిద్యాలయం, స్విట్జర్లాండ్‌లోని లాసెన్నె యూనివర్సిటీ శాస్త్రవేత్తల బ ందాలు గత మూడు నెలలుగా చేసిన వివిధ పరిశోధనల్లో ఈ విషయాలు బయటపడ్డాయి.

సలసలా మరుగుతున్న మంచు

పశ్చిమ అంటార్కిటికాలోని ద్వీపకల్ప ప్రాంతం నుండి రోస్ ఐస్ షెల్ఫ్‌వరకు సుమారు 3,500 కి.మీ విస్తీర్ణంలో 91 క్రియాశీల అగ్నిపర్వతాలను తాము గుర్తించామని బ్రిటన్‌కు చెందిన ఎడిన్‌బరో వర్సిటీ నిపుణులు తాజాగా వెల్లడించారు. మంచు ఫలకం ఉపరితల ప్రాంతం నుంచి సుమారు రెండు కి.మీ దిగువన బయటపడిన ఈ అగ్నిపర్వతాల పొడవు వంద మీటర్ల నుంచి సుమారు 3,850 మీటర్ల వరకు ఉన్నట్టు ఎడిన్‌బరో సైంటిస్టులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. "రోస్ ఐస్ షెల్ఫ్ కింద ఉన్న సముద్ర గర్భంలో మరిన్ని అగ్నిపర్వతాలు ఉండొచ్చని భావిస్తున్నాం. ఐతే, అంటార్కిటికా ప్రస్తుత ద్వీపకల్ప ప్రాంతంలో తాజాగా బయటపడిన ఏ ఒక్క అగ్నిపర్వతం బద్దలైనా.. పశ్చిమ అంటార్కిటికా వ్యాప్తంగా పరుచుకున్న ఐస్ షెల్ఫ్‌లలో భారీ ప్రకంపనలు సంభవించి మంచు మరింత వేగంగా కరిగిపోయే ప్రమాదమున్న"దని పరిశోధనలకు అధ్యక్షత వహించిన రాబర్ట్ బింగ్‌హామ్ శాస్త్రవేత్త తెలిపారు. కాగా, గత నెల అంటార్కిటికాలో ఉన్న అతి పెద్ద మంచు ఫలకం 'లార్సెన్‌సీ' హిమ పర్వతం నుంచి వేరుపడిన విషయం తెలిసిందే!!







అప్పటి సునామీకి కారణమిదే

అత్యంత భీతావహ ఉత్పాతంగా చరిత్రపుటల్లో నిలిచిపోయి సుమారు రెండున్నర లక్షల మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్న 2004 డిసెంబర్ 26 సుమత్రా భూకంపానికి కారణం హిమాలయాలేనని ఒరెగాన్ స్టేట్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. లక్షల ఏండ్ల కిందట.. టిబెట్ పీఠభూమి, హిమాలయ పరిసర ప్రాంతాల నుంచి బయటపడిన ఓ భారీ అవక్షేపం నదుల ద్వారా ప్రవహించి హిందు మహాసముద్రంలో కలిసిందని, కాలానుగుణంగా ఉష్ణోగ్రతల్లో సంభవించిన మార్పుల వల్ల సదరు అవక్షేపం మరింత గట్టిపడి 2004 డిసెంబర్ సునామీకి కారణమైన భూకంప తీవ్రతను పెంచిందని శాస్త్రవేత్తలు అంటున్నారు. కాగా, 2,400 కిలోమీటర్ల మేర ఉన్న హిమాలయ పర్వతశ్రేణుల్లో భారీ భూకంపాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని స్విట్జర్లాండ్‌లోని లాసెన్నె యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఇదివరకే హెచ్చరించడం విదితమే! తాజా పరిశోధన ఫలితాలను చూస్తే చల్లని మంచు మాటున సైతం ఎన్నో ప్రళయాలు దాగున్నాయన్న విషయం అవగతమవుతోంది.

మంచు నిలయాలు ఆసక్తికర అంశాలు

- హిమాలయాలు క్రమంగా కరుగుతుండటం మూలంగా, గత అయిదేండ్ల వ్యవధిలో.. నేపాల్‌లోని దూద్‌కోషి ప్రాంతంలో సుమారు 24 సరస్సులు ఏర్పడ్డాయంటే మంచు ఎంత వేగంగా కరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.
- గత నెల అంటార్కిటికా నుంచి విడిపోయిన 'లార్సెన్‌సీ' ఫలకం దాదాపు లక్ష టన్నుల కోట్ల బరువుతో, న్యూఢిల్లీ నగర వైశాల్యంతో పోలిస్తే దాదాపు నాలుగు రెట్లు పెద్దదని భావిస్తున్నారు.
- రిక్టర్ స్కేల్‌పై 8.5గా నమోదయ్యే భూకంపాలను సైతం తట్టుకునే సామర్థ్యంతో తెహ్రీ డ్యామ్(ఉత్తరాఖండ్) నిర్మించినట్టు ప్రభుత్వాలు చెబుతున్నా.. సదరు ప్రాంతంలో 8.5 కంటే ఎక్కువ తీవ్రమైన భూకంపాలు చరిత్రలో సంభవించడం గమనార్హం.అంటే, అనుకోని ఉపద్రవం ఏర్పడితే, ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకు ఎన్నో ప్రాంతాలు ముంపునకు లోనవుతాయి.





“బహుశా ఒక్కసారి వెళ్లిన ప్రదేశానికి మరోసారి వెళ్లకపోవచ్చు. కానీ మళ్లీ మళ్లీ చూడాలని ఆరాటాన్ని కలిగించేదే పర్యాటక కేంద్రం

- గుస్తావ్ ఫ్లాబర్ట్”

జరదేఖో
నవతెలంగాణ

లోక సంచారం వారికి ప్రీతి పాత్రం



నవ తెలంగాణ పత్రికలో “జర దేఖో” శీర్షిక కింద నార్వే దేశాన్ని చూసొచ్చిన అనుభవాలను నోముల నర్మదా రెడ్డి గారు వ్యాసంగా రాస్తే ప్రచురించారు. వారి ప్రయాణ వివరాలను తెలుసుకోవడానికి వారితో ఫోనులో మాట్లాడినపుడు, ఇప్పటివరకు వారు, వారి భర్త గారైన నోముల ఇంద్రా రెడ్డి గారితో కలసి 130 దేశాలు పర్యటించినట్లు చెప్పారు. ఏదైనా ఒక అంశంపై అధ్యయనం కోసమైతే ఆ అంశానికి సంబంధించిన దేశాలు తిరుగుతారు..... సంతోషంగా గడపటానికైతే ఆనందం కలిగించే దేశాలు తిరుగుతారు... కానీ 130దేశాలు తిరగడమంటే మామూలు విషయం కాదు. ఏదో ఒక తపన, నిరంతరం నడిపిస్తే తప్ప ఇది సాధ్యం కాదు. వారు పర్యటించినపుడు కలిగిన అనుభవాలను, ఆ దేశాల పరిస్థితులను వారింటికెళ్లి ఆ దంపతులతో చర్చించినపుడు నాకు కలిగిన అనుభూతులను మీతో పంచుకోవాలని...



సూర్యునికి 15 కోట్ల కిలోమీటర్ల దూరంగా 12742 కిలోమీటర్ల వ్యాసం కలిగి, గంటకు 108000 కిలోమీటర్ల వేగంతో సూర్యుని చుట్టూ తిరుగుతున్న ఈ భూమిపై మాత్రమే, మనకు తెలిసినంతవరకూ మనుషులున్నారు. వారు 7 ఖండాల్లోని 196 దేశాల్లో విస్తరించి వున్నారు. ఈ భూమిపై పుట్టినందుకు, కనుమూసేవరకు ఒక్కసారైనా ప్రపంచ దేశాలను చూసి రావాలని, ప్రతి దేశ పౌరునితో కరచాలనం చేయాలనీ మదిలో కలిగిన ఒక చిన్న ఊహ, పెద్ద అడుగులకు దారితీస్తుందని ముప్పయేళ్ల క్రితం వారు ఊహించి ఉండరు! పడ్డ అడుగులు వెనుతిరిగింది లేదు... తిరగడం ఆగింది లేదు. తిరగడం ... తిరగడం ... తిరగడం ...ప్రపంచాన్ని చూడడం.... జనంతో కలవడం! చావులకు, పెండ్లిళ్లకు తప్ప తమ ఇల్లే ప్రపంచమని బయటకెళ్లని లోకంలో, ప్రపంచమే తమ ఇల్లని, ప్రపంచ ప్రజలంతా తమ వాళ్ళని నిరంతరం తపిస్తూ తిరగడానికి ఎంత విశాలత్వం కావాలి ? అయినా విశాలంలేని మనుషులు తిరగలేరు... తిరిగిన మనుషులు విశాలంగా ఉండలేరు?! తిరగడమంటేనే మనుషులతో సంభాషించడం.. వారి సంస్కృతీ సంప్రదాయాలతో కరచాలనం చేయడం.. దేశ దేశాల్లోని వారి వారి ఆలోచనలతో, అభిప్రాయాలతో మన మనుసులను పెనవేసి నూతన మానవుడిగా రూపాంతరం చెందడం !

చరిత్రలో చెగువేరా యాత్ర...

1952లో 9 నెలల పాటు స్నేహితునితో కలిసి 8000 కిలోమీటర్లు తన మోటార్ సైకిల్ పై లాటిన్ అమెరికా దేశాలను తిరుగక పోతే, చేగువేరా చేసిన విప్లవ పోరాటం సమగ్రమయ్యేదా? విప్లవానికి వేగుచుక్కగా మారిపోయేవాడా? 21 ఏండ్ల వయసులో మొరాకోలోని తన ఇంటి నుండి 1325 సంవత్సరంలో బయలెల్లిన ఇబాన్ బటూటా 1354 వరకు అంటే 24 ఏండ్లు ప్రపంచాన్ని తిరగకపోతే ముస్లిం మతం గొప్పతనం ప్రపంచానికి తెలిసేదా? కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పనిచేసే క్రమంలో, అక్కడి ప్రొఫెసర్, బీగల్ అనే నౌక కెప్టెన్ పరిచయం చేయకపోతే, చార్లెస్ రాబర్ట్ డార్విన్ ఐదు ఏండ్లు తన ఇల్లు నొదిలి అనేక దీవులలో పర్యటించేవాడా? అక్కడి శిలాజాలు, మొక్కలను, కీటకాలను, జంతువులను అధ్యయనం చేసి, ఆ వాతావరణానికి అనుకూలంగా తమ శరీరాన్ని మార్చుకుంటన్న జీవరాశిని అర్థం చేసుకోకపోతే “డార్విన్ పరిణామక్రమ సిద్ధాంతం” ప్రపంచానికి తెలిసేదా? ఒకటి కాదు... రెండు కాదు... 45 ఏండ్లు ఇల్లొదిలి దేశ దేశాలు తిరిగి బౌద్ధమత సాహిత్యాన్ని భారత దేశానికి రాహుల్ సాంకృత్యాయన్ తీసుకొని రాకపోతే, బౌద్ధ సాహిత్యం సంపద్వంతం అయ్యేదా? 627 లో చైనాను వదిలి బౌద్ధమత అన్వేషణలో భారత దేశానికొచ్చి హర్షుని కొలువులో 15 ఏండ్లు హుయాన్ త్సంగ్ ఉండకపోతే, ఇక్కడి దేశ పరిస్థితులను అతడు రాయక పోతే, మన దేశ



గొప్పతనం ప్రపంచానికి తెలిసేదా? 1269లో వెనిస్ నగరం నుండి మూడున్నరేళ్ళు ప్రయాణించి, దారిలోనే చైనీస్, మంగోల్ భాషలు నేర్చుకొని, మంగోలును పాలిస్తున్న కుబ్లైఖాన్ కొలువులో 17 ఏండ్లు మార్కొపోలో ఉండకపోతే, చైనా, మంగోలియా చరిత్ర ప్రపంచానికి ఇంత వివరంగా తెలిసేదా?1830లో కాలినడకన 100 మందితో బయలుదేరి, 15 నెలలు ప్రయాణించి కాశీకి చేరిన యాత్రా వివరాలను “కాశీ యాత్ర” పేరుతో ఏనుగు వీరాస్వామి పుస్తకాన్ని రాయక పోతే అప్పటి పరిస్థితులు ప్రపంచానికి తెలిసేదా? అలా చెప్పుకుంటూ పోతే ఫాహియాన్, కొలంబస్, వాస్కోడిగామా, ఎస్.కే.పొట్టెక్కా డ్, పారే మక్కల్ తోమా కథ నార్ లాంటి పూర్వీకులు, నేటికీ ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ యాత్రా సాహిత్యాన్ని అందిస్తున్న ఆది నారాయణ, పరవస్తు లోకేశ్వర్ లాంటి వారు మరికొంత మంది తెలుగు నేలపై ఉన్నారు. ఒక ఆదర్శం కోసం తిరిగినా, తిరగడం కోసమే తిరిగినా వచ్చే లాభాలు ఎప్పుడు ఎక్కువే!

తక్కువ ధరలో టిక్కెట్లు...

దేశాలను చూడాలని చాలా మందికి ఉంటుంది... కానీ సాధించడానికి కావలసిన అవకాశాలు ఎలా అని వారినడిగినపుడు, “ముందుగా ఏ దేశం పోవాలో నిర్ణయించుకుంటామని, అక్కడున్న వాతావరణ, సామాజిక పరిస్థితులు



అనుకూ లిస్తాయనుకున్నప్పుడు, విమానాల్లో టికెట్ ధర ఎప్పుడు తక్కువుంటుందో, ఆ తేదిలోనే ప్రయాణం పెట్టుకుంటామని, దీనితో ఎంతో దూరంగా ఉన్న దేశానికైనా తక్కువ ధరలోనే టిక్కెట్లు దొరుకుతాయన్నారు. ఆ తర్వాత వీసా కోసం మాత్రం కొన్ని ట్రావెల్స్ వారి సహకారం తీసుకుంటామని” చెప్పారు. ట్రావెల్స్ వారి ప్యాకేజిల్లో దేశాలు చూడడానికి పోయినపుడు ప్రయాణం మన చేతుల్లో ఉండదు.. నచ్చిన చోట ఎక్కువ రోజులు, ఎక్కువ సమయం ఉండాలనుకుంటే సాధ్యం కాదు. గుంపులో పోయినపుడు ఇష్టం లేనివి కూడా అందరితో పాటె చూడాల్సి వస్తుంది. అందుకే ఏ బాదర బంది లేకుండా, నచ్చినన్ని రోజులు, నచ్చిన చోట ఉండాలంటే పోవడానికి ముందరే ఆ దేశంలో ఇల్లు కిరాయికి తీసుకుంటామని, ఆలా కిరాయికిచ్చే ఇండ్లు ప్రతి దేశంలో ఉంటాయని నర్మదారెడ్డి, ఇంద్రారెడ్డి చెప్పారు. ఆ ఇండ్లలో ఉండడమంటే, ఆ ఇంటి వారితో గడపడం... వారి ఆతిధ్యాన్ని ... ఆనందాన్ని పంచుకోవడమంటారు వారు. ఏ కిరాయింట్లో ఉన్నారో, వారు ఇప్పటికి అప్పుడప్పుడు ఫోన్ చేస్తూనే ఉంటారని, పంచుకున్నప్పుడే కదా అనుబంధాలు పెరిగేదన్నారు !

మరపురాని అనుభవాలు...

మనం ఒక బస్సెక్కి దిగేవరకే పక్కవారి ఫోన్ నెంబర్ తీసుకొని అనుబంధాన్ని పెంచుకుంటాం, అలాంటిది 130 దేశాలు తిరిగినప్పుడు ఎన్నో మరిచిపోలేని అనుభవాలు ఉంటాయిక దండి అని అన్నప్పుడు “ఒక సారి పసిఫిక్ మహాసముద్రములోని గాలాపాగోస్ దీవిని (ఇక్కడే డార్విన్ పర్యటించి పరిణామక్రమ సిద్ధాంతాన్ని రాసినట్లు చెపుతారు) చూడడానికెళ్లినప్పుడు అక్కడ పరిచయమైన ఒక చిలీ దేశమమ్మాయి, వీరు చిలీలో పర్యటిస్తున్నప్పుడు ఆదేశ వివరాలను ప్రతిరోజు చెపుతూ ఎంతో సహకారాన్ని అందించినట్లు” చెప్పారు. ఆ అమ్మాయే పది ఏండ్ల తర్వాత మళ్ళీ నార్వే దేశంలో కలిసి (నార్వే దేశస్తుణ్ని పెళ్లాడింది) వారింటికి తీసుకెళ్లి ఒక రోజంతా ఉంచుకొని చెరువుకెళ్లి చేపలు పట్టుకొచ్చి తమకోసమే వండడం ఒక గొప్ప మరిచిపోలేని అనుభూతి అంటారు.

జరిగిన అనుభవాలు ఎన్నో ఉన్నాయి, కానీ బతుకంతా తలుచుకున్నప్పుడల్లా కండ్లల్ల నీళ్లు తిరుగుతున్న అనుభవం మాత్రం ... ఒకసారి గ్రీసు దేశంలో ఎయిర్ పోర్ట్ లో దిగగానే తెచ్చు కున్న బ్యాగులు వేరే విమానంలో పోయాయని, ఒక రోజు తర్వాత వస్తాయని అధికారులు చెప్పారు. బట్టలు లేవు... తినడానికి తిండి లేదు... చేతిలో డబ్బులు లేవు. కిరాయికి తీసుకున్న ఇంటికి బస్సు లో పోతున్నప్పుడు బస్సులో ఒకతను పరిచయమయ్యాడు. కిరాయికి తీసుకున్న ఇంటి చిరునామా చెప్పి మమ్ములను దిగబెట్టడానికి ఇంటి వరకొచ్చాడు. మొహమాటంతో మేం తినలేదన్న విషయం కానీ, డబ్బులు లేవన్న విషయం కానీ అతనికి చెప్పలేదు. బ్యాగ్ రాలేదన్న విషయం.. అందులోనే అన్ని ఉన్నాయన్న విషయం మాత్రం చెప్పాం. ఆరోజు రాత్రి 12 గంటలకు ఎవరో తలుపులు కొడుతుంటే, భయంతోనే తలుపులు తీసాం. ఎదురుగ బస్సులో పరిచయమైనా వ్యక్తి... పెద్ద గిన్నెలో వేడి వేడిగా వండిన బిర్యానీ... ఆకలిగా ఉన్న మేం ఆవురావురమంటూ తిన్నాం. ఎవరో తెలియదు.. ఎందుకు వండుకొచ్చాడో తెలియదు. దేశం కానీ దేశంలో మాపై అంత ప్రేమ. మేమున్న ఐదు రోజులు మా వెంటే ఉండి దేశమంతా తిప్పి చూపించాడు. ఐదు రోజుల తరువాత భారత దేశానికి వస్తుంటే, ఆత్మీయంగా “ఫిర్మిలింగే” అని అతడు అన్నప్పుడు ప్రేమగా ఆరోజు వండుకొచ్చిన బిర్యాని అన్నం మెతుకులపై జారిన కన్నీటి బొట్లు జ్ఞాపకం వచ్చి, నేటికీ ఆ బంగ్లా దేశ్ ముస్లిం యువకుడి ప్రేమలో తడిసి ముద్దవుతామని కన్నీరు తుడుచుకున్నారు. విశాల ప్రపంచంలో మానవులు ఎక్కడున్నా ఒక్క తీరుగానే ఉంటారు. అందుకే శ్రీ శ్రీ “చైనాలో రిక్షావాలా, చెక్ దేశపు గని పనిమని షి, ఐర్లాండునా ఓడ కళాసీ, అణగారిన ఆర్తులందరు” అంటాడు మహాప్రస్థానంలోని దేశ చరిత్రలు కవితలో.

750 కోట్ల ప్రపంచ జనాభాలో 6909 భాషలు మాట్లాడే ప్రజల మధ్య, మీకు తెలిసిన తెలుగు, ఇంగ్లీష్ మరియు హిందీ భాషలతో ఎలా నెట్టుకొచ్చారని అన్నప్పుడు వారు చెప్పిన జవాబు ఆశ్చర్యానికి గురి చేసింది. “ప్రపంచంలో ఎన్ని భాషలు మాట్లాడే ప్రజలున్నా, మనకు వారి భాష రాకున్నా, అందరిని కలిపే భాష ఒకటుంది... అదే మూగ భాష” అన్నప్పుడు ఎంతో ఆశ్చర్యానికి గురయ్యాను.. భాష రాకపోయినా భావాలూ తెలుస్తాయి..బంధాలు పెరుగుతాయి. కంటి చూపుతో భావాలను చెప్పే తీరులో ప్రపంచమంతా మన వెంటే ఉన్నట్లే ఉంటుంది. అందుకే నారాయణ రెడ్డి గారు ఆత్మబంధువు సినిమాలో “చదువు రాని వాడవని దిగులు చెందకు “పాట రాసాడేమో. మనకు భాష రానప్పుడు ఇతరులకు ఏదైనా విషయాన్నీ చెప్పాలన్నా, చూడాల్సిన ప్రదేశాలను అడుగాలన్నా, ఆ ప్రదేశాల ఫోటోలను ఫోన్లో తీసుకొని ప్రజలను

తోడుగా ఉప్మా రవ్వ...

వారి ప్రయాణంలో తెలుసుకోవాల్సిన ఒక విషయం అందరికి ఆశ్చర్యంగా.. వింతగా ఉంటుంది!! పోవడానికి ముందరే ఎన్ని రోజులు ఆ దేశంలో ఉండాలనుకుంటారో, అన్ని రోజులకు సరిపోయే లాగా రోజుకొక పాకెట్ చొప్పున ఉప్మా రవ్వను వేయించి తీసుకొని పోతామని, బియ్యం, పచ్చళ్ళు, కారం, ఉప్పులాంటి పదార్థాలు వండుకోవడానికి కరెంటు కుక్కర్ తీసుకొని పోతామన్నారు. ఉన్నన్ని రోజులు బయట టిఫిన్ తినమని, మధ్యాహ్నం అన్నం వండుకొని, టిఫిన్ కట్టుకొని ఆ దేశంలోని ప్రదేశాలు చూడడానికి పోతామని చెప్పారు. రాత్రి వచ్చేటప్పుడు, ఏదైనా సూపర్ మార్కెట్టుకు పోయి, చికెన్, పెరుగు తెచ్చుకుంటామన్నారు. ఇలా వండుకోవడం డబ్బులు మిగుల్చుకోవడానికే కాక, తిరగాల్సిన రోజుల్లో ఆహారం మారిపోతే ఆరోగ్యం పాడవకుండా ఉపయోగపడుతుందని. అయితే అక్కడి ఆహారాన్ని మాత్రం ఒక్కసారైనా తింటామన్నారు. ఆరోగ్యానికి ఆరోగ్యం...డబ్బులకు డబ్బులు మిగలడమంటే అదే మరి!?

అడిగితె ప్రతి మనిషి మనకు ఒక గైడుగానే ఉపయోగ పడుతారన్నారు.

ఆరోగ్యంకోసం బ్యాడ్మింటన్...

లోకసంచారికి తిరుగాలన్న ఇష్టముంటేనే సరిపోదు. దానిక్కావల్సిన ఆరోగ్యం సహకరించాలి. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి 30 ఏండ్ల నుండి క్రమం తప్పకుండ బ్యాడ్మింటన్ ఆడుతున్నట్లు చెప్పారు. ఏదైనా సాధించాలంటే తపన, కసి, ధైర్యం కావాలి. ఆవిషయాన్నే పెద్దలు అనేకసార్లు అనేక సందర్భాల్లో చెప్పారు. ప్రయాణాల్లో ఒక్కొక్కసారి మనం అనుకున్నట్లే జరగదు... దేనికైనా సిద్ధపడాలి... అప్పుడే ఏదైనా సాధించగలం. క్యాపిటల్ పుస్తక అధ్యయనం సంభందించి మార్క్స్ ఒకచోట “అలవగొట్టే నిటారు పర్వత మార్గాలలో పయనించడానికి వెరవని వారికి మాత్రమే కాంతులీనే సమున్నత శిఖరాలను చేరుకొనే అవకాశం ఉంటుంది” అంటాడు. ఆ భావనే లేకపోతే మనుషుల సంచారమే లేని అంటార్కిటికా ఖండానికి ప్రతి సంవత్సరం 4000 మందికి మాత్రమే రీసెర్చ్ చేయడానికి ప్రభుత్వం అనుమతులు ఇస్తున్న వేళ, పట్టుపట్టి 10రోజులు పడవలో కష్టపడి, మంచు ముద్దల్లో కాళ్లు వంకర్లు పోతున్నా అప్పటికే అక్కడున్న శాస్త్రజ్ఞుల దగ్గర, వారు చేస్తున్న పనులను అడిగి తెలుసుకుంటూ, ప్రతి విషయంపై వారు చెప్పే క్లాసులను వినడం మాములు విషయమా? అంత కష్టపడి అక్కడికి ఎందుకెళ్లారని అడిగితె, “ఒక ఖండాన్ని చూడకుండా చనిపోతే మా జీవితమే వధా కదండీ” అని ఆ దంపతులు అన్నప్పుడు, ఒక దేశాన్ని చూడడానికి వారు పడ్డ తపన అర్థం అవుతుంది!

ఏ దేశం పోవాలన్నా అక్కడి సాంఘిక పరిస్థితులు సహకరించకపోతే తిరగడం సాధ్యం కాదు. నిరంతరం యుద్ధాల్లో మునిగిపోయిన ఇరాక్, సిరియా దేశాలను ఎలా చూడగలుగుతారని అడిగినపుడు “ఒక దేశాన్ని చూడకుండా వదిలేయడం మా డైరీలో లేదు. జీవితం చివరి రోజుల్లోనైనా చావుకు అడుగు దూరంలో నిలబడి ఆ దేశాలను చూస్తాం. ఒకవేళ అదష్టముంటే ఇంటికి... లేదంటారా కాలం కలిసి రాకపోతే కాటికి” పోతామన్నారు. ఎంత ధైర్యం కావాలి ఆ మాటలు అనడానికి? ఎంత తాత్విక చింతన ఉంటే తప్ప చావు ముందర నిలబడి సవాల్ విసరగలం.

వారికి దేశాలు తిరిగిన అనుభవము ఉంది... ఆ దేశాల్లోని అనేక రకాల మనుషులతో మాట్లాడిన అనుభవం ఉంది... తక్కువ ఖర్చుతో పోవడానికి.... అక్కడివన్ని చూడడానికి ఉపాయాలున్నాయి... శారీరకంగా నిలదొక్కుకోవడానికి ఆటలాడుతున్న అనుభవముంది.. వాటన్నింటిని రాబోయే కాలంలో గ్రంథస్థం చేస్తే, తెలుగు నేలపై యాత్రా సాహిత్యం ఎంతో సుసంపన్నం అయ్యే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం టూరిజం అభివద్ధికి చేస్తున్న కషిలో భాగంగా, ఎంతో అనుభవమున్న వీరి సహకారాన్ని తీసుకొని ఇతర దేశ టూరిస్టులు మన రాష్ట్రానికి వచ్చేలాగా, వచ్చినవారికి ఇక్కడి ఇళ్లల్లో రూములను కిరాయికి ఇచ్చేలాగ ప్రయత్నం చేస్తే ఏంతో మందికి ఉద్యోగాలు దొరికే అవకాశం ఉంది. మన రాష్ట్ర గొప్పతనం, సాంస్కతిక వారసత్వం ప్రపంచ వ్యాప్తం కావడానికి ఉపయోగపడుతుంది.

చివరగా, ఇన్ని దేశాలను తిరిగిన అనుభవంతో రాబోయే కాలంలో వీరు యాత్రలకు, యాత్రా సాహిత్యానికి ఒక ఐకాన్ గా మారాలని ఆశిద్దాం.

వేచే అడుగులకు హద్దులు వద్దు !
లోక సంచారమే ఏంతో ముద్దు!!

- స్ఫూర్తి
సెల్ నెంబర్ : 9490098694

ప్రకృతి ప్రేమికుల విహారస్థలి

రెండు దేశాల సంస్కృతులు, వేషభాషలు మన దేశంలో ఎక్కడైనా వాడుకలో ఉన్నాయంటే... అది గోవా తర్వాత పాండిచ్చేరి మాత్రమే. ప్రస్తుతం మన దేశంలో “లిటిల్ ఫ్రాన్స్’ గా పేరొందిన పాండిచ్చేరి స్వాతంత్ర్యానికి పూర్వం ‘ఫ్రెంచి కాలనీ’ అయిన పాండిచ్చేరి. గతవైభవ చిహ్నాలతో పాటు... హిందూ సంస్కృతి మూలాలను కూడా తనలో నిక్షిప్తం చేసుకుంది. అగస్త్య మహర్షి ఆశ్రయం పొందిన స్థలంగా పురాణగాథలు చెబుతున్నాయి. దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా వెలుగొందుతున్నది. తమిళంలో ‘పుదు-చ్చేరి’ అంటే ‘కొత్త-ఊరు’ అని అర్థం. దీనికి సమీపమైన ఫ్రెంచి ఉచ్చారణ ప్రకారం దీనిని ఫ్రెంచివారు ‘లోకర ఛీజీఛిజ్జీటడ’ అని పిలిచేవారట. కాలా క్రమంగా దీన్ని ‘పాండిచ్చేరిగా పిలవడం మొదలయ్యిందని అధ్యయన కర్తలు చెబుతున్నారు. ప్రస్తుతం ఆంగ్లంలో అధికారికంగా ‘పుదుచ్చేరి’ అని పేరు మార్చే ప్రయత్నం జరుగుతున్నది.

చారిత్రక ఆధారాలు...

క్రీశ రెండవ శతాబ్దంలో ‘పొడుకె’ అనే వాణిజ్య కేంద్రం గురించి రాసినట్టు పురాతన ఆధారాలున్నాయి. పూర్వం రోమ్ ప్రాంతంతో పాండిచ్చేరి దగ్గర సముద్ర వర్తక సంబంధాలుండేవి. క్రీశ నాలుగవ శతాబ్దానంతరం ఈ ప్రాంతం వరుసగా పల్లవ, చోళ, పాండ్య, విజయనగర రాజుల రాజ్యాలలో భాగంగా ఉంది. 1673 లో ఫ్రెంచి ఈస్టిండియా కంపెనీ వారు ఇక్కడ నెలకొలిపిన వర్తక స్థావరం క్రమంగా ఫ్రెంచి వారి అధికార కేంద్రమయ్యింది. తర్వాత ఫ్రెంచి, బ్రిటిష్, డచ్ వారి మధ్య అధికారం కోసం జరిగిన అనేక యుద్ధాలు, ఒప్పందాల ప్రకారం పాండిచ్చేరి పై అధికారం మారుతూ వచ్చింది. 1850 తర్వాత పాండిచ్చేరి, మాహె, యానాం, కరైకాల్, చందేర్ నగర్‌లు ఫ్రెంచివారి స్థావరాలుగా ఉన్నాయి. 1954 వరకు ఇదే పరిస్థితి సాగింది.

విభిన్న సంస్కృతులు...

భిన్న సంస్కృతులు కలిగిన విలక్షణ నగరం పాండిచ్చేరి. స్వాతంత్ర్యానికి పూర్వం ఫ్రెంచి వారి ఏలుబడిలో ఉన్నది. ఆనాటి వైభవ చిహ్నాలు... గత చరిత్రకు సాక్ష్యాలుగా ఎన్నెన్నో కట్టడాలు ఇప్పటికీ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చదువులకు కేంద్రంగా, ఆధ్యాత్మికవాదుల మజిలీగా, ప్రకృతి ప్రేమికులకు విహారంగా భూలోకపు స్వర్గాన్ని తలపిస్తున్న ఈ అద్భుత ప్రదేశం కన్నా మరొకటి లేదంటే అతిశయోక్తి కాదేమో ! దక్షిణ భారత దేశంలో ఒక కేంద్ర పాలిత ప్రాంతమైన పాండిచ్చేరి... కరైకాల్, యానాం, మాహె అనే నాలుగు జిల్లాల సముదాయం. వీటిలో పాండిచ్చేరి పట్టణం బంగాళాఖాతం తీరాన,



తమిళనాడు రాష్ట్రం అంతర్భాగంగా 293 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. కరైకాల్ బంగాళాఖాతం తీరంలో, తమిళనాడు రాష్ట్రం అంతర్భాగంగా 160 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. అలాగే.. బంగాళాఖాతం తీరంలోనే, మన రాష్ట్ర అంతర్భాగంగా, కాకినాడకు సమీపంలో 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో యానాం విస్తరించి ఉంది. ఇక చివరిదైన మాహె... అరేబియన్ సముద్ర తీరాన 9 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. పాండిచ్చేరి లోని నాలుగు జిల్లాల జనాభా మొత్తం సుమారు 10 లక్షలకు పైబడే ఉంటుంది.

పర్యాటక ప్రదేశాలు...

పాండిచ్చేరిలో చూడాల్సిన పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయి. వాటిలో బీచ్, బొటానికల్ గార్డెన్, మ్యూజియం... ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సెరినిటీ బీచ్. ఒకటిన్నర కిలోమీటర్ల పొడవుండే ఈ బీచ్ సౌందర్యం మాటల్లో చెప్పలేనిది. ఈ సెరినిటీ బీచ్‌లో ముఖ్యంగా రెండు చారిత్రక కట్టడాలు ఉన్నాయి. అందులో ఒకటి జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం, మరొకటి యుద్ధ స్మారక చిహ్నం. బీచ్‌కు కొంచెం దూరంలో ఉండే లైట్ హౌస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే ఇది 150 ఏండ్ల క్రితమే కట్టబడిందట. పాండిచ్చేరి స్పెషాలిటీ ఒక్క బీచ్ మాత్రమే కాదు... ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి.

ఐలాండ్ ఆఫ్ పీస్...

బొటానికల్ గార్డెన్ ను ‘ఐలాండ్ ఆఫ్ పీస్’ అని పిలుస్తారు. 22 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ బొటానికల్ గార్డెన్ ప్రశాంతతకు, పచ్చదనానికి చిహ్నమని చెప్పవచ్చు. భారతదేశంలోని పూల మొక్కలే కాకుండా, విదేశాల నుంచి తెచ్చిన ఎన్నో రకాల పూల మొక్కలు ఇక్కడ దర్శనమిస్తాయి. బొటానికల్ గార్డెన్‌లో ఓ అక్వేరియం కూడా ఉంది. అందులోని అరుదైన ‘ఆర్నమెంటల్ చేపలు’ భలే అందంగా అలరిస్తుంటాయి. పాండిచ్చేరికి వెళ్లేవారు ఈ గార్డెన్‌ను దర్శించపోతే... వారి విహారం పూర్తి కానట్టే. మరో చెప్పుకోదగ్గ ప్రదేశం భారతి పార్కులో గల మ్యూజియం. ఈ మ్యూజియంలోని శిల్ప సంపద ఒకదాన్ని మించి మరొకటి మనల్ని కట్టిపడేస్తాయి. పాండిచ్చేరికి సమీపంలో విల్లుపురం, మధురై, త్రివేంద్రం... రైల్వే స్టేషన్స్‌లు ఉన్నాయి. ఈ మూడింటిలో ఎక్కడినుండైనా సులభంగా పాండిచ్చేరి చేరుకోవచ్చు.

ఈ శీర్షిక మీదే..

మీరు ఎన్నో ప్రదేశాలు చూసి ఉంటారు. మీ అనుభూతులను, ప్రయాణంలో ఎదురైన అనుభవాలను జరదేఖో పాఠకులతో పంచుకోండి..

jaradekhont@gmail.com

మా చిరునామా..
నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020

జట్టులో కొత్త కల్చర్!

● ఆటగాళ్లు త్వరగా పరిణతి చెందారు ● కెప్టెన్ విరాట్ కోహ్లి ఆసక్తికర వ్యాఖ్య



నవతెలంగాణ-పల్లెకల్ :

ప్రస్తుత టీమ్ ఇండియాకు సరికొత్త సంస్కృతి ఉందా?!. గత జట్ల స్వభావానికి భిన్నమైన దారిలో కోహ్లిసేన వెళుతోందా? ప్రస్తుత కొత్త కల్చర్‌లోనే ఆటగాళ్లు పరిణతి చెందుతున్నారా?. పల్లెకల్‌లో టీమ్ ఇండియా క్లీన్‌స్వీప్ విజయానంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కెప్టెన్ విరాట్ కోహ్లి వ్యాఖ్యలు ఈ సరికొత్త చర్చకు దారితీస్తున్నాయి. గత జట్లకు భిన్నంగా అంటే ఎం.ఎస్ ధోని సారథ్యంలోని జట్టుకు భిన్నమైనదనా? లేక మాజీ కోచ్ అనిల్ కుంబ్లే సమయంలో ఉన్న కల్చర్‌కు భిన్నమైనదనా అనేది కోహ్లి చెప్పకపోయినా.. కొత్త కల్చర్ అని పాత పద్ధతులపై పరోక్ష చురక అంటించాడు!. అయితే, ఈ సందర్భంలోనూ కొత్త కల్చర్‌లో ఆటగాళ్లు ఒకరిపై ఒకరు స్వేచ్ఛగా జోక్‌లు వేసుకుంటున్నారని.. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేదని కోహ్లి చెప్పుకొచ్చాడు. మాకు కఠినంగా వ్యవహరించే కుంబ్లే వంటి కోచ్ వద్దు, సరదాగా ఉండే రవిశాస్త్రి వంటి కోచ్ కావాలని కోహ్లి కోరినట్టు వచ్చిన వార్తల్లో నిజముందని ప్రస్తుతం అతడి వ్యాఖ్యలే చెబుతున్నాయి!. ' ప్రస్తుత జట్టులో, మేము కలిసిఆడుతున్న స్నేహితులం. సీనియర్, జూనియర్ అని లేదు. ఏ ఆటగాడు ఎన్ని మ్యాచులు ఆడాడు అనే ప్రస్తావన డ్రెస్సింగ్‌రూమ్‌లో లేదు. డ్రెస్సింగ్‌రూమ్‌లో ఎవరిమీదైనా జోక్‌లు వేయవచ్చు. అందుకే ఈ జట్టును చూసి నేను గర్వపడుతున్నాను. ఇలాంటి వాతావరణాన్ని మనం ఉంచగలిగితే, కొత్త ఆటగాళ్లు త్వరగా పరిణతి చెందగలరు. ఒత్తిడి ఉండదు. కలిసికట్టుగా స్నేహితుల్లా ఆడుతూ మేం సృష్టించగలిగిన ప్రత్యేకత ఇది' అని విరాట్ కోహ్లి పేర్కొన్నాడు. అనిల్ కుంబ్లే చీఫ్ కోచ్‌గా తప్పుకున్న తర్వాత శ్రీలంకలో క్లీన్‌స్వీప్ విజయం సాధించిన కోహ్లి.. విజయానంతరం కొత్త కల్చర్ అంటూ వ్యాఖ్యానించటం క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

ఆగస్టు 15న, భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీమ్ ఇండియా శ్రీలంకలో జాతీయ జెండా ఎగురవేసింది. ప్రస్తుతం మధ్య శ్రీలంకలోని కాండీ పట్టణంలో ఉన్న కోహ్లి గ్యాంగ్.. మంగళవారం జెండా ఎగురవేసింది. 15 మంది జట్టు సభ్యులు, చీఫ్ కోచ్ రవిశాస్త్రి సహా సహాయక సిబ్బంది హాజరైన కార్యక్రమంలో కెప్టెన్ కోహ్లి జెండా ఆవిష్కరణ గావించాడు. ట్వీట్టర్‌లో వీడియో పోస్ట్ కూడా చేసిన కోహ్లి.. చిన్ననాటి పంద్రాగస్టు జ్ఞాపకాలను గుర్తుచేసు కున్నాడు. ఆగస్టు 15నే కోహ్లి తండ్రి పుట్టినరోజు సైతం కావటంతో ఈ రోజు అతడికి మరింత స్పెషల్ అని వీడియో పోస్ట్‌లో చెప్పాడు.

టాప్-10లో రాహుల్

ధావన్ కెరీర్ బెస్ట్ ర్యాంక్

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్

దుబాయ్ : టీమ్ ఇండియా ఓపెనర్లు ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో కెరీర్ అత్యుత్తమ ర్యాంకుల్లో నిలిచారు. శ్రీలంకతో మూడు మ్యాచుల టెస్టు సిరీస్‌లో మెరిసిన లోకేశ్ రాహుల్, శిఖర్ ధావన్‌లు ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానాల్లో నిలిచారు. పల్లెకల్‌లో టెస్టులో 85 పరుగులు చేసిన లోకేశ్ రాహుల్ రెండు స్థానాలు మెరుగై తొమ్మిదో స్థానంలో నిలిచాడు. మరోవైపు సిరీస్‌లో రెండు శతకాలు సహా 358 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన శిఖర్ ధావన్ పది స్థానాలు మెరుగై 28వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. 86 బంతుల్లోనే శతకబాది కెరీర్ తొలి సెంచరీ సాధించిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య 45 స్థానాలు ఎగబాకి 89వ ర్యాంక్ సాధించాడు. ఇక చటేశ్వర్ పుజారా నాల్గో స్థానంలో ఉండగా, కెప్టెన్ విరాట్ కోహ్లి ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. అజింక్య రహానె పదో స్థానంలో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా రెండో స్థానానికి పడిపోగా షకిబ్ అల్ హసన్ అగ్రస్థానం తిరిగి కైవసం చేసుకున్నాడు. కానీ బౌలర్ల జాబితాలో జడేజా అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ బౌలర్లు, ఆల్‌రౌండర్ల జాబితాలో మూడోస్థానంలో నిలిచాడు. జట్టు జాబితాలో టీమ్ ఇండియా అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నది.



నెదర్లాండ్స్‌పై జయహో

2-1తో హాకీ ఇండియా విజయం

న్యూఢిల్లీ : హాకీ ఇండియా అద్భుత విజయం అందుకున్నది. వరల్డ్ నెం.4 నెదర్లాండ్స్‌ను వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడించిన హాకీ ఇండియా రెండు మ్యాచుల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకున్నది. నెదర్లాండ్స్ తరఫున సీనియర్ ఆటగాళ్లు బరిలో నిలువగా, హాకీ ఇండియాలో జూనియర్ జట్టు నుంచి వచ్చిన వారే తొమ్మిది మంది ఉన్నారు. దీంతో ఈ విజయం మరింత ప్రత్యేకంగా నిలుస్తుంది. మంగళవారం నాటి మ్యాచ్‌లో 2-1తో గెలుపొందిన భారత్ సిరీస్‌ను ఖాతాలో వేసుకున్నది. గుర్జంత్ సింగ్, మన్‌దీప్ సింగ్‌లు చెరో గోల్‌తో మెరిసి భారత్‌ను ముందంజలో నిలిపారు. నాల్గో నిమిషంలోనే కలిసొచ్చిన పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకున్న భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. నాల్గో నిమిషంలో గుర్జంత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. అర్మన్ ఖురేషి సైతం గొప్ప ఫ్లిక్‌తో గోల్ కొట్టినంత పనిచేసినా.. తృటిలో చేజారింది. ఆఖర్లో 51వ నిమిషంలో గోల్ చేసిన మన్‌ప్రీత్ సింగ్ భారత్‌కు రెండో గోల్ అందించాడు. డచ్ సైతం ఓ గోల్ సాధించినా... భారత్‌ను నిలువరించలేకపోయింది. మన్‌ప్రీత్ సింగ్ సారథ్యం వహించిన ఈ సిరీస్‌లో భారత్ 2-0తో ఏకపక్ష విజయం సాధించటం విశేషం. అత్యంత అనుభవజ్ఞులైన డచ్ ఆటగాళ్లపై కుర్రాళ్ల మెరుపు ప్రదర్శన భారత్‌కు కొండంత సానుకూలత. ' ఈ విజయం పట్ల ఎంతో సంతోషంగా ఉంది. చాలా మంది అరంగ్రేట ఆటగాళ్లే. అయినా జట్టుగా గొప్ప ప్రదర్శన చేశాం. ఏ దశలోనూ నిరాశకు లోనుకాలేదు, ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. మంచి విజయం' అని మన్‌ప్రీత్ సింగ్ వ్యాఖ్యానించాడు.



ప్రో కబడ్డీ కామెంటరీ బాక్స్‌లో బాలీవుడ్ తారలు జాక్వలిన్ ఫెర్నాండేజ్, సిద్ధార్థ్ మల్హోత్రా సందడి

పుణె ఫటాఫట్

బెంగాల్‌పై 34-17తో గెలుపు

అహ్మదాబాద్ : పుణెరి పల్టన్ రెచ్చిపోయింది. స్టార్ ఆల్‌రౌండర్ సందీప్ నర్వాల్ ఆకట్టుకున్న వేళ.. బెంగాల్ వారియర్స్‌పై తిరుగులేని విజయం సాధించింది. సందీప్ నర్వాల్ కూతకెళ్లి మూడు పాయింట్లు సహా మరో నాల్గు టాకిల్స్ చేయటంతో పుణెరి పల్టన్ 34-17తో 17 పాయింట్ల తేడాతో బెంగాల్‌ను ఓడించింది. రైడర్ మోరె సైతం ఆరు పాయింట్లు సాధించగా.. గిరీష్ నాల్గు టాకిల్స్‌తో దుమ్మురేపాడు. కానీ బెంగాల్ తరఫున మహిందర్ సింగ్ (6), రాణ్ సింగ్ (7) మినహా మరెవ్వరూ రాణించలేదు. స్టార్ రైడర్ జాంగ్ కున్ లీ కేవలం ఒక్క పాయింట్‌కే పరిమితమవ్వటం.. బెంగాల్ అవకాశాలను దెబ్బతీసింది. బెంగళూర్ బుల్స్, గుజరాత్‌ఫార్చ్యూన్‌జెయింట్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ గెలుపొందింది. హోరాహోరీ పోరులో 27-24తో గుజరాత్ పైచేయి సాధించింది. ఓ దశలో 20-12తో బుల్స్ ముందంజలో నిలిచినా.. ఆధిక్యం నిలుపుకోవటం విఫలమైంది.

మా గొంతు నులిమి.. వారికి ప్రాణం పోస్తరా!

మునిగేది వెయ్యి ఎకరాలకు పైనే... సర్కారు చెప్పేది 40 ఎకరాలేనా?

- మేడిగడ్డ నిర్వాసితుల ఆవేదన
- సూరారంలో భూసేకరణకు నోటిఫికేషన్లు
- రైతుల అనుమతి లేకుండానే సర్వేలు

నవతెలంగాణ-జయశంకర్ ప్రతినిధి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండల పరిధిలో గోదావరి నదిపై 16.17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో మేడిగడ్డ బ్యారేజీ కట్టనున్నారు. మేడిగడ్డలో 250 ఎకరాలకుపైగా మెగా కంపెనీ ఇప్పటికే కొనుగోలు చేసింది. అదే బ్యారేజీ పరిధిలో భూసర్వేకోసం వచ్చిన అధికారులను సూరారం గ్రామస్తులు పలు సార్లు వెనక్కి పంపించారు. భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. దీంతో అధికారులు కొంత మంది దళారులను రంగంలోకి దించి భూసేకరణకు చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. మీరు ఎన్ని చేసినా భూసేకరణ ఆగదని గతంలోనే పలుమార్లు అధికారులు గ్రామస్తులను బెదిరించారు. అందులో భాగంగానే భూసేకరణ కోసం పత్రికల్లో ప్రకటనలు ఇప్పిస్తున్నారు. రైతులు అభ్యంతరం వ్యక్తం చేసినా బలవంతంగానైనా భూసేకరణ చేసే అవకాశం ఉందని ప్రచారంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



విభజించి.. సేకరించు..

మేడిగడ్డ బ్యారేజీ సమీపంలో మేడిగడ్డ, సూరారం, బెగ్లూరు, గ్రామాల్లో అంతా కలిపి 450 ఎకరాల వరకు సేకరించాల్సి ఉందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటు న్నారు. ఇప్పటికే మేడిగడ్డలో భూసేకరణ పూర్తయింది. ఇక సూరారం, బెగ్లూర్ గ్రామాల్లో సేకరణ చేపట్టాలి. ఆ రెండు గ్రామాల శివారు భూములన్నీ గోదావరి నది తీరంలోనే ఉంటాయి. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మిస్తే.. ఆ గ్రామాల భూములన్నీ దాదాపు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని నీటి పారుదల రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ లెక్క ప్రకారం అయితే సూరారం గ్రామ శివారుకు చెందిన వెయ్యి ఎకరాలకుపై చిలుకు భూములకు పరిహారం చెల్లించాలి. కానీ, తాజా భూసేకరణ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌లో సూరారం శివారు నుంచి 35 ఎకరాల 39 గుంటలే అవసరమని సర్కారు పేర్కొంది. అవసరాన్ని బట్టి మరో 50 ఎకరాల వరకు సేకరించాల్సి రావచ్చని అధికారులు చెబుతున్నారు. అంటే ఈ ఒక్క గ్రామం పరిధిలో 80 ఎకరాలు మినహా మిగతా భూములకు ఎలాంటి ముంపు లేదని నమ్మబలుకుతున్నారు. తక్కువ భూమి పోతున్నట్టు చూపి సేకరించే పనిలో పడ్డారు. అధికారులు తెలివిగా రైతులను చీల్చి భూసేకరణ కానిచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నెలాఖారు వరకు భూసేకరణ పూర్తి చేస్తాం

ఈ నెల 31 వరకు మేడిగడ్డ బ్యారేజీ పరిధిలో భూసేకరణ పూర్తిచేస్తాం. బ్యారేజీ పరిధిలో 470 ఎకరాలను సేకరించాల్సిందిగా గుర్తించాం. బ్యారేజీ అవసరాల రీత్యా భవిష్యత్తులో భూసేకరణ పెరగొచ్చు. కలెక్టర్ సమక్షంలో చర్చించి నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తాం.

ఓంకార్ సింగ్ (మేడిగడ్డ బ్యారేజీ, ఈఈ)

సూరారం, బెగ్లూరు సాగు భూములకు ముంపే..?

సాధారణంగా వర్షాకాలంలో గోదావరికి వరద ఉధృతి పెరిగితేనే సూరారం, బెగ్లూర్ గ్రామ శివారు సాగు భూములు జలమయమవుతాయి. అలాంటిది మేడిగడ్డ వద్ద నిర్మించి తలపెట్టిన బ్యారేజీ నుంచి నీటిని ప్రతి సంవత్సరం..రోజుకు రెండు టీఎంసీల లెక్కన ఎనభై రోజులు గోదావరి నుంచి 160 టీఎంసీలను కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా తరలించాలనే ప్రతిపాదన. ఇలాంటి భారీ బ్యారేజీ నిర్మించినప్పుడు తప్పనిసరిగా తమ భూములు సైతం ముంపునకు గురవుతాయనేది సహజమైన వాదనే. ఇదే భావనలో రైతాంగం ఉంది. దీంతో తమ భూములకు ఎకరాకు ఎంత పరిహారం చెల్లించేది చెప్పాలని అధికారులను ప్రశ్నిస్తే..సంబంధిత అధికారులు రైతాంగమే భూములు ఇచ్చేందుకు వెంట బడుతోంది'..అని తప్పుడు ప్రచారం చేస్తుండటం గమనార్హం.

అధికారుల తీరుకు నిరసనగా ఆందోళనలు

ప్రభుత్వానికి మేడిగడ్డ అంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు అయితే..మా భూములు మాకు అంతే ముఖ్యం. రైతులకు సమాచారం లేకుండానే భూసేకరణ కోసం నివేదికలు తయారు చేస్తుండ్రు. భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు 20 లక్షల రూపాయలు చెల్లించాలి. రైతులే భూములు ఇచ్చేందుకు ముందుకొస్తుండ్రని చేస్తున్న ప్రచారం తప్పు. అధికారుల తీరుకు నిరసనగా రైతులందరం కలిసి ఆందోళనలకు దిగుతాం.

నాగుల ఆశోక్‌రెడ్డి (రైతు సంఘం నాయకులు)

ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి

భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి. భూములపై ఆధారపడి జీవిస్తున్నాం. భూములు కోల్పోతే రోడ్డున పడతాం. భవిష్యత్తు తరాలకు కోలుకోని దెబ్బే. నిర్వాసితులందరికీ ప్రభుత్వమే ఉపాధి కల్పించాలి.

చల్లా శ్రావణ్‌రెడ్డి (భూనిర్వాసిత యువజన కమిటీ కన్వీనర్)



బండపాపయ్య

'ప్రాణం లెక్క జూసుకుంటున్న మా భూముల్ని గుంజుకొని రోడ్డు పాల్జేస్తరా. మా గొంతు నులిమేసి వేరేవాళ్లకు ప్రాణం పోస్తరా. ఇదెక్కడి అన్యాయం. భూములు తీసుకునుడే అని పేపర్లో ఇస్తుండ్రని పోరగాండ్లు చెబుతుంటే ప్రాణం తల్లడిల్లుతున్నది. గోదావరి వరదలొస్తే మా భూములన్నీ మునుగుతయి. గసోంటిది మేడిగడ్డ రిజర్వాయర్‌కు 35 ఎకరాల 39 గుంటలే అవసరమని సర్కారోల్లు చెప్తుండ్రు. ఇదంతా పచ్చి అబద్ధం. వెయ్యి ఎకరాలకుపైనే భూమి పాడైపో తది. తీసుకునే భూమికి గిట్ల ఎంత పరిహారం ఇస్తరు? ఎప్పటి దాకా భూముల్ల ఉండనిస్తరు? బతుకు దెరువు ఎట్లజూపిస్తరు? గిసోంటి దాన్ల మీద ఎవ్వరు మాట్లాడ్తలేరు. మా భూముల్లో మేమే పరాయోల్లం అయినం.' అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన బండపాపయ్య, ముల్కల్ల రామక్కల ఆవేదన ఇది.



ముల్కల్ల రామక్క

యోగి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో బీఆర్డీ ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరత వల్ల 70 మంది పిల్లల మరణానికి బాధ్యులైన సీఎం అధిత్యనాథ్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ నగర సమితి కార్యదర్శి ఈటి నర్సింహా అధ్యక్షన ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోపాల్గొన్న చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను గాలికొదిలి, మత ప్రచారాలకు ప్రాధాన్యతిస్తున్న ప్రభుత్వం అధికారంలో ఉండకూడదన్నారు. పసి పిల్లల మరణాలు సహజమేనని బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా మాట్లాడం సరైంది కాదన్నారు. తల్లిదండ్రుల బాధ సన్నాసులకు తెలియదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్. చాయదేవి, బి. వెంకటేశం, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. అనిల్, పార్టీ నగర కార్యవర్గ సభ్యులు సలీంఖాన్, రాజేందర్, చంద్రమోహన్, గెల్వాలయ్య, వీరేశం, శ్రీకాంత్, హరినాథ్‌గౌడ్, యాదయ్య తదితరుల పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అసెంబ్లీ, ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సచివాలయంలో సీఎస్ ఎస్పీ సింగ్ ఆవిష్కరించారు. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ జాతీయజెండాను ఎగురవేశారు. ప్రజారంజక పాలనను అందిస్తున్నామని టీఆర్ఎస్ నేతలు పేర్కొంటే.. ప్రజాస్వామ్యం లేకుండా చేశారని, ఎక్కడా అభివృద్ధి కానరావడం లేదని ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శించారు.

సెట్విన్‌లో స్వాతంత్ర వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ప్రధాన కార్యలయంలో మంగళవారం 71వ సాతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. సంస్థ చైర్మెన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ, మేనేజింగ్ డైరెక్టర్ పి. వైద్యనాథరావు, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వేణుగోపాల్‌రావుతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.